www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price): Rs. 6.50
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 28
బుధవారం | 14-5-2025
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.2:30 తదుపరి తదియ, నక్షత్రం: అనూరాధ ఉ.11:47 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా.5:55-7:41, దుర్ముహూర్తం: ఉ.11:45-12:37, అమృతఘడియలు: తె.4:27-6:13, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:36
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చార్మినార్ చెంత.. అందాల పుంత



ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్

చారిత్రక కట్టడానికి అందాల భామలు ఫిదా

మినార్లను ప్రత్యక్షంగా తిలకించి తన్మయత్వం 14

హైదరాబాద్ చార్మినార్ చెంత మిస్ వరల్డ్ పోటీదారుల గ్రూప్ ఫొటో. అక్కడి లాడ్ బజార్‌లో షాపింగ్ చేస్తున్న దృశ్యం



9 రోజులు ముందుగానే నైరుతి



అండమాన్‌ను తాకిన రుతుపవనాలు

27న కేరళలోకి ప్రవేశించే అవకాశం 2

16-22 మధ్య అల్పపీడనం.. తుఫాన్‌గా మారే చాన్స్.. నేడు, రేపు రాష్ట్రంలో వర్షాలు

ఆదాయం పెంచండి

ఆర్జన అవకాశాలపై అధ్యయనం చేయండి

సొంత ఆదాయం పెంచుకునేందుకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, సేవల రంగాలు దోహదం 13

బంగారం కొనుగోళ్లలో పన్ను ఎగవేతలున్నాయి

ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థ ఏర్పాటు చేయాలి

ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈఏడాది 1.34 లక్షల కోట్ల ఆర్జన లక్ష్యం

దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం 2

ఈ ప్రాజెక్టుతో 26 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

హైకోర్టు సీజేతో సీఎం చంద్రబాబు భేటీ

నూతన హైకోర్టు భవనం డిజైన్లు చూపించిన సీఎం 13

కర్నూలులో బెంచ్ ఏర్పాటు, రెరా చైర్మన్ నియామకంపైనా చర్చ



రిటైర్మెంట్ తర్వాత.. ఏ పదవీ తీసుకోను

న్యాయ రంగానికి సేవలు కొనసాగిస్తా

పదవీకాలం చివరి రోజున సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా స్పష్టీకరణ

తదుపరి సీజేఐ జస్టిస్ గవాయ్ బలమైన మద్దతుదారుగా వెంట నిలిచారని వెల్లడి

ఎమర్జెన్సీలో హక్కులకై నిలబడిన జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా వారసత్వం నిలబెట్టారు

జస్టిస్ ఖన్నాపై పలువురి ప్రశంసలు

న్యూఢిల్లీ, మే 13: పదవీ విరమణ అనంతరం ఏ అధికారిక పదవినీ చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్‌ఖన్నా స్పష్టంచేశారు. సీజేఐగా తన పదవీకాలం చివరి రోజైన మంగళవారం విధుల అనంతరం సుప్రీంకోర్టు ఆవరణలో జస్టిస్ ఖన్నా విలేకర్లతో మాట్లాడారు. రిటైర్మెంట్ అనంతరం అధికారిక పదవులను వేటినీ తీసుకోనప్పటికీ, న్యాయ రంగానికి సంబంధించి సేవలను మాత్రం తప్పకుండా కొనసాగిస్తానని స్పష్టంచేశారు. అంతకుముందు జస్టిస్ గవాయ్,

మిగతా 11వ పేజీలో...

ఆపరేషన్ సిందూర్..

పాక్‌కు లక్ష్మణ రేఖ

'భారత్ మాతాకీ జై'.. శత్రువుల వెన్నులో వణుకు పుట్టించింది

వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నా

త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టికరిపించాయి

అణు బెదిరింపులనూ అపహాస్యం చేశాయి

మరోసారి పాక్ దాడికి యత్నిస్తే వినాశనమే!

అదంపూర్ వైమానిక స్థావరంలో ప్రధాని మోదీ



అదంపూర్, మే 13: భారత్ మాతా కీ జై.. ఈ నినాదం శత్రువుల చెవుల్లోనూ మార్మోగిందని, వారి వెన్నులో వణుకు పుట్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు స్పష్టమైన 'లక్ష్మణ రేఖ'ను గీశామన్నారు. "భారతదేశం తన భద్రతా దళాలకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది. మన దేశం కోసం వారు చేస్తున్న త్యాగాలు ఎనలేనివి" అని పేర్కొన్నారు. మంగళవారం మోదీ పంజాబ్‌లోని అదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. ఇది భారత్‌లోని రెండో అతిపెద్ద ఎయిర్‌బేస్. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పాకిస్థాన్ బలగాలు లక్ష్యంగా చేసుకోవాలని యత్నించిన వాటిలో అదంపూర్ వైమానిక స్థావరం కూడా ఉండడం గమనార్హం. అంతేకాదు.. తాము ఈ స్థావరాన్ని

మిగతా 12వ పేజీలో...

భారత్ ఎస్-400 రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామన్న పాక్ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ.. అదంపూర్ వైమానిక స్థావరంలో ఎస్-400 ముందు ప్రసంగించిన ప్రధాని మోదీ

మా జవాన్లు 11 మంది మృతి

మరో 78 మందికి గాయాలు: పాక్ మిలిటరీ

కాల్పుల విరమణకు మేం పరుగెత్తుకు వచ్చామనేది పచ్చి అబద్ధం: పాక్ విదేశాంగ శాఖ

అబద్ధాల ఫ్యాక్టరీ.. పాకిస్థాన్ 12

అదంపూర్ స్థావరం నాశనం అంటూ ఫొటోలు

అదంతా అబద్ధమని తేల్చిన ప్రధాని నరేంద్ర మోదీ

ఇతర ఎయిర్‌బేస్‌లపైనా పాక్ తప్పుడు ప్రచారం



మద్యం ముడుపులను షెల్ కంపెనీలకు మళ్లించిన వ్యవహారంలో గోవిందప్ప కీలకం

భారతీ సిమెంట్స్ డైరెక్టర్‌గా స్కామ్‌లో భూమిక

సీఏగా తెలివితేటలు వాడి తాడేపల్లికి సొమ్ములు

బాలాజీ గోవిందప్ప అరెస్టు!

మద్యం కేసులో కీలక మలుపు

సిట్ విచారణ ఎగ్గొట్టి అజ్ఞాతంలో.. కర్ణాటకలో ఆచూకీ..

చివరికి చామరాజనగర్ జిల్లా బీఆర్‌హిల్స్‌లో అరెస్టు

బెజవాడకు తీసుకొస్తున్న అధికారులు.. నేడు కోర్టుకు!

జగన్ ఓఎస్డీ కుమారుని వ్యాపారాల్లో తనిఖీలు

హైదరాబాద్‌లో ఆరుచోట్ల సోదాలు, డాక్యుమెంట్లు సీజ్

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీంలో మధ్యంతర ఊరట

మిథున్‌రెడ్డికి చుక్కెదురు.. మధ్యంతర రక్షణ ఆదేశాలు రద్దు

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక నిందితుడిని సిట్ అరెస్టు చేసింది. జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఈకేసులో కర్ణాటకలో అదుపులోకి తీసుకుంది. మద్యం ముడుపులను షెల్ కంపెనీల్లోకి మళ్లించిన వ్యవహారంలో బాలాజీ పాత్రే కీలకమని సిట్ ఇప్పటికే గుర్తించింది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా తన తెలివితేటలను వాడి తాడేపల్లి ప్యాలె‌స్‌కు ఆయన సొమ్ములు తరలించారనేందుకు ఆధారాలు సేకరించింది. ఈ నెల 11న విచారణకు రావాల్సిందిగా సిట్ ఈ నెల తొమ్మిదో తేదీన

మిగతా 14వ పేజీలో...

ప్రతి తరగతికీ టీచర్!



పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

9 రకాలుగా స్కూళ్ల విభజన

4 రకాల ఉన్నత పాఠశాలలు

కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్లు

3,228 పోస్టులు సృష్టి

క్షేత్రస్థాయిలో క్లస్టర్ టీచర్లు

వైసీపీ జీవో 117 ఉపసంహరణ

కొత్త విధానంపై జీవో 19 జారీ

ఈ విద్యాసంవత్సరం నుంచే..

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): సర్కారీ స్కూళ్లను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో 117కు స్వస్తి పలికి, కొత్త విధానంపై జీవో 19 విడుదల చేసింది. దీనికి అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను హేతుబద్ధీకరిస్తూ మరో జీవో 21ని జారీ చేసింది. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, గిరిజన సంక్షేమ పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని జీవోలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆరు రకాల బడుల విధానం అమల్లో ఉండగా, నూతన విధానంలో 9 రకాలుగా విభజించారు. 'మోడల్ ప్రైమరీ

మిగతా 2వ పేజీలో...

91 పెద్ద కంపెనీలు వస్తున్నాయ్

ప్రతి కంపెనీకి ఓ నోడల్ అధికారి

యూనిట్లు వేగంగా స్థాపించేలా చూడాలి

ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

నెలాఖరుకు వాట్సా‌ప్‌లో 400 సేవలు

ఆర్‌టీజీఎస్‌పై సమీక్షలో మంత్రి లోకేశ్



అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. మంగళవారం ఉండవల్లి నివాసంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్)పై సమీక్ష నిర్వహించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఆ కంపెనీలు రూ.91,839 కోట్ల పెట్టుబడులు పెట్టి, 1,41,407 ఉద్యోగాలను

మిగతా 13వ పేజీలో...

కొత్త ఆవిష్కరణకు దిగ్గజాల తోడు

త్వరలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల ఏర్పాటే లక్ష్యం

జగన్ సర్కారు రాజకీయ లబ్ధి కోసం, అస్మదీయులకు మేలు చేసేందుకు, 'సెటిల్‌మెంట్ల' కోసం... నిషేధిత జాబితాలోని భూములను యథేచ్ఛగా 'ఫ్రీ హోల్డ్' చేసేసింది!

వైసీపీ సర్కారు పోయింది! కూటమి సర్కారు వచ్చింది! జగన్ సర్కారు చేసిన తప్పు సరిదిద్దే పేరిట... చిన్నాచితక రైతులనూ ఇబ్బంది పెడుతోంది! 'ఫ్రీ హోల్డ్'పై ఎటూ తేల్చకుండా కాలం గడిపేస్తోంది!



ఇలా చేయాలి

నిజంగా భూ అక్రమార్కులకు మేలు చేయకూడదని ప్రభుత్వం భావిస్తే.. ఫ్రీహోల్డ్ భూముల బల్క్ రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలి.

బినామీ భూముల రిజిస్ట్రేషన్‌లు ఆపాలి.

భూ అక్రమార్కులపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

నిబంధనలకు లోబడి ఫ్రీహోల్డ్ అయిన అర ఎకరం, ఎకరం, రెండెకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వాలి.

నెలలకొద్దీ నాన్చుడు!

నాడు అడ్డగోలుగా జగన్ నిర్ణయం

ఏకంగా 13 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్

అందులో 5.75 లక్షల ఎకరాలు అక్రమమే

చర్యలు తీసుకోవాల్సింది వీటిపైనే..

కానీ.. మొత్తంగా రిజిస్ట్రేషన్లు ఆపిన ప్రభుత్వం

ఎకరం, రెండెకరాల రైతులకు తీరని కష్టం

పరిష్కారంపై స్పష్టత ఉన్నా వాయిదాల పర్వం

మరో 2 నెలలపాటు నిషేధం పొడిగింపు

'ఫ్రీహోల్డ్'పై ఎటూ తేల్చని సర్కారు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

భారీగా, అక్రమంగా నిషేధిత భూములను ఫ్రీహోల్డ్ చేయించుకున్న వారూ... అర ఎకరం, ఎకరం భూములున్న బక్క రైతులూ ఒకటేనా?

ఇది రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్న ప్రశ్న! ఫ్రీహోల్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం ఎటూ తేల్చకుండా... పదినెలలుగా నాన్చుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. చట్ట విరుద్ధంగా చేతులు మారిన భూముల విస్తీర్ణం ఎంతో తెలుసు! వాటి వెనుక ఉన్నదెవరో తెలుసు! ఇలాంటి భూములపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై ఇప్పటికే ఒక నివేదిక ఉంది! అయినా సరే.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. తాజాగా.. ఫ్రీహోల్డ్ భూములపై నిర్ణయాన్ని మరో రెండు నెలలు వాయిదా వేసింది. దీంతో... చిన్న రైతులూ ఇబ్బంది పడుతున్నారు. అటు ప్రభుత్వానికి

మిగతా 14వ పేజీలో...

ఈతకు వెళ్లి మృత్యు ఒడికి!

చెరువులో మునిగి ఐదుగురు చిన్నారుల మృతి

కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో విషాదం 2

పొట్టకూటి కోసం వెళుతూ మృత్యువాత

నలుగురు బొప్పాయి కోత కూలీలు మృతి.. ముగ్గురికి గాయాలు

ఎదురెదురుగా వేగంగా ఢీకొన్న ట్రాలీ బొలెరో, లారీ

పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం 3

సీబీఎస్ఈ ఫలితాల్లో బాలికలదే పైచేయి 11

10వ తరగతిలో 93%, 12లో 88% ఉత్తీర్ణత

స్టేట్ టాపర్ లాస్యరెడ్డి

జాతీయ స్థాయిలో మూడో స్థానం



లాస్యరెడ్డి

కల్తీ మద్యం తాగి 17 మంది మృతి

పంజాబ్‌లో ఘటన.. మృతుల్లో అత్యధికులు కూలీలు 11

ఇవి మరణాలు కావు... హత్యలు.. బాధ్యులను వదిలిపెట్టం

కఠినంగా శిక్షిస్తాం: పంజాబ్ సీఎం భగవంత్ మాన్

అటవీ భూముల్ని రక్షించలేని అధికారులపై చర్యలు

పెద్దిరెడ్డి కుటుంబ ఆక్రమణలపై క్రిమినల్ కేసులు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు 13

ఎమ్మెల్యే గుమ్మనూరు సోదరుడి అరెస్టు

కాంగ్రెస్ నేత హత్య కేసులో 14 రోజుల రిమాండ్

'చల్లని' కబురు వచ్చేసింది!

అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

2-3 రోజుల్లో అరేబియా సముద్రంలోకి ప్రవేశం

27న కేరళను తాకే చాన్స్.. నేడు, రేపు వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎండలతో మండుతున్న ప్రజలకు చల్లని కబురు వచ్చింది. గత కొద్ది రోజులుగా చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు మంగళవారం దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మేరకు రుతుపవనాలు ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా అండమాన్ నికోబార్ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇంకా హిందూ మహాసముద్రం నుంచి దక్షిణ బంగాళాఖాతం మీదుగా నికోబార్ దీవుల వరకూ సముద్ర ఉపరితలానికి 1.5 కి.మీ నుంచి 4.5 కి.మీ ఎత్తులో పడమర గాలులు బలంగా వీస్తున్నాయి. అదే సమయంలో దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని అండమాన్ నికోబార్ దీవుల్లో దట్టంగా రుతుపవన మేఘాలు ఆవరించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న వాతావరణ శాఖ నైరుతి రుతుపవనాల ప్రవేశంపై ప్రకటన చేసింది. రానున్న 2-3 రోజుల్లో దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులు మొత్తం, అండమాన్ సముద్రంలో మిగిలిన ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతంలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని పేర్కొంది.

9 రోజులు ముందుగానే..

సాధారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లోకి మే 22న రుతుపవనాలు ప్రవేశించాలి. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో 9 రోజులు ముందుగానే నికోబార్ దీవులు, దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్రంలోకి రుతుపవనాలు వచ్చేశాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళను ముందస్తుగా ఈనెల 27వ తేదీనే (సాధారణ తేదీ జూన్ 1) తాకుతాయని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. అలా జరిగితే 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగానే రావడం మళ్లీ ఇప్పుడు అవుతుంది. ఆ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 23వ తేదీనే కేరళలోకి ప్రవేశించాయి. కాగా, మంగళవారం అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో ఈ నెల 16 నుంచి 22వ తేదీ మధ్య తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఇది మరింత బలపడి ఈనెల 23వ తేదీ తర్వాత తుఫాన్‌గా మారే అవకాశం ఉందని బంగ్లాదేశ్ వాతావరణ నిపుణుడు ముస్తాఫా కమల్ పాషా రెండ్రోజుల క్రితం సోషల్ మీడియాలో పోస్టు చేసినట్టు ఆంగ్ల పత్రికలు వెల్లడించాయి.

నేడు, రేపు పలు జిల్లాల్లో వర్ష సూచన

తూర్పు ఉత్తరప్రదేశ్ నుంచి బిహార్ మీదుగా దక్షిణ ఒడిశా వరకు, విదర్భ నుంచి కర్ణాటక మీదుగా కేరళ వరకు వేర్వేరు ఉపరితల ద్రోణులు విస్తరించాయి. ఇంకా అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. వీటి ప్రభావంతో మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల ఈదురుగాలులతో వర్షం కురిసింది. బుధ, గురువారాల్లో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువ చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థలు తెలిపాయి. బుధవారం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని, శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, కోనసీమ, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని, గంటకు 50-60 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నాయి. గురువారం అల్లూరి, ఉభయగోదావరి, అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, పల్నాడు, నంద్యాల, ప్రకాశం, కడప, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తు నిర్వహణ సంస్థ వివరించింది.



అండమాన్ నికోబార్ దీవులకు విస్తరించిన నైరుతి రుతుపవనాలను చూపే చిత్రం

రానున్న రెండ్రోజులు భిన్న వాతావరణం

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు భిన్న వాతావరణం నెలకొంటుందని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. కొన్ని చోట్ల అధిక ఉష్ణోగ్రతలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం చాలా చోట్ల 41-43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విజయనగరం, మన్యం, తూర్పుగోదావరి జిల్లాల్లోని 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 35 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. కాగా, మంగళవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో 43.2, అల్లూరి జిల్లా కొండాయిగూడెంలో 42.9, నెల్లూరు జిల్లా దగదర్తి, ప్రకాశం జిల్లా దరిమడుగులో 42.8, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఏలూరు జిల్లా రాజుపోతేపల్లి, పల్నాడు జిల్లా అమరావతిలో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, రాష్ట్రంలోని 74 ప్రాంతాల్లో 41 డిగ్రీలపైగా ఎండ ప్రభావం చూపింది.

లోకం తీరు



కాలువల మరమ్మతులకు రూ. 344 కోట్లు: నిమ్మల

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల మరమ్మతు పనుల కోసం రూ.344 కోట్లను వ్యయం చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. 'వర్షాకాలంలోగా సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, పూడికతీత పనులు చేపడుతున్నాం. 2019-24 మధ్య కాలంలో జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత జూన్‌లో రూ.90 కోట్లతో, సెప్టెంబరులో రూ.326 కోట్లతో అత్యవసర పనులు చేపట్టాం. సాగునీటి రంగాన్ని గాడిలో పెడుతున్నాం. రూ.10 లక్షలలోపు పనులను సాగునీటి సంఘాల సమాఖ్య ద్వారా, రూ.10 లక్షలకు పైబడ్డ పనులను స్వల్పకాలిక టెండర్లను పిలిచి పూర్తి చేయాలని నిర్ణయించాం. ఈ నెలాఖరులోగా టెండర్లను ఖరారు చేసి ఆగస్టు నాటికి నిర్దేశిత పనులు పూర్తి చేస్తాం' అని చెప్పారు.

తాగునీటికి 13.539 టీఎంసీలు

జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు వివిధ జల వనరుల నుంచి 13.538 టీఎంసీల ముడినీటిని సరఫరా చేసేందుకు జల వనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ పాలనామోదం తెలుపుతూ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. యేలేరు రిజర్వాయరు నుంచి 2.003టీఎంసీలు, ధవళేశ్వరం నుంచి 4.062, ప్రకాశం బ్యారేజీ నుంచి 4.489, వెలగలేరు రిజర్వాయరు నుంచి 0.327, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి 1.475, వెలిగల్లు నుంచి 0.3, అవుకు రిజర్వాయరు నుంచి 0.299, పులికమ్మ నుంచి 0.583 టీఎంసీల ముడి జలాలను తాగునీటి అవసరాల కోసం కేటాయిస్తున్నట్లుగా సాయిప్రసాద్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పలు కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): పలు కార్పొరేషన్ల చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ వడ్డెర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మల్లెల ఈశ్వరరావును, కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పెరిపి ఈశ్వర్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మను, ఏలూరు పట్టణాభివృద్ధి అథారిటీ చైర్‌పర్సన్‌గా వాణి వెంకట శివప్రసాద్ పెద్దిబోయినను, తిరుపతి పట్టణాభివృద్ధి అథారిటీ చైర్‌పర్సన్‌గా దివాకర్‌రెడ్డిని నియమిస్తూ మున్సిపల్ శాఖ వేరువేరు జీవోలను విడుదల చేసింది. వీరు రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 22 నామినేటెడ్ పోస్టులను ఇప్పటికే ప్రకటించారు. ఆ మేరకు ఆయా శాఖలు ఉత్తర్వులు జారీ చేస్తున్నాయి.

దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం.. 2 వేల ఎకరాల్లో.. 3500 కోట్లతో ఏర్పాటు

26 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం.. 35 వేల మందికి ఉపాధి లభించే చాన్స్

భూ సేకరణ బాధ్యత రాష్ట్రానిదే: సీఎం చంద్రబాబు



రాష్ట్రంలోని తీరప్రాంత అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీరంతో ఓడరేవుల ఆధారిత సంపదను సృష్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రతి 50 కిలోమీటర్లకు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని చేపడతామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో దుగరాజపట్నంలో రూ. 3,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రాన్ని స్థాపిస్తామని తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, ఆర్థికసృష్టి వంటి అంశాలపై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ శాఖ కార్యదర్శి టీకే రామచంద్రన్, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. తీరప్రాంతంలో చేపట్టే ప్రాజెక్టులు, ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మించదలచిన ఓడరేవుల స్థితిగతులపై సీఎం ఆరా తీశారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ అండ్ రిపేరు యూనిట్ ఏర్పాటుపై చర్చించారు. ప్రాథమికంగా అందిన ఫీజిబిలిటీ నివేదిక ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రెండు వేల ఎకరాల్లో షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సమీక్షలో నిర్ణయించారు. నౌకా నిర్మాణ కేంద్రానికి అనుబంధ పరిశ్రమల కోసం అదనంగా 1000 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని సమీక్షలో అధికారుల బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు భూసేకరణ బాధ్యతను రాష్ట్రం తీసుకుంటుందని సీఎం వెల్లడించారు. నౌకా నిర్మాణ కేంద్రం వల్ల ఈ ప్రాంతానికి దాదాపు రూ. 26,000 కోట్ల మేర పెట్టుబడులు వచ్చే వీలుందని అంచనావేశారు. ఈ కేంద్రంతో సహా అనుబంధ రంగాల వల్ల ప్రత్యక్షంగా 5,000 మందికి, పరోక్షంగా 30,000 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కుతాయని సమీక్షలో అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం స్థాపనకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

క్రూయిజ్ టూరిజంపై దృష్టి పెట్టాలి

విశాఖ షిప్‌యార్డులో సరుకు రవాణా మరింత సరళీకృతంగా, చౌకగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర కార్యదర్శిని చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం అవకాశాలపైనా అధ్యయనం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో రివర్ క్రూయిజ్ సర్క్యూట్‌లు అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ఈతకు వెళ్లి మృత్యు ఒడికి..!

- చెరువులో మునిగి ఐదుగురు చిన్నారుల మృతి
- కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో విషాదం
- నెల్లూరులో గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

బ్రహ్మంగారిమఠం/సంగం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారులు వేసవి సెలవుల్లో ఆనందంగా గడుపుదామని బంధువుల ఊరికి వెళ్లారు. అక్కడ సరదాగా ఈతకు చెరువుకు వెళ్లి.. అందులో గల్లంతై మృతిచెందారు. ఈ విషాద ఘటన కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బోధనం గ్రామానికి చెందిన సుబ్బయ్య కుమారులు చరణ్(15), పార్థు(12) వేసవి సెలవులకు అవ్వగారి ఊరు అయిన బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె గ్రామానికి వచ్చారు. అలాగే జమ్మలమడుగు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ కుమారుడు హర్ష (12) తన మేనత్త ఇంటికి వచ్చాడు. కాశినాయన మండలం మల్లేరు కొట్టాలు గ్రామానికి చెందిన నారాయణ కుమారుడు తరుణ్‌యాదవ్ (10) పెదనాన్న ఇంటికి వచ్చాడు. వీరితో పాటు మల్లేపల్లెకు చెందిన తరుణ్‌యాదవ్ కుమారుడు దీక్షిత్(12) కలసి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆడుకుంటూ రోడ్డుపైకి వెళ్లారు. సాయంత్రం 5 గంటలు దాటుతున్నా పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురై గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి చూడగా.. అక్కడ ఒడ్డుపై పిల్లల బట్టలు కనిపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మోటార్ల సాయంతో చెరువులో నీటిని తోడారు. రాత్రి 11 గంటల సమయంలో పిల్లల మృతదేహాలను గుర్తించారు.

అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

నెల్లూరు జిల్లా సంగం మండల పరిధిలోని కనిగిరి కాలువలో గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. కోవూరు స్టౌబీడీ కాలనీకి చెందిన బందా గోవిందయ్య, శేషమ్మల కుమారులు చందు(14), నందు(11) వేసవి సెలవులకు 10 రోజుల కిందట సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మల ఇంటికి వచ్చారు. స్థానిక విద్యార్థులతో కలసి సోమవారం కాలువలో ఈతకెళ్లి గల్లంతయ్యారు. పోలీసులు ఇరిగేషన్ అధికారుల సాయంతో కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో మంగళవారం ఉదయానికి నీటి మట్టం తగ్గి వారు మునిగిన చోటుకు 200 మీటర్ల దూరంలో చందు మృతదేహం లభ్యమైంది. కాలువ క్రాస్ రెగ్యులేటర్లకు దిగువన నందు మృతదేహం దొరికింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

న్యాయవాదుల జాబితా నుంచి 17 మంది తొలగింపు

- తప్పుడు సర్టిఫికెట్లతో ఎన్‌రోల్ అయిన వారిపై చర్యలు
- నోటిఫికేషన్ జారీ చేసిన ఏపీ బార్ కౌన్సిల్

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ/తప్పుడు ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లతో ఎన్‌రోల్ అయిన 17 మంది న్యాయవాదులపై ఏపీ బార్ కౌన్సిల్ వేటు వేసింది. వారి పేర్లను న్యాయవాదుల జాబితా నుంచి తొలగిస్తూ బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మలత నోటిఫికేషన్ జారీచేశారు. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకునేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అవకాశం ఇచ్చిందని, ఆ తర్వాతే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఏపీ బార్ కౌన్సిల్‌కు సిఫారసు చేసిందని పద్మలత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఎన్‌రోల్‌మెంట్ కమిటీ ఆదేశించిందని తెలిపారు. జాబితా నుంచి తొలగించిన వారిలో.. చాముండేశ్వరి (గుంటూరు జిల్లా తెనాలిలో ప్రాక్టీస్), చింతకాయల సీఎఎస్ఎన్ మూర్తి (తూర్పుగోదావరి జిల్లా తుని), సీడీ పురుషోత్తం (అనంతపురం), డి రత్నకుమారి (ఏపీ హైకోర్టు), కందుకూరి విశ్వక్ (పశ్చిమగోదావరి జిల్లా, నిడదవోలు), నక్కెళ్ల సత్యవతి (విశాఖపట్నం), గేదెల రాజశేఖర్ (విశాఖపట్నం), చాగలమర్రి సిద్దయ్య (ప్రకాశం జిల్లా దర్శి), డేగ సాయి వెంకట సుమన్ (నెల్లూరు), ఎల్లపు నవీన్ (విశాఖపట్నం), తాళ్లూరు వెంకట రమణయ్య (నెల్లూరు), ఎం ప్రవీణ (విశాఖ జిల్లా గాజువాక), యడల సురేశ్ బాబు (గుంటూరు), కురుపూడి సత్యనారాయణ (రాజమహేంద్రవరం), జి సుబ్రహ్మణ్యం (చిత్తూరు జిల్లా పలమనేరు), ఎంవీ మహేశ్వరరావు (విశాఖపట్నం), పి పద్మప్రియ (ఏపీ హైకోర్టు) ఉన్నారు.

యానాం పెట్రో ఉత్పత్తుల బ్లాక్ మార్కెటింగ్ పిల్ కొట్టివేత

- సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు నిరాకరణ

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): యానాంలో విక్రయించడానికి, వినియోగించడానికి ఉద్దేశించిన పెట్రోలియం ఉత్పత్తులను ఏపీలో బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. అక్రమాలకు పాల్పడుతున్న రిటైల్ అవుట్‌లెట్లపై ఇప్పటికే పెట్రోలియం కంపెనీలు చర్యలు తీసుకున్నాయని తెలిపింది. రాష్ట్ర పోలీసులు విఫలమయ్యారనేందుకు ఆధారాలతో పాటు ప్రత్యేక పరిస్థితులు, అరుదైన సందర్భాలలో మాత్రమే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేసింది. రిటైల్ అవుట్‌లెట్లలో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిర్దిష్ట కారణాలు లేవంటూ పిల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాజమండ్రికి చెందిన భీమా నాగరమేష్ ఈ పిల్‌ను దాఖలు చేశారు.

వైసీపీ నేత ప్రతాప్‌రెడ్డికి భద్రత కల్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- ఆ ఖర్చును ప్రతాప్‌రెడ్డి భరించాలని స్పష్టీకరణ



అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ఇందూరి ప్రతాప్‌రెడ్డికి ఎనిమిది వారాలపాటు వన్ ప్లస్ వన్ భద్రత కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అందుకు అయ్యే ఖర్చును భరించాలని ప్రతాప్‌రెడ్డికి స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను జూలై 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. తన భర్తకు ప్రాణహాని ఉందని, భద్రతను పునరుద్ధరించేలా నంద్యాల ఎస్పీ, ఆళ్లగడ్డ డీఎస్పీ, శిరివెళ్ల ఎస్‌హెచ్‌వోను ఆదేశించాలని కోరుతూ ప్రతాప్‌రెడ్డి సతీమణి మహేశ్వరి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

ప్రతి తరగతికీ టీచర్!

(మొదటి పేజీ తరువాయి)

స్కూళ్లు' పేరుతో కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతున్న నేపథ్యంలో పునర్వ్యవస్థీకరణకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఈ బడుల్లో ప్రతి తరగతికీ ఒక టీచర్‌ను కేటాయిస్తారు. అలాగే ఉన్నత పాఠశాలలను నాలుగు రకాలుగా వర్గీకరించారు. వీటిలో 'హైస్కూల్ ప్లస్'లు కూడా ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఈ నూతన విధానం అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా త్వరలో బదిలీలు చేపడతారు. అలాగే క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ అనే నూతన విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఎవరైనా టీచర్లు సెలవు పెడితే వారి స్థానంలో క్లస్టర్ టీచర్లు తాత్కాలికంగా విధులకు హాజరవుతారు.

పోస్టుల హేతుబద్ధీకరణ

నూతన బడుల విధానానికి అనుగుణంగా పోస్టులను హేతుబద్ధీకరించారు. నూతన విధానంలో ఫౌండేషనల్ స్కూల్‌లో 30 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను కేటాయిస్తారు. 31-60 మంది విద్యార్థులుంటే రెండో టీచర్ పోస్టు కేటాయిస్తారు. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 20 మంది విద్యార్థులకు ఒక టీచర్, 21-60 మంది విద్యార్థులకు రెండో టీచర్‌ను ఇస్తారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో 59 మంది విద్యార్థుల వరకు ఒక హెచ్‌ఎం, 3 ఎస్జీటీలను ఇస్తారు. 60-150 మంది ఉంటే ఒక హెచ్‌ఎం, 4 ఎస్జీటీలను కేటాయిస్తారు. ఆ తర్వాత ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీ చొప్పున కేటాయిస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 1-5 తరగతుల వరకు బేసిక్ లేదా మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రకారం టీచర్లను కేటాయిస్తారు. 6-8 తరగతులలో 10 మంది విద్యార్థులకు ఒక స్కూల్ అసిస్టెంట్, 11-30 మందికి ఇద్దరు, 31-140 మందికి నలుగురు, 141-175 మంది విద్యార్థులు ఉంటే ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తారు. ఉన్నత పాఠశాలల్లో 1-5 తరగతుల విద్యార్థుల సంఖ్య 60లోపు ఉంటే 10 మంది విద్యార్థులకు రెండు, 11-30 వరకు మూడు, 31-59 వరకు ఒక హెచ్‌ఎం, మూడు ఎస్జీటీ పోస్టులు కేటాయిస్తారు. 60 దాటితే బేసిక్ లేదా మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రకారం టీచర్లను కేటాయిస్తారు. ఉన్నత పాఠశాలల్లో 75 లేదా అంత కంటే తక్కువ మంది విద్యార్థులుంటే హెచ్‌ఎం, పీఈటీ పోస్టు ఉండదు. సీనియర్ స్కూల్ అసిస్టెంట్ హెచ్‌ఎం విధులు నిర్వహిస్తారు. 75 మంది దాటితే ఆ స్కూల్‌కు హెచ్‌ఎం, పీఈటీ పోస్టు ఇస్తారు. విద్యార్థుల సంఖ్య 400 దాటితే రెండో పీఈటీ, 751 దాటితే మూడో పీఈటీని నియమిస్తారు.



మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా ఎస్ఏలు

కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లలో 4,706 చోట్ల స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమించనున్నారు. మిగులు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలను క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్లుగా క్లస్టర్ పాఠశాలల్లో నియమిస్తారు. ఆ క్లస్టర్‌లో ఎవరైనా టీచర్ సెలవు పెడితే అక్కడ క్లస్టర్ టీచర్ తాత్కాలికంగా పనిచేస్తారు. 615 స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులను అదే మేనేజ్‌మెంట్లలో అవసరాలకు అనుగుణంగా నియమిస్తారు. 3,980 ఖాళీ పోస్టులు రద్దు, హెచ్‌వోడీ పూల్‌లో ఉన్న 1311 పోస్టుల సర్దుబాటు ద్వారా కొత్తగా 3,228 పోస్టులను సృష్టిస్తారు. వీటిలో 397 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు, 2,709 స్కూల్ అసిస్టెంట్, 122 ఎస్జీటీ పోస్టులున్నాయి. 779 ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. 1902 పోస్టులు హెచ్‌వోడీ విభాగానికి అనుసంధానించి భవిష్యత్తులో అవసరమైన చోటకు సర్దుబాటు చేస్తారు.

నూతన బడులు ఇవీ..

శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్

ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను 'శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్'గా పేర్కొంటారు. ఇవి సమీపంలోని ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానంగా పనిచేస్తాయి. వీటిలో ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2 తరగతులు ఉంటాయి. అక్కడ అంగన్‌వాడీ వర్కర్ పనిచేస్తారు.

ఫౌండేషనల్ స్కూల్

ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2తో పాటు 1, 2 తరగతులుంటాయి. ప్రాథమిక పాఠశాలల ప్రాంగణంలోనే అంగన్‌వాడీ కేంద్రాలుంటాయి. 1, 2 తరగతులకు ఎస్జీటీలు, ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2లకు అంగన్‌వాడీ వర్కర్‌ను కేటాయిస్తారు.

బేసిక్ ప్రైమరీ స్కూల్

ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-5 తరగతులు ఉంటాయి. ఈ బడుల్లో 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల సంఖ్య 59 వరకు ఉంటుంది. 1-5 తరగతులకు ఎస్జీటీలు, ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2లకు అంగన్‌వాడీ వర్కర్‌ను కేటాయిస్తారు.

మోడల్ ప్రైమరీ స్కూల్

ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-5 తరగతులు ఉంటాయి. ఈ బడుల్లో 1-5 తరగతుల విద్యార్థుల సంఖ్య 60 లేదా అంత కంటే ఎక్కువ ఉంటుంది. 1-5 తరగతులకు ఎస్జీటీలు, ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2లకు అంగన్‌వాడీ వర్కర్‌ను ఇస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాల

ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-8 తరగతులు ఉంటాయి. ఈ పాఠశాలల్లో 1-5 తరగతులకు ఎస్జీటీలు, 6-8 తరగతులకు ఎస్జీటీలు లేదా స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. 1-5 తరగతులకు బేసిక్ ప్రైమరీ స్కూల్ లేదా మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల సంఖ్య ప్రకారం టీచర్లను కేటాయిస్తారు. ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2కు అంగన్‌వాడీ వర్కర్ ఉంటారు.

ఉన్నత పాఠశాల(6-10)

6-10 తరగతులుంటాయి. స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు.

ఉన్నత పాఠశాల(1-10)

1-10 తరగతులు ఉంటాయి. 1-5 తరగతులకు ఎస్జీటీలు, 6-10 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అన్ని తరగతులకు పని సర్దుబాటు చేస్తారు.

ఉన్నత పాఠశాల ప్లస్(6-12)

6 > 12తరగతులుంటాయి. ఇంటర్మీడియట్‌తో సహా అన్ని తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. ఉన్నత పాఠశాల ప్లస్‌లలో హెచ్‌ఎం పని సర్దుబాటు చేస్తారు.

ఉన్నత పాఠశాల ప్లస్(1-12)

1 > 12 తరగతులుంటాయి. 1-5 తరగతులకు ఎస్జీటీలు, 6-12 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం పని సర్దుబాటు చేస్తారు.


శ్రీహర్ష


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం హనుమంతరావు తదితరులు

సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

» 492 మార్కులతో సంచలనం సృష్టించిన ఎస్.కె.ఎం.శ్రీహర్ష

గుంటూరు(విద్య), మే 13(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్.కె.ఎం.శ్రీహర్ష 500 మార్కులకు గాను 492 మార్కులు సాధించి భాష్యం విద్యా సంస్థలకు గర్వకారణంగా నిలిచారన్నారు. అదే విధంగా ఎ.సాయినిఖిత 490, టి.అనీష్ 489, బి.లిఖిత్ మనోఙ్ఞ 488, పి.శ్రీసాయి మిత్ర 488, ఎ.శ్రీహరిణి 488, యు.యశ్వంత్ సాయి 486, కె.స్నిగ్ధ 485, ఎస్.మణియశ్వంత్ 485, పియూష్ ఫోడికర్ 485, ఇ.రిషిక 485, డి.శ్రీహరిణి 485 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 23 మంది 480కి పైగా మార్కులు, 470కి పైగా 63 మంది, 450కి పైగా 146 మంది అత్యధిక మార్కులు సాధించారన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

» 498 మార్కులతో ఆలిండియా మొదటి ర్యాంకు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. 498 మార్కులతో తమ విద్యార్థి ఆలిండియా టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థులు 497 మార్కులు, 10మంది 496 మార్కులు, 26 మంది 495 మార్కులు, 197 మంది 490 మార్కులు, 917 మంది 480 మార్కులు సాధించినట్లు ఆమె వివరించారు. శ్రీచైతన్య బ్రాంచీలలో అధికశాతం బ్రాంచీలు నూరుశాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. ఇటీవల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లోనూ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య విద్యార్థులు మొదటి ర్యాంకుతోపాటు వందలోపు 19 ర్యాంకులు సాధించారని గుర్తుచేశారు.

డాక్టర్ కేకేఆర్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదోతరగతి ఫలితాల్లో డా. కేకేఆర్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. తమ విద్యార్థి జె.లక్ష్మి నరసింహ భరద్వాజ్ 490 మార్కులు, ఎం.అక్షయప్రియ, ఆర్.వివేక్ 488 మా ర్కులు సాధించారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. 24 మంది 480కి పైగా మార్కులు, 52 మంది 475 మార్కులు, 81 మంది 470కి పైగా మా ర్కులు, 165 మంది 460కి పైగా మార్కులు సాధించారని వెల్లడించింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

హైదరాబాద్ దాటి రాలేరా?

- » కృష్ణా బోర్డుకు ఊరకే లేఖలతో సరి
- » విభజన చట్టం ప్రకారం దాని ఆఫీసు ఆంధ్ర రాజధానిలో ఉండాలి
- » కానీ పదేళ్లుగా హైదరాబాద్‌లోనే
- » జగన్ హయాంలో విశాఖకు తరలించాలని ప్రతిపాదన
- » అంగీకరించని బోర్డు అధికారులు, సిబ్బంది
- » కూటమి ప్రభుత్వం రాగానే బెజవాడకు రావాలని ఉత్తరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్ రాజధానిలో, గోదావరి బోర్డు (జీఆర్ఎంబీ) తెలంగాణ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు 2014లో గెజిట్ జారీచేశారు. పదేళ్లు దాటినా ఇప్పటికీ కృష్ణా బోర్డు ప్రధాన కార్యాలయం హైదరాబాద్ జలసౌధలోనే కొనసాగుతోంది. 2014-19 నడుమ ఇదిగో అదిగో అంటూ బోర్డు అధికారులు కాలయాపన చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. మూడు రాజధానుల క్రీడకు తెరలేపారు. 2022లో కేఆర్ఎంబీ ఆఫీసుని విశాఖకు తరలించాలని బోర్డు ఛైర్మన్‌కు జల వనరుల శాఖ లేఖ రాసింది. కృష్ణా డెల్టాతో సంబంధం లేని చోటకు ఎలా తరలిస్తారని విమర్శలు వెల్లువెత్తినా జగన్ పట్టించుకోలేదు. కానీ ఉద్యోగులు, సాగునీటి నిపుణులు మాత్రం కేఆర్ఎంబీని కృష్ణా నదితో సంబంధం లేని చోట ఏర్పాటు చేయాలనడాన్ని తప్పుబట్టారు. హైదరాబాద్‌ను వీడి రావడం బోర్డు సభ్యులకు, సిబ్బందికి ఇష్టం లేకపోవడంతో విశాఖ తరలింపు కార్యరూపం దాల్చలేదు. 2024లో టీడీపీ కూటమి వచ్చాక.. కేఆర్ఎంబీని ఏపీ రాజధానికి తరలించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. విజయవాడకు తరలించాలని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య ఛైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు లేఖ అందించారు. జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు కూడా బోర్డుకు లేఖలు రాశారు.

సాగర్ నుంచి పూర్తి విడుదల ఏదీ?

కేఆర్ఎంబీ హైదరాబాద్‌లోనే ఉండడంతో నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ నుంచి కృష్ణా డెల్టాకు కేటాయింపులకు అనుగుణంగా నీటిని విడుదల చేయకపోయినా నిలదీయలేని పరిస్థితి ఎదురవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది సాగర్ నుంచి కేటాయించిన 18 టీఎంసీలు పూర్తిగా రాలేదని సాగునీటి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు కార్యాలయం విజయవాడలో ఉంటే అధికారులను కలిసి నీటి విడుదలకు ఒత్తిడి తేవడానికి ఆస్కారం ఉంటుందని అంటున్నాయి.

అవంతి కళాశాలకు అటానమస్ హోదా

అబ్దుల్లాపూర్‌మెట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : అటానమస్ హోదాతో ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగవుతాయని మాజీ మంత్రి, అవంతి కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదాను కల్పించిందని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2034-35 సంవత్సరం వరకు 10 ఏళ్ల పాటు ఈ హోదా కొనసాగుతుందని పేర్కొన్నారు. హోదా వచ్చిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అధ్యాపక బృందంతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ..దశాబ్దాల కాలంగా తమ విద్యాసంస్థల ద్వారా లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో యూనివర్సిటీ హోదానూ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ శేషతల్పసాయి, రాంచంద్రారెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌వో పాల్గొన్నారు.

సత్తాచాటిన నారాయణ విద్యార్థులు

» అత్యధిక బ్రాంచీలలో వందశాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. తమ విద్యార్థులు స్పందన, త్రిషా ఘోష్, పార్థ్ బన్సల్ 498 మార్కులు, అధిత్రి, యువరాజ్ నితిన్ నాయక్, హరిణి 497 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే 12వ తరగతిలో వాకిన్, రేయాన్ష్ 495 మార్కులు సాధించారని అన్నారు. అత్యధిక బ్రాంచీలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.


పల్నాడు జిల్లా శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

పొట్టకూటి కోసం వెళుతూ మృత్యువాత

- » నలుగురు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు
- » పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం
- » ఎదురెదురుగా వేగంగా ఢీకొన్న ట్రాలీ బొలెరో, లారీ

వినుకొండటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ మండలం శివాపురం గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెల్లలచెరువు సమీపంలోని అడ్డరోడ్డుకు బొప్పాయి కాయల కోత పనికి యర్రగొండపాలెం సమీపంలోని గడ్డమీదపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ(40), జొన్నగిరి రామాంజి (36), ఆయన భార్య అంకమ్మ(28), కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, కదిరి నాగేశ్వరరావు(డ్రైవర్) ట్రాలీ బొలెరోలో వస్తున్నారు. అదే సమయంలో వినుకొండ నుంచి మార్కాపురానికి కొబ్బరికాయలతో వెళ్తున్న లారీ, కూలీలు ప్రయాణిస్తున్న బొలెరో ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందగా రమణారెడ్డి, రామాంజి వినుకొండ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందారు. తీవ్ర గాయాలైన నాగమణి, శివమ్మ, నాగేశ్వరరావును ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మెరుగైన వైద్యం అందించాలి: లోకేశ్

శివాపురం వద్ద ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించి అధికారులను అప్రమత్తం చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబీకులను పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫోన్‌లో పరామర్శించారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల మొదటి వారంలో పిడుగుపాటుకు గురై మరణించిన 9 మంది కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా విడుదల చేసింది. ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున రూ.36 లక్షలు విడుదలకు పరిపాలనా ఆమోదం తెలుపుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లాలో నలుగురు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఇద్దరు చొప్పున, నెల్లూరు జిల్లాలో ఒకరు పిడుగుపాటుకు మృతిచెందారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కక్ష - శిక్ష

బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం నిలబడాలని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వాధినేతకు ఏ మాత్రం ఉన్నా, మాజీ ప్రధాని షేక్‌హసీనా పార్టీని రద్దుచేయాలన్న నిర్ణయం తీసుకొనేవారు కాదు. ఆమెను నియంత అంటున్నప్పుడు అదేరీతిలో వ్యవహరించేవారు కాదు. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ పార్టీని నిషేధిస్తూ సోమవారం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2009 నాటి ఉగ్రవాద వ్యతిరేక చట్టంలో, ఈ పార్టీ రద్దుకు అవకాశమిచ్చే వెసులుబాట్లు లేవు కనుక, దానిని సవరించి మరీ మహ్మద్ యూనిస్ ప్రభుత్వం ఈ చర్యకు ఒడిగట్టింది. అవామీలీగ్, దాని అనుబంధ, సోదర సంస్థలన్నింటినీ నిషేధించడానికి వీలుగా ఆ సవరణను తయారుచేసుకుంది. అవామీలీగ్, దాని నాయకులందరిపైనా ప్రత్యేక ట్రిబ్యునల్ ఎలాగూ విచారణ జరుపుతోంది. ఆ విచారణ పూర్తయ్యేవరకూ నిషేధం అమలులో ఉంటుందట.

ఒక ఆర్డినెన్సుద్వారా రాత్రికి రాత్రి ఉగ్రవాద వ్యతిరేక చట్టాన్ని సవరించి, వెనువెంటనే హసీనా పార్టీమీద వేటువేయడం గమనించినప్పుడు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం కక్షసాధింపులో హసీనాను మించిపోతోందని అర్థమవుతోంది. హసీనా దేశం విడిచిపోగానే గృహనిర్బంధం నుంచి బయటకు వచ్చిన ఆమె రాజకీయ ప్రత్యర్థి ఖలీదాజియా విదేశాల్లో ఖరీదైన చికిత్సలన్నీ చేయించుకొని ఇటీవలే దేశంలో తిరిగి కాలూనారు. సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా ఆమె రాకడ, హసీనా పార్టీమీద నిషేధం ఒకేసారి జరగడం కాకతాళీయం కాకపోవచ్చు. భారతదేశం పశ్చిమ దిక్కున పాకిస్థాన్‌తో పోరాడుతున్న సమయంలో, పాకిస్థాన్ అనుకూల యూనిస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని హసీనా అనుకూల భారతదేశాన్ని ఇరకాటంలోకి నెట్టేసిందని అంతర్జాతీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. సరైన విధానాలు, ప్రక్రియలు పాటించకుండా అవామీలీగ్ మీద నిషేధాన్ని విధించడం సముచితం కాదని భారత విదేశాంగశాఖ మంగళవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. సాధ్యమైనంత వేగంగా, స్వేచ్ఛాయుతంగా, సమ్మిళితంగా ఎన్నికలు జరగాలన్నది.

అవామీలీగ్ భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పాల్గొనకుండా బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం ఒక రాజకీయపార్టీగా దాని గుర్తింపును సైతం రద్దు చేసింది. డెబ్బైఏడేళ్ళ అవామీలీగ్ మీద చేపట్టిన చర్యలన్నీ దురుద్దేశపూరితమైనవేనని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యూనల్ ఆఫ్ బంగ్లాదేశ్ (ఐసిటి-బిడి) ఒకపక్కన ఈ పార్టీ కార్యకర్తలు, నేతల దుర్మార్గాలూ దాష్టీకాలమీద విచారణ జరుపుతున్న నేపథ్యంలో తుది తీర్పులు, నిర్ణయాలు వెలువడేవరకూ ప్రభుత్వం ఆగివుంటే సరిపోయేది. కానీ, అడ్వయిజరీ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ప్రకటించడం, దానికి ముందు, నేషనల్ సిటిజన్ పార్టీ, జమాతే ఇస్లామీ వంటివి అవామీలీగ్‌ను నిషేధించాలంటూ భారీ ప్రదర్శనలు జరపడం వంటి పరిణామాలు ఒక ప్రణాళికాబద్ధంగా జరిగాయి. ఆ తరువాత యూనిస్ వ్యాఖ్యలు గమనించినప్పుడు కూడా ఈ నిర్ణయం ఎప్పుడో జరిగిపోయిందని అనిపించింది.

హసీనా దేశం విడిచిపోయిన తొమ్మిదినెలల్లో, ఒక ఉగ్రవాద వ్యతిరేక చట్టాన్ని ప్రయోగించి మరీ యూనిస్ ప్రభుత్వం ఆమె పార్టీని రద్దుచేసింది. ఈ చర్య మిగతా ప్రపంచానికి ఏ సందేశాన్ని ఇస్తుందో నోబెల్ బహుమతి గ్రహీతకు తెలియదనుకోలేం. హసీనా తన పాలనాకాలంలో ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకున్నారని ఎవరూ అనడం లేదు. కానీ, అవామీలీగ్ ఆవిర్భావం కొన్ని ఆదర్శాలు, ఆకాంక్షలకు అనుగుణంగా జరిగాయన్నవాదనను ఎవరూ కాదనలేరు. పాకిస్థాన్ మతోన్మాద, నిరంకుశ వైఖరులకు, విధానాలకు వ్యతిరేకంగా ముజబూర్ రహ్మాన్ పార్టీ జన్మించింది. దేశమనుగడకు లౌకికవాదం పునాది కావాలని కాంక్షించింది. భాష, సంస్కృతి ఇత్యాది అనేక విషయాల్లో తూర్పుపాకిస్తాన్ పూర్తిభిన్నమైనది కనుకనే, మిగతా పాకిస్థాన్ నుంచి విడివడేందుకు రక్తంధార పోసింది. ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను కూల్చి, చరిత్ర పుస్తకాల్లోంచి ఆయననూ, ఆయన పార్టీనీ చెరిపివేసే విశేష కృషి ఇప్పటికే అక్కడ జోరందుకుంది. బంగ్లా విముక్తి పోరాటానికి మసిపూసి, దేశ ఆవిర్భావ రహస్యాలకు పాతరేసి పాక్ పాలకులకు నొప్పికలగనివ్వకుండా చూసే ప్రయత్నం బలంగా సాగుతోంది. చరిత్రను తిరగరాసే పేరిట తమ మూలాలకే ముప్పుతెచ్చుకొనే ప్రమాదంలో అక్కడివారు ఉండటం విషాదం. హసీనాకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఆమెను దేశం నుంచి వెళ్ళగొట్టినవారంతా రేపటి ఎన్నికల్లో సైతం ఆమె పార్టీని ఘోరంగా ఓడిస్తే ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండదు. కానీ, ఆమెను నియంతనీ, మానవ హక్కులను మంటగలిపిందనీ, ప్రజాస్వామ్యాన్ని పాతరేసిందనీ నిందించినవారే ఆమెను కనీసం ఎన్నికల బరిలోకి కూడా దిగనివ్వకుండా చేయడం విషాదం. న్యాయస్థానాలనూ, ట్రిబ్యునల్స్‌ను నామమాత్రం చేసి, ప్రస్తుత పాలకులే తీర్పులు చెప్పేస్తూ ఆమెకూ, ఆమె పార్టీకీ శిక్షలు వేయడం ఆశ్చర్యకరం.

కరాచీ బేకరి, లింగాపూర్ హౌజ్ లేదా జతి ఉమ్ర ఏదైనా సంబంధిత వ్యక్తుల మనస్సుతో ముడివడి ఉన్న ఒక భావోద్వేగ అనుబంధం. ఇటువంటి సున్నిత అంశంపై రచ్చ చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు.

కరాచీ బేకరీపై రచ్చ సబబు కాదు

గల్ఫ్ లేఖ

జాతీయ భావోద్వేగం అనే సున్నిత అంశంతో రాజకీయాలు జోరుగా జరుగుతున్న రోజులివి. దేశ భక్తి ప్రామాణికతను నిర్ధారించడం కష్టమవుతున్న నేపథ్యంలో జన్మభూమి, కర్మభూమి లేదా పుణ్య భూమిల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం అంత సులువు కాదు.

కరాచీ బేకరీ... భారతీయ ధర్మం గురించి సరైన అవగాహనలేని అజ్ఞానుల ఆగ్రహావేశాలకు గత కొంత కొన్నాళ్ళుగా గురవుతున్న ఒక ప్రఖ్యాత వాణిజ్య సంస్థ. తమ జన్మ స్థలం గురించి అందరిలోనూ ఒక రకమైన ప్రేమాభిమానం ఉంటుంది. అందునా సింధీలు, పంజాబీలకు ఇది కాస్త ఎక్కువ. దేశ విభజన సందర్భంగా తమ జన్మస్థలాలను వదిలి శరణార్థులుగా వచ్చిన సింధీలు తమ మూలాలను ఏ మాత్రం మరిచిపోలేదు. కొందరు తమ వ్యాపారాలకు లేదా గృహాలకు, విడిచి వచ్చిన జన్మ స్థలాల పేరిట నామకరణం చేసుకున్నారు. అత్యధికులు అదే మూలల వారితో మాత్రమే మమేకం కావడానికి సహజంగా ఇష్టపడతారు, అయినా వీరందరు సంపూర్ణ భారతీయులు. వారి దేశ భక్తిని ఏ మాత్రం శంకించడానికి వీలు లేదు.

ఈ రకంగా పాకిస్తాన్ నుంచి తెలుగునాటకు వచ్చిన అనేక మంది హిందూ శరణార్థులలో ఖన్చంద్ రమ్నానీ ఒకరు, తన కన్న ఊరు కరాచీ పేరిట ఆయన భారత స్వాతంత్ర్యం తొలినాళ్ళలో నెలకొల్పిన బేకరీ ప్రస్తుతం ఆ రంగంలో అగ్రగామి. ఇప్పటి వరకు జరిగిన సరిహద్దు యుద్ధాలలో గానీ హైదరాబాద్ నగరంలో సంభవించిన మతకలహాలలో గానీ కరాచీ బేకరీ వైపు ఎవరు ఎప్పుడూ కన్నెత్తి చూడలేదు. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు లేని కాలంలో అది సురక్షితంగా ఉన్నది. ఆ నవీన సాంకేతికతల పుణ్యమా అంటూ సమస్తమూ బహిర్గతమవుతోన్న ప్రస్తుత కాలంలో తరచు దేశభక్తి పేర అలజడి సృష్టించే అల్లరిమూకల ఆగ్రహానికి గురవుతోంది.

హైదరాబాద్‌లోని కరాచీ బేకరీయే కాదు, విశాఖ పట్టణం సిరిపురంలోని కరాచీవాలా స్టోర్స్ విజయవాడ



కొత్తపేటలో కరాచీ స్టోర్స్, కరీంనగర్‌లోని హైద్రాబాద్ సింధ్ క్లాత్ స్టోర్స్ మొదలైన అనేక సంస్థలకు శరణార్థులుగా వచ్చిన సింధీలు తాము జన్మించిన నగరాల పేర్లు పెట్టుకున్నారు. ఇదే విధంగా, కరాచీ నగరంలో కొన్ని హోటళ్ళు, వ్యాపార సంస్థలకు బొంబాయి పేరు ఉంది. దేశ విభజనలో హైదరాబాద్ నుంచి పాకిస్తాన్‌కు వెళ్ళిన ముస్లింలు తమ జన్మస్థలం పేరిట కరాచీ నగరంలో ఏకంగా హైదరాబాద్ కాలనీ నెలకొల్పుకున్నారు. బీజేపీ కురువృద్ధుడు లాల్‌కృష్ణ అడ్వాణీ 2005లో తన పాక్ పర్యటన సందర్భంగా తన జన్మస్థలానికి వెళ్ళి తాను బాల్యం గడిపిన ఇంటిని చూసి కన్నీరు పెట్టున్నారు. అంతమాత్రాన ఆయన దేశభక్తిని శంకిస్తారా?

పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌ల కుటుంబాలు లాహోర్‌లో నివాసముండే సువిశాల భవంతి పేరు జతి ఉమ్ర ప్యాలెస్. 1700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవంతి. ఒక్క పాకిస్తాన్‌లోనే కాదు ఆసియా ఖండంలోనే సువిశాల నివాస గృహమని చెప్పవచ్చు. భారత పంజాబ్‌లోని తరణ్ తరణ్ జిల్లాలో ఉన్న ఒక కుగ్రామం పేరు జతి ఉమ్ర. ఈ గ్రామంలోనే నవాజ్ షరీఫ్ తండ్రి జన్మించారు. తాను పుట్టిన ఊరిపై మమకారంతో లాహోర్‌లో సొంత గృహానికి భారత్‌లో ఉన్న గ్రామం పేరు పెట్టుకున్నారు. గల్ఫ్ దేశాలలో ఉన్న తమ కుటుంబ ఉక్కు పరిశ్రమలలో భారత్‌లోని తమ పూర్వీకుల గ్రామానికి చెందిన అనేక మంది సిక్కు యువకులకు షరీఫ్ కుటుంబం ఉద్యోగాలు కూడ ఇచ్చింది.

హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ప్రసిద్ధిగాంచిన లింగాపూర్ హౌజ్ కూడా ఒక జన్మస్థలంపై ఉన్న అభిమానానికి ఒక నిదర్శనం. జగిత్యాల జిల్లా బండలింగాపూర్ గ్రామానికి చెందిన రాజ అనంత కిషన్‌రావు కుమారులు గజసింహారావు, రాజనర్సింహారావు తమ కన్న ఊరు పేరిట హైదరాబాద్ నగరం నడిబొడ్డున అప్పట్లో నిర్మించిన వాణిజ్య సముదాయానికి లింగాపూర్‌గా నామకరణం చేసారు.

ఒకనాటి భారతీయ జన సంఘ్ అగ్రనాయకులలో పలువురు అవిభక్త భారతంలో నేటి పాకిస్థాన్‌గా ఉన్న ప్రాంతాల పేర్లతో పరస్పరం పిలుచుకునేవారు. భారత్‌లోని గ్రామం పేరుతో ఉన్న భవంతిలో నివసిస్తున్న పాకిస్తాన్ ప్రధానమంత్రికి స్వీయ దేశాభిమానం కొరవడిందా? కరాచీ బేకరీ పేర వ్యాపారం చేస్తున్న యాజమానుల దేశభక్తి ఏమైనా తగ్గిందా? లింగాపూర్ హౌజ్, కరాచీ బేకరి లేదా జతి ఉమ్ర ఏదైనా సంబంధిత వ్యక్తుల మనస్సుతో ముడివడి ఉన్న ఒక భావోద్వేగ అనుబంధం. ఇటువంటి సున్నిత అంశంపై రచ్చ చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ముగిసిన యుద్ధం మిగిల్చిన ప్రశ్నలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గగనతలంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. యుద్ధ విమానాలు శత్రుస్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించాయి. డ్రోన్‌లు పేలుడు పదార్థాలతో నిప్పులు కక్కాయి. సరిహద్దులు కాల్పులతో దద్దరిల్లాయి. కేవలం నాలుగు రోజుల్లోనే భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. ఇది ఆధునిక యుద్ధతంత్రం కనుక టెక్నాలజీ సాయంతో నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించగలగడం, క్షిపణులను, డ్రోన్‌లను గాలిలోనే పేల్చివేయడం వంటి అపూర్వ దృశ్యాలను మనం చూడగలిగాం. పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన 15 రోజుల్లోనే భారత దేశం సర్వశక్తులను మోహరించి పాకిస్థాన్‌పై దాడులు ప్రారంభించిన వైనాన్ని, పాకిస్థాన్ మనను ఎదుర్కొనే విషయంలో విఫలం కావడం స్పష్టంగా కనపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనిక దళాలు ప్రారంభించిన యుద్ధం మొత్తం దేశాన్నే గగుర్పొడిచేలా చేసింది. భారత మహిళల సిందూరాన్ని తుడిచివేసిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు తగిన పేరే పెట్టినందుకు దేశ వ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. 'ఉగ్రవాదులను, వారికి వెనుక ఉన్న శక్తులను మట్టిలో కలిపేస్తాం' అని ప్రధానమంత్రి చేసిన హుంకారం దేశమంతటా ప్రతిధ్వనించింది. పాకిస్థాన్ కూడా భారత్‌ను ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడంతో ఈ యుద్ధం చాలా కాలం సాగుతుందని, ఈసారి భారతదేశం లాహోర్‌లో ప్రవేశించడమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా కైవశం చేసుకుంటుందనే భావనలు అంతటా పెల్లుబుకాయి.

కాని యుద్ధం ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే ఉన్నట్లుండి ఇరు దేశాలు యుద్ధ విరమణను ప్రకటిస్తాయని, శతఘ్నులు, విమానాలు మూగపోతాయని ఎవరూ ఊహించలేదు. ఏదో జరగబోతుందని, ఈసారి పాకిస్థాన్‌కు మనం కనీవినీ ఎరుగని రీతిలో బుద్ధి చెబుతామని భావించిన తరుణంలో పాక్ కాల్పుల విరమణను ప్రతిపాదించడం, అందుకే ఎదురుచూస్తున్నట్లుగా మనం నాటకీయంగా అందుకు అంగీకరించడం దేశ వ్యాప్తంగా అనేకమందికి ఆశ్చర్యం కలిగించింది. నిజానికి మనమే కాల్పుల విరమణను ముందుగా ప్రతిపాదించామని, అందుకు తాము ఒప్పుకున్నామని పాకిస్థాన్ కూడా ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య ప్రారంభమైన యుద్ధం ఎంతో బీభత్సం సృష్టించిన తర్వాత ఇప్పుడిప్పుడే శాంతి బాటలోకి పయనిస్తోంది. ఇజ్రాయిల్–పాలస్తీనా మధ్య నెత్తుటి సంఘర్షణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. గతంలో ఇరాన్, ఇరాక్‌ల మధ్య యుద్ధం 8 సంవత్సరాలకు పైగా సాగింది. అమెరికా సంకీర్ణ దళాలకూ, ఇరాక్‌కు మధ్య మరో 8 సంవత్సరాలు హోరాహోరీ సాగింది. వియత్నాంపై అమెరికా యుద్ధం కూడా 20 సంవత్సరాలకు పైగా జరిగింది. మరెందుకు భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కేవలం నాలుగు రోజుల్లోనే యాంటీ క్లైమాక్స్ లాగా ఎందుకు ముగిసింది?

ఈ యుద్ధం ఇలా అర్థాంతరంగా ముగియడాన్ని బట్టే యుద్ధం గురించి స్వతంత్రంగా మనం నిర్ణయాలు తీసుకోలేమని, తీసుకున్నా దాన్ని కొనసాగించలేమని అర్థమవుతుంది. ఈ యుద్ధ విరమణను భారత పాకిస్థాన్ దేశాలు తమంతట తాము ప్రకటించాయని అనుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు. ఉన్నట్లుండి కత్తులు ఒరల్లోకి చేరిపోవడం యాదృచ్ఛికం కానేకాదు. అసలు సుదీర్ఘకాలం యుద్ధం జరగాలని, సైనికులు, ప్రజలు చనిపోవాలని, అభివృద్ధి స్తంభించిపోవాలని ఎవరూ కోరుకోరు. ప్రపంచ శాంతి ఏర్పడాలనే అందరూ కోరుకుంటారు. గతంతో పోలిస్తే ఒకటి రెండు చోట్ల తప్ప ప్రపంచంలో యుద్ధ వాతావరణం అంతగా లేదు. చైనా, అమెరికా లాంటి దేశాలు వాణిజ్య భాషకే ప్రాధాన్యతనిస్తున్నాయి. భారత దేశం కూడా వికసిత్ భారత లక్ష్యం నెరవేరాలంటే యుద్ధాన్ని సాధ్యమైనంత మేరకు నివారించాలి. యుద్ధం చేయడమంటే పులిపై స్వారీ చేయడమే. ప్రారంభించే ముందే దాని పర్యవసానాల గురించి ఆలోచించాలి. అందువల్ల యుద్ధం ఎందుకు ప్రారంభించాల్సి వచ్చింది? యుద్ధాన్ని ఎందుకు ముగించాల్సి వచ్చింది అన్న ప్రశ్నలపై మాత్రం చర్చ జరగడం అవసరం. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య, ఇజ్రాయిల్–హమాస్‌ల మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయిన అంతర్జాతీయ శక్తులు భారత–పాకిస్థాన్‌ల విషయంలో మాత్రం ఎందుకు విజయవంతం కాగలిగాయి? ఒకటి రెండు ఫోన్‌కాల్స్‌తో ఇరు దేశాలు ఎందుకు శాంతించాయి?

భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభించిన వెంటనే అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియాతో సహా అనేక దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించాయి. ఇరు దేశాలు తమ నిర్ణయాన్ని ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత పాక్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. తామే ఇరు దేశాలను ఒప్పించామని, ఈ దేశాలు తమ వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించాయని ఆయన అభినందించారు. తాను, అమెరికన్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారతదేశం, పాకిస్థాన్‌లోని సైనిక నాయకత్వంతో మాట్లాడామని, పరిస్థితి విషమించకుండా ఒప్పందం కుదిరేలా చేసామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. దాదాపు పది పన్నెండు దేశాలు ఇరు దేశాలను శాంతింపచేసేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రధానంగా భారత పాకిస్థాన్‌ల మధ్య తాత్కాలిక శాంతి ఏర్పర్చడంలో అమెరికా కీలక పాత్ర వహించినట్లు స్పష్టమవుతోంది. తమకు సంబంధం లేని యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని తొలుత ప్రకటించిన అమెరికా తన వైఖరి మార్చుకుని పెద్దన్న పాత్ర పోషించింది.

యుద్ధం, సంఘర్షణలు జరిగినప్పుడే తమ పక్షాన ఎవరు నిలబడతారో అన్న విషయం స్పష్టమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహం కూడా ఏర్పర్చుకుని పరమ మిత్రుడుగా వ్యవహరించారు. అయితే ఆయనే యుద్ధాన్ని ఆపేయాలని హెచ్చరించే స్వరంతో చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత కూడా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పాకిస్థాన్‌కు 2.4 బిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేసింది. సౌదీ ఆరేబియా, చైనా, యూఏఈ పాక్‌కు ఈ రుణం లభించేందుకు గట్టి మద్దతునిచ్చాయి. ఈ రుణం లభించకుండా వీటో చేసే అధికారాలున్నా అమెరికా అడ్డుకోలేదు, జపాన్, జర్మనీ, యూకే కూడా మాట్లాడలేదు. పాకిస్థాన్‌కు మద్దతునిస్తే ఉగ్రవాదానికి మద్దతునిచ్చినట్లేనన్న భారత్ నిరసనలకు మద్దతు లభించలేదు. దీనితో పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇచ్చే విషయంలో ఐఎంఎఫ్ బోర్డులో వోటింగ్ చేయకుండా భారత్ వైదొలగాల్సి వచ్చింది.

ఈ నాలుగు రోజుల యుద్ధం కొన్ని ప్రశ్నలను మిగిల్చింది.



ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ నిజంగా తన లక్ష్యాన్ని సాధించిందా? పహల్గాంలో హత్యకు గురైన అమాయక భారతీయుల మరణాలకు ప్రతీకారాలు తీర్చుకున్నారా? పాకిస్థాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మనం పూర్తిగా ధ్వంసం చేశామా? భారతీయ పర్యాటకులను హత్య చేసి అదృశ్యమైన ఉగ్రవాదులను మనం వెతికి వేటాడి చంపగలిగామా? పహల్గాం ఘటన సూత్రధారి ముసా, లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన సలావుద్దీన్‌లను అప్పగించేందుకు పాకిస్థాన్ సిద్ధపడిందా?

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ నిజంగా తన లక్ష్యాన్ని సాధించిందా? పహల్గాంలో హత్యకు గురైన అమాయక భారతీయుల మరణాలకు ప్రతీకారాలు తీర్చుకున్నారా? పాకిస్థాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మనం పూర్తిగా ధ్వంసం చేశామా? భారతీయ పర్యాటకులను హత్య చేసి అదృశ్యమైన ఉగ్రవాదులను మనం వెతికి వేటాడి చంపగలిగామా? పహల్గాం ఘటన సూత్రదారి ముసా, లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన సలావుద్దీన్ ఏ రహస్య స్థావరాల్లో దాక్కున్నారు? వారిని అప్పగించేందుకు పాకిస్థాన్ సిద్ధపడిందా? భారతదేశం కొన్ని స్థావరాలను ధ్వంసం చేసిన మాట నిజమే. పాకిస్థాన్‌కు మనం తీవ్ర నష్టం చేశామని మన సైనిక దళాలు వివరాలు ఇచ్చాయి. కాని మనకు జరిగిన నష్టం గురించి తెలిసేందుకు ఆస్కారం లేదు. మన యుద్ధ విమానాలను కూల్చివేయడం గురించి పాక్ చెప్పుకోవడంపై ప్రశ్నించినప్పుడు 'యుద్ధం అన్న తర్వాత నష్టాలు జరగక తప్పదు' అని భారతీయ వైమానిక దళం ప్రకటించింది కాని వివరాలు చెప్పలేదు. పాకిస్థాన్‌కు ఎంత నష్టం జరిగినా, కొంత గాయపరిచినా, వందమందిని పైగా హతమార్చామని చెప్పుకున్నా, పాక్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయడం, ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం, కశ్మీర్‌లో పూర్తిగా శాంతి నెలకొనడం అనే భారత దీర్ఘకాలిక లక్ష్యాలు ఇంకా నెరవేరాల్సి ఉన్నది. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల్లో ఏకాకి చేయడం, దౌత్య, ఆర్థిక సహాయం అందకుండా చేయడం అంత సులభం కాదని తాజా పరిణామాలతో స్పష్టమైంది. నిజానికి నేరుగా యుద్ధం చేయకుండా పాకిస్థాన్ మాదిరే ఆ దేశంలో అల్లకల్లోలం సృష్టించడం, అంతర్గత భద్రతా పరిస్థితులను ఏర్పర్చడం సులభం. కాని దీనివల్ల ప్రచారం లభించదు కదా!

ఇజ్రాయిల్‌లో నెతన్యాహుకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడి అరెస్టయ్యే దశలో హమాస్‌పై దాడి చేసి తనకు తిరుగులేని పరిస్థితిని కల్పించుకున్నారు. భారతదేశంలో నరేంద్రమోదీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు పహల్గాం ఘటన దోహదం చేసింది. పాకిస్థాన్ గురించి, ఉగ్రవాద శక్తుల గురించి ఆయన మాట్లాడిన ఒక్కొక్క మాటకూ దేశ ప్రజలు ఉప్పొంగిపోయారు. నాలుగు రోజుల పాటు మన యుద్ధ విమానాలు పాక్ గగనతలంలో స్వైర విహారం చేసినట్లు వచ్చిన వార్తలు విన్నప్పుడు, మన టీవీ యాంకర్లు టెలివిజన్ తెరలపై యుద్ధాన్ని ఉచ్ఛైస్వరాలతో త్రీడీలో ఆవిష్కరించినప్పుడు ప్రజలు ఉత్కంఠలో మునిగిపోయారు. ఇప్పుడు ఆకస్మికంగా యుద్ధం ఆగిన తర్వాత మోదీ ప్రజల్లో ఆ వేడిని కొనసాగించేందుకు విశ్వయత్నాలు చేస్తున్నారు. దేశ ప్రజలను, సైన్యాన్ని ఉద్దేశించి ఆయన వీరోచితంగా ప్రసంగాలు చేయడం, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనదంటూ దేశ వ్యాప్తంగా బీజేపీ తిరంగా యాత్ర నిర్వహించడం ఇందుకు నిదర్శనం. ప్రశ్నలకు తావివ్వకుండా ప్రచారం చేయడం ఒక రకంగా మంచిదే. కాని ప్రచారం సద్దుమణిగిన తర్వాత మళ్లీ ప్రశ్నలకు ఆస్కారం కలగక తప్పదు. అందువల్ల 'ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధ్రుత్యున్నతోత్సాహులై' అని భర్తృహరి అన్నట్లు మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను ప్రారంభించిన కార్యాన్ని ఇంకా పూర్తిచేయాల్సి ఉన్నది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసిన ఇందిరాగాంధీకి, ఇతర దేశాల జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఆమె గతంలో చేసిన ప్రకటనలపై అంతటా చర్చ జరుగుతోంది!

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)

కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు

'పొంచి ఉన్న కృష్ణా జలకాటకం' శీర్షికతో సీనియర్ జర్నలిస్ట్ వి. శంకరయ్య రాసిన వ్యాసంలో (మే 6, 2025) ఎప్పటి అలవాటు ప్రకారమే తెలంగాణపై అక్కసు వెళ్లగక్కినారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భావోద్వేగాలు పెంచి పోషించే వ్యూహంతో కృష్ణా నదీ జలాల వాటాల గురించి అవశేష ఆంధ్రప్రదేశ్‌తో వాదులాటకు దిగారని ఆరోపించారు. కేసీఆర్‌కు కృష్ణా జలాలపై స్పష్టమైన అవగాహన ఉంది కాబట్టే తెలంగాణ ఏర్పడిన నెల రోజులకే అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద పరిష్కారాల చట్టం, 1956, సెక్షన్–3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయమని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినారు. కృష్ణాలో పంచుకోవడానికి నీళ్ళు లేవని, కృష్ణా జలాల విషయంలో అసలు వివాదమే లేదని, పుష్కలంగా లభ్యమౌతున్న గోదావరి జలాలను పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రోజుల్లో చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ ఖండించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి మాట్లాడకుండా గోదావరి జలాల గురించి మాట్లాడడం కుట్ర పూరితమని స్పష్టం చేశారు.

నిజానికి కృష్ణా లోటు బేసిన్ కానే కాదు. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సాగుకు అనువైన భూములకు సరిపోయేన్ని నీళ్ళు ఉన్నాయి. కానీ బేసిన్‌లోని ప్రాంతాల అవసరాల కంటే బేసిన్ ఆవల ఉన్న ప్రాంతాల అవసరాలకు పెద్దపీట వేసి చూసినప్పుడు కృష్ణా లోటు బేసిన్‌గానే కనబడుతుంది. నాడు బచావత్ ట్రిబ్యునల్ ముందు కర్ణాటక, మహారాష్ట్రలు ఆంధ్రప్రదేశ్ బేసిన్ ఆవలకు తరలించే నీటి వల్లనే కృష్ణా బేసిన్‌లో లోటు ఏర్పడిందని వాదించాయి. వరి పండించడానికి కూడా 130టీఎంసీలు కృష్ణా డెల్టా ఆయకట్టుకు సరిపోతాయి. అవి భూగర్భ జలాలు, వర్షపాతం పుష్కలంగా ఉన్న ప్రాంతాలు కూడా. కానీ ప్రతి సంవత్సరం 200–300 టీఎంసీలకు పైగా కృష్ణా నీటిని డెల్టా ఆయకట్టుకు మళ్లించారు. అట్లాగే కేసీ కెనాల్, నాగార్జునసాగర్ కుడి కాలువ వినియోగాలు కూడా అత్యధిక శాతం బేసిన్ ఆవలనే ఉన్నాయి. ఇట్లా తాము బేసిన్ అవల ఉన్న ప్రాంతాలకు మళ్లించే నీటి వల్లనే లోటు ఏర్పడిందన్న విషయాన్ని మరుగుపర్చి కృష్ణా బేసిన్‌లో నీళ్లు లేవు, అది లోటు బేసిన్ అని ప్రచారంలోకి తెచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని బుట్టలో వేసుకొని కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ వేయడానికి అపెక్స్ కౌన్సిల్లో అనుమతి సాధించారన్నది కేసీఆర్ మీద శంకరయ్య చేసిన మరొక ఆరోపణ. 2020 అక్టోబర్ 6న జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్ సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ వేయడాన్ని వ్యతిరేకించినా, అంతకంటే తీవ్రమైన కేసీఆర్ ప్రతిఘటనకు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. 2014 నుంచి నిరంతరాయంగా సాగుతున్న పోరాటం ఆ రోజు ఒక కొలిక్కి వచ్చింది. అది నిజం కావడానికి తెలంగాణ 2023 ఎన్నికల దాకా ఆగాల్సి వచ్చింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సెక్షన్–3 కింద అదనపు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (ToR) జారీ చేసిందన్న శంకరయ్య ఆరోపణలో నిజం ఎలా ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వ పోరాట నేపథ్యం ఉందన్న సంగతిని శంకరయ్య విస్మరించడం తగదు.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తుది నివేదికపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ నిశితంగా పరిశీలిస్తున్నది. కేంద్రం ప్రతిపాదించే అంశాలలో తెలంగాణ ప్రయోజనాలకు అనుకూల అంశాలు ఉంటే అధ్యయనం చేస్తుంది. లేకపోతే తిరస్కరిస్తుంది. పాత వినియోగాలను యథాతథంగా కొనసాగించాలన్న ఆంధ్రప్రదేశ్ వైఖరితో గుడ్డిగా అంటకాగడం తెలంగాణకు సాధ్యపడదు.



తెలంగాణ ప్రభుత్వం సెక్షన్–3 కింద కృష్ణా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయమని కోరిన ఒక ఏడాది తర్వాత అందుకు భిన్నంగా ఆగస్ట్ 2015లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, సెక్షన్–89 ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వాటా నిర్ణయించడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ సెక్షన్ కింద బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు నివేదించిన అంశాలు తెలంగాణకు న్యాయం చేకూర్చలేవని, వాటి పరిధి పరిమితమైనదని కేసీఆర్‌కు తెలుసు కాబట్టే కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్న ISRWD చట్టం సెక్షన్–3 ప్రకారం ట్రిబ్యునల్ ఏర్పాటు కావాలని కోరుతూ తెలంగాణ ఇచ్చిన ఫిర్యాదుపై నిరంతరాయంగా పోరాటం కొనసాగించాడు. అయితే, అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని జారవిడుచుకోవద్దన్న ఆలోచనతో తెలంగాణకు న్యాయబద్ధ వాటా (equitable share) ఇవ్వాలని సెక్షన్–89 ప్రకారం జరిగే విచారణలోనూ తెలంగాణ పాల్గొన్నది. సెక్షన్–89 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ చేసేందుకు తనకు అధికారం లేదని బ్రిజేష్ కుమార్ పలుమార్లు వెల్లడించారు. ఈ పరిస్థితిలో అపెక్స్ కౌన్సిల్‌లో పట్టుబట్టి సెక్షన్–3ని సాధించారు కేసీఆర్.

అయితే, తెలంగాణలో కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే పాలమూరు–రంగారెడ్డి, డిండి, భక్త రామదాసు, తుమ్మిళ్ళ, మిషన్ భగీరథ తదితర పథకాలు అక్రమమైనవని ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ వాదిస్తున్నది. బేసిన్‌లోని హైదరాబాద్ నగరానికి వినియోగించే తాగునీటిని బచావత్ ట్రిబ్యూనల్ ప్రకారం 20శాతం మాత్రమే లెక్కించాల్సి ఉంటే, ఆంధ్రప్రదేశ్ అడ్డుకుంటున్నందు వల్ల గత పదేళ్ళుగా ఏటా సగటున 15టీఎంసీలు తెలంగాణ కోల్పోయింది. పోలవరం ద్వారా మళ్లించే గోదావరి నీటిలో 45టీఎంసీలు కృష్ణా బేసిన్‌లో నాగార్జునసాగర్ ఎగువన ఉన్న తెలంగాణకు దక్కాలి. తెలంగాణ రాష్ట్రం ఆ నీటిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించుకున్నది. మైనర్ ఇరిగేషన్‌కి కేటాయించిన 90 టీఎంసీలలో 45 టీఎంసీల మిగులును కూడా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించింది. ఈ కేటాయింపులను ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకిస్తున్నది. రాజోలిబండ ఆనకట్ట ఆధునికీకరణ పనులు పూర్తి కానీయకుండా అన్యాయంగా అడ్డుతగుల్తున్నది. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం తెలంగాణ తన వాటాను నాగార్జునసాగర్‌లో భద్రపరచుకొని మరుసటి సంవత్సరం వాడుకుంటామని (Carry Over) అంటే నిరాకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ఘర్షణలు మాని సోదర తెలుగు రాష్ట్రమైన తెలంగాణకు సహృదయంతో తోడ్పడాలి. తెలంగాణ ప్రభుత్వం నిరంతరాయంగా చేసిన పోరాట ఫలితంగానే సెక్షన్–3 కింద అదనపు ToRను కృష్ణా ట్రిబ్యునల్‌కు కేంద్రం నివేదించింది. కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు.

ఇక, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తుది నివేదికపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ నిశితంగా పరిశీలిస్తున్నది. కేంద్రం ప్రతిపాదించే అంశాలలో తెలంగాణ ప్రయోజనాలకు అనుకూల అంశాలు ఉంటే అధ్యయనం చేస్తుంది. లేకపోతే తిరస్కరిస్తుంది. పాత వినియోగాలను యథాతథంగా కొనసాగించాలన్న ఆంధ్రప్రదేశ్ వైఖరితో గుడ్డిగా అంటకాగడం తెలంగాణకు సాధ్యపడదు.

• శ్రీధర్‌రావు దేశ్‌పాండే
విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజనీర్

మాతృభాషకు ప్రాధాన్యమిద్దాం

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలోనూ, గత వైభవాన్ని తేవడంలోను ఎంతో కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అభివందనాలు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 350A ప్రకారం మాతృభాషలో విద్యాబోధన జరగాలని, విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 29లో ఉన్న సంగతి తమకు తెలిసిందే. అయితే భాషా ప్రాతిపదికన ఏర్పడిన మన పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, బెంగాల్ లలో వారి భాషాభిమానాన్ని చాటుకుంటూ, వారి మాతృభాషలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక విద్య తప్పనిసరిగా మాతృభాషలోనే ఉండాలి; ఇంటర్, డిగ్రీలలో తప్పనిసరిగా తెలుగును రెండవ భాషగా, ఒక సబ్జెక్టుగా ఉండేట్లు చూడాలి; అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల పేరు పలకలు (సైన్ బోర్డ్స్) తప్పనిసరిగా తెలుగులో కూడా ఉండేట్లు చూడాలి; ఏపీఎస్ఆర్టీసీ బస్సులపై సంస్థ పేరు, ఊరి పేర్లు తెలుగులోనే ఉండాలి; ప్రభుత్వ జీవోలు, ఆర్డినెన్సులు, ఉత్తర్వులు, అన్ని శాఖలలో ఉత్తర ప్రత్యుత్తరాలు, కోర్టు వ్యవహారాలను కూడా తెలుగు భాషలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి; తెలుగు అకాడమీ పేరును తిరిగి అలాగే పునరుద్ధరించాలి; తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో తప్పనిసరిగా రిజర్వేషన్ కల్పించాలి. పొరుగు రాష్ట్రాలు ఆ పద్ధతిని పాటిస్తున్నాయి; గత ప్రభుత్వం నిర్ణయించిన నిర్బంధ ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రాథమిక విద్యా బోధనను తొలగించి, తెలుగులోనే కొనసాగించాలి; ఒక మాతృభాష మరుగైతే, ఆ జాతి, ఆ జాతి సంస్కృతి కూడా మరుగవుతుందన్నది భాషావేత్తల వాదన. అలాగే ప్రజలలో సాంఘిక చైతన్యాన్ని కలిగించి, వారిలో మాతృభాషపై అభిమానం పెరిగేటట్లు చేయాలి. అలాగే ఇప్పుడు తెలుగు భాష కోసం మనందరం పాటుపడవలసిన అవసరం ఉన్నది.

– రాఘవ మాస్టారు కేదారి
అధ్యక్షులు, జాతీయ తెలుగు పరిరక్షణ సమితి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

పర్యాటకాభివృద్ధి సంస్థలో ఉన్నతాధికారుల రూటే సపరేటు'గా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. లాభాల్లో ఉన్న హరిత బెర్మ్ పార్క్‌ను రూ.110 కోట్లకు ఓ బ్యాంకులో తాకట్టు పెట్టారు. ఇప్పుడు ఆ తాకట్టులోని పర్యాటక యూనిట్లను ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాకట్టు.. 'కనికట్టు!

పర్యాటకాభివృద్ధి సంస్థ మాయాజాలం

రూ.110 కోట్లకు హరిత బెర్మ్ పార్క్ తాకట్టు

- గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నిర్వాకం
- ఇప్పుడు 'స్టెర్లింగ్' సంస్థకు పర్యాటక యూనిట్లు కట్టబెట్టేందుకు యత్నం
- లాభాల్లోని యూనిట్లను ప్రైవేటుకు ఇవ్వకూడదన్న ఏపీటీడీసీ పాలకవర్గం
- అయినా వినని ఉన్నతాధికారులు.. అంతా గందరగోళం!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో తాకట్టు.. ఆపైన కనికట్టు వ్యవహారం నడుస్తోంది. వైసీపీ హయాంలో హరిత బెర్మ్ పార్క్‌ను తాకట్టు పెట్టి రూ.110 కోట్ల రుణ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ రుణాలతో పర్యాటక యూనిట్లలోని కాటేజీలు, రిసార్టుల రెన్నోవేషన్ చేపట్టారు. ఈ పనుల వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో కొలువుతీరిన ఏపీటీడీసీ బోర్డు వైసీపీ హయాంలో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ఒక్కో ఇటుక పేరుస్తుంటే.. ఉన్నతాధికారులు వాటికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. హరిత బెర్మ్‌పార్క్‌పై రూ.110 కోట్ల అప్పు తీసుకుని భవానీ ఐల్యాండ్‌తో సహా రాష్ట్ర వ్యాప్తంగా పలు యూనిట్ల ఆధునీకరణ పనులు చేపట్టిన ఏపీటీడీసీ అధికారులు వీటిని గంపగుత్తగా 'స్టెర్లింగ్' అనే సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బ్యాంకు తనఖాలో ఉన్న ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అసలు కట్టబెట్టవచ్చా? ఆ ప్రైవేటు సంస్థ ఏ విధంగా తీసుకుంటుంది? అన్న అంశాలు తాజాగా చర్చనీయాంశం అవుతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో అనేక న్యాయపరమైన మిగతా 6లో..

ఎవరి ప్రయోజనం కోసం ఈ తాపత్రయం?

రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పర్యాటక శాఖను పర్యవేక్షించే ఓ ఉన్నతాధికారి త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈయన తన పదవీ విరమణ లోపు అద్భుతమైన ప్రాజెక్టులను చేపట్టానన్న పేరు కోసం పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ విషయాన్ని తెర మీదకు తీసుకు వచ్చారు. ఇది కనుక సాకారమైతే.. ఆయనకు మరికొంత కాలం ఎక్స్‌టెన్షన్ లభించవచ్చన్నది ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

తాకట్టు నుంచి విడిపించండి!



ప్రస్తుతం తాకట్టులో ఉన్న హరిత బెర్మ్‌పార్క్‌ను తక్షణం విడిపించే చర్యలు చేపట్టాలి. రూ. 110 కోట్లకు రుణ అగ్రిమెంట్ ఉన్నా చేసిన పనులను బట్టి సగాని కంటే తక్కువగానే బ్యాంకుల నుంచి చెల్లింపులు జరిగాయని తెలుస్తోంది. కాబట్టి ప్రభుత్వం ఈ డబ్బులను బ్యాంకుకు ఫండ్‌గా ఇచ్చి.. రుణ విముక్తి కల్పించి.. వచ్చిన ఆదాయంలో కొంత డబ్బుతో ఆధునీకరణ చేపట్టుకునేలా వారికి స్వయం ప్రతిపత్తి ఇస్తే సరిపోతుంది. దీనివల్ల పర్యాటకులకు భారం కానీ పర్యాటకం అందుబాటులోకి వస్తుంది.

సామాన్యులపై ధరల భారం ఉండకూడదన్న సీఎం

ఇటీవల పర్యాటక శాఖ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా కొందరు ఉన్నతాధికారులు పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ అంశాన్ని తీసుకువచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించలేదు. ఆయా పర్యాటక యూనిట్ల పరిస్థితులను మదింపు చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పేదలకు ధరల భారం ఉండే పరిస్థితి రాకూడదని కూడా స్పష్టం చేశారు. భారీ స్థాయిలో వచ్చేవి, బల్క్‌గా, కొత్తగా చేపట్టే ప్రాజెక్టుల విషయంలో పీపీపీ విధానాలను అవలంబించాలని మొదటి నుంచి ఆయన చెబుతున్నారు. పర్యాటక పాలసీలో కూడా కేటగిరీల వారీగా ప్రోత్సాహకాలను వెలువరించారు. ఇంత స్పష్టంగా ఉన్నా కూడా పర్యాటక శాఖ అధికారులు తమ రూటే సెపరేటు అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

నున్న పవర్ గ్రిడ్



తొలగిస్తే పోయేదానికి.. రూ.కోటి అద్దె చెల్లించారు!

సబ్ స్టేషన్లు లేని సమయంలో 'నున్న పవర్ గ్రిడ్'లో 2 'బే'ల ఏర్పాటు

నెలకు రూ.2 లక్షల అద్దె చెల్లిస్తున్న ట్రాన్స్‌కో

- సబ్ స్టేషన్ల సంఖ్య పెరగడంతో 2022 నుంచి నిరుపయోగంగా 'బే'లు
- తొలగించకుండా ఇంకా అద్దె చెల్లిస్తున్న అధికారులు

ట్రాన్స్‌కో అధికారుల తీరు అనేక విమర్శలకు దారితీస్తోంది. నాటి అవసరాల కోసం నున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన రెండు 'బే'లు 2022 నుంచి నిరుపయోగంగా ఉంటున్నాయి. రూ.20 లక్షలు ఖర్చు చేసి తొలగించాల్సిన వీటికి నెలకు రూ.2 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.కోటి అద్దె చెల్లించారు. ఇంకా చెల్లిస్తూనే ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గతంలో తగినన్ని సబ్‌స్టేషన్లు లేకపోవటంతో విద్యుత్ సరఫరా అవసరాలను తీర్చటం కోసం విజయవాడ శివారు నున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)లో రెండు 'బే' లను ట్రాన్స్‌కో ఏర్పాటు చేసింది. ఈ 'బే'ల ద్వారా ట్రాన్స్‌కో లైన్స్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. కాలక్రమంలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్లను గణనీయంగా పెంచుకుంది. సత్తెనపల్లి, వేమగిరి వంటి జిల్లాయేతర ప్రాంతాల్లో కూడా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకుంది. దీంతో నున్నలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లోని 'బే'ల అవసరం లేకుండా పోయింది. ఇక్కడ 'బే'లను నిర్వహిస్తున్నందుకు నెలకు రూ2 లక్షలు పీజీసీఐఎల్‌కు ట్రాన్స్‌కో అద్దె చెల్లిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ 'బే'ల వినియోగం నిలిచిపోయింది. దీంతో 2022 నుంచి నిరుపయో గంగా ఉంటున్న ఈ 'బే'లను తొలగించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. వైసీపీ ప్రభుత్వం దృష్టికి వెళ్లినా కూడా పట్టించుకోకపోవటంతో అప్పటి నుంచి ట్రాన్స్‌కో అధికారులు అద్దె చెల్లిస్తూనే ఉన్నారు. దాదాపుగా నాలుగేళ్లుగా రూ.కోటి వరకు అద్దె చెల్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పది నెలలుగా ట్రాన్స్‌కో అధికారులు ఉత్త పుణ్యానికి పీజీసీఎల్‌ఐకి అద్దె చెల్లిస్తున్నారు. నున్న పవర్ గ్రిడ్‌లో ఉన్న రెండు 'బే'లను తొలగించటానికి రూ.20 లక్షలు ఖర్చు చేస్తే సరిపోతోంది. ఈ పని చేయటానికి ట్రాన్స్‌కో అధికారులకు చేతులు రావటం లేదు. టెండర్లు పిలుస్తున్నారు కానీ మళ్లీ ఎందుకు ఆగిపోతుందో అర్థం కావటం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ట్రాన్స్‌కోపై పడుతున్న అద్దె భారాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేశినేని నాని అక్రమాలపై సీబీఐకి లేఖ

కావాలనే బ్యాంకు రుణాల ఎగవేత

- రుణం తీసుకుని కంపెనీ పేరు, భార్యభర్తల పేర్లు మార్పు
- తన కింద ఉన్న డైరెక్టర్లను పెట్టి స్కామ్
- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్
- కేశినేని శ్రీనివాస్ ఆర్థిక ఉగ్రవాది : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా



కొలికపూడి శ్రీనివాసరావు



నాగుల్ మీరా

వన్‌టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు చేయాలని సీబీఐకి లేఖ రాసినట్లు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ చెప్పారు. గురునానక్ నగర్‌లోని విజయవాడ ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశినేని శ్రీనివాస్ చేసిన ఆర్థిక అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని సీబీఐని కోరుతున్నట్టు తెలిపారు. నాని ఉద్దేశ్యపూర్వకంగానే బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుని ఎగ్గొట్టారని ఆరోపించారు. పదేళ్లపాటు ఎంపీ పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక నేరానికి పాల్పడినట్టు చెప్పారు. ప్రజా జీవితంలో ఉన్నవారు మాట్లాడే మాటలను వారి వ్యక్తిగత వ్యాపార అంశాలను నిరంతరం ప్రజలు గమనిస్తుంటారన్నారు. విజయవాడ ఎంపీ శివనాథ్ (చిన్ని)పై కేశినేని నాని బురద జల్లే కార్యక్రమాన్ని చేపట్టారని, గుడ్డ కాల్చి మీద వేస్తే సరిపోతుందన్న తరహాలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శివనాథ్ ఉమ్మడి కృష్ణాజిల్లాలో మెడికల్ మిగతా 6లో..

వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు



రూ.83,500 కోట్లతో రుణ ప్రణాళిక

- ప్రాధాన్య రంగానికి రూ.33 వేల కోట్ల రుణ ప్రతిపాదనలు
- బ్యాంకుల వారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలి
- ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త సాధనలో కీలక భాగస్వాములు కావాలి
- వినియోగదారుడిని ఉత్పత్తిదారుడిగా చేసే పీఎం సూర్యఘర్‌పై విస్తృత అవగాహన కల్పించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.10,500 కోట్లు అదనం



విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, ఆర్థిక ప్రగతి, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో రూ.83,500 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. మంగళవారం రుణ ప్రణాళికను విడుదల చేసింది. ముగిసిన 2024 - 25 ఆర్థిక సంవత్సరం కంటే రూ. 10,500 కోట్లు హెచ్చుగా రుణ ప్రణాళికకు రూపకల్పన చేసింది. వ్యవసాయ రంగానికి రూ.13,500 కోట్లను కేటాయించింది. వ్యవసాయ రంగంలో షార్ట్ టర్మ్ పంట రుణాలు రూ.11,500 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్స్ (అగ్రి ఇన్ఫ్రా, అనుబంధ రంగాలు) రూ.5,000 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) రంగానికి సంబంధించి రూ.17,500 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.2,495 కోట్లు, ప్రాధాన్యత రంగానికి రూ.33,000 కోట్లు, ప్రాధాన్యతేతర రంగాలకు రూ.50,500 కోట్లు చొప్పున కేటాయించటం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా చరిత్రలో ఇది అతి పెద్ద వార్షిక రుణ ప్రణాళికగా నిలుస్తోంది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను మించి సాధించటంతో ఈ సారి రికార్డు స్థాయిలో రూ. 83,500 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవటం జరిగింది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో షార్ట్ టర్మ్ పంట రుణాలు 82%, వ్యవసాయ టర్మ్ లోన్స్ 134%, వ్యవసాయ రుణాలు 102%, ఎంఎస్ఎంఈ 110%, ఇతర ప్రాధాన్యత రంగం 45%, ప్రాధాన్యతరంగం 100%, ప్రాధాన్యేతర రంగం 136% శాతం మేర లక్ష్యాన్ని సాధించటం జరిగింది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో స్థూలంగా రూ. 73,000 కోట్ల వార్షి రుణ ప్రణాళికను నిర్దేశించుకోగా... ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.89,468 కోట్ల మేర సాధించటం జరిగింది. ఈ లెక్కన చూస్తే 123 శాతం మేర లక్ష్యాన్ని సాధించటం జరిగింది. దీంతో నూతన ఆర్థిక సంవత్సరం మిగతా 6లో..



ఉక్కపోత

పెనుగంచిప్రోలులో రికార్డు స్థాయిలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

- బయటకు రావడానికి భయపడుతున్న జిల్లా వాసులు
- నేడూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణశాఖ స్పష్టం



విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గడచిన రెండు రోజులుగా రికార్డు స్థాయిలో వరుసగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం పెనుగంచిప్రోలు 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తక్కువగా తిరువూరు 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతకు జనం ఇళ్లల్లో ఏసీలను, కూలర్లను ఆపడం లేదు. ఉద్యోగస్తులు సీట్ల నుంచి లేచి బయటకు రావడానికి భయపడుతున్నారు. చందర్లపాడు 43.2, కంచికచర్ల 43.00, గంపలగూడెం 42.8, వత్సవాయి 42.6, వీరులపాడు 42.4, రెడ్డిగూడెం 42.8, విజయవాడ 42.6, విజయవాడ రూరల్ 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. విజయవాడ నగరం, రూరల్ మొత్తం మీద గుణదల ప్రాంతంలో ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడ 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో ఉన్న వాతావరణ కేంద్రాల్లో సాంకేతిక లోపం రావడంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. మరికొన్ని మండలాల్లోను ఇదే పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు రహదారుల నుంచి వెచ్చని సెగలు పైకి వచ్చాయి. వేడి గాలులు వీయడంతో మాస్కులు, స్కార్ఫ్‌లు కట్టుకోవాల్సిన మిగతా 6లో..



కన్నీటి వ్యథ!

- అధ్వానంగా సాగునీటి కాలువలు!
- తూడు, జమ్ముతో నిండిన సప్లయి చానెల్స్
- ఎన్ఎస్పీ కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు
- వైసీపీ పాలకుల పాపం.. అన్నదాతకు శాపం

6



ధనంబోడును వీక్షిస్తున్న పిరమిడ్, బుద్ధిస్ట్ సొసైటీల సభ్యులు

ధనంబోడు బౌద్ధారామాన్ని సందర్శించిన పిరమిడ్, బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు

జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని ధనంబోడు బౌద్ధారామాన్ని పలువురు బుద్ధిస్ట్, పిరమిడ్ సొసైటీల సభ్యులు సందర్శించారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని జగ్గయ్యపేటలో బుద్ధవిహార్ ధ్యాన కేంద్రం సభ్యులు వారికి ధనంబోడును చూపించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాంబోది కాశీ, మాజీ ఏఎంసీ చైర్మన్ గింజుపల్లి రమేష్, ధ్యానరత్న వెలగపుడి లక్ష్మణరావు తదితరులు బౌద్ధారామంలో బుద్ధ భగవానుడి దంత అవశేషం నిక్షిప్తం చేశారని, 2200సంవత్సరాల నాటిదని, ఆచార్య నాగార్జునుడి మార్గదర్శ కత్వంలో బౌద్ధం వర్ధిల్లిందని వివరించారు.



నెట్టెంను కలిసిన ఐటీ ప్రతినిధులు

జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను లోటస్ టెక్నాలజీ అండ్ హెచ్‌సీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ముప్పవరపు రాఘవేంద్ర, సీఈవో చలువాది సాయిహనుమకుమార్‌లు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. జగ్గయ్యపేటలో ఐటీహబ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో వారు నెట్టెంతో భేటీ ప్రాధాన్యతను సంతరించు కుంది. వారితో పాటు సాదినేని సుధాకర్‌రావు, న్యాయవాది అన్నెపాగ కిశోర్‌లు ఉన్నారు.





నరసింహస్వామికి చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు

జగ్గయ్యపేటరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేదాద్రి గ్రామంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరుక్కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. మంగళవారం కల్యాణ గరుడోత్సవం, గజ వాహనసేవ, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈవో సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై వేటు

» ఆర్టీసీ ఈయూ నేతల హర్షం

బస్‌స్టేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో అవినీతి అధికారులపై సంస్థ ఎండీ వేటు వేయటంపై ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎండీ చర్యలతో విజిలెన్స్ విభాగంలో అవినీతి అధికారులు, సూపర్‌వైజర్ల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. అవినీతికి పాల్పడిన కడప విఅండ్ఎస్‌వో నుంచి బాధిత కుటుంబాలను ఆదుకునేలా డబ్బులు వెనక్కు ఇచ్చేయాలని కోరారు. ఆర్టీసీలో కడప, విజయవాడ జోన్‌ల్లో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాల్లో ఇటీవల వచ్చిన అవినీతి ఆరోపణలపై సంస్థ కమిషనర్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అందుకు బాధ్యులైన కడప విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ అవినీతి ఆఫీసర్‌కు మధ్యవర్తులుగా వ్యవహరించిన తొమ్మిది మంది కడప జోన్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బందిని కూడా సస్పెండ్ చేసినట్టు వివరించారు. విజయవాడ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను హెడ్ ఆఫీసుకు సరెండర్ చేశారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన వారిని, వారికి సహకరించిన సిబ్బంది పై ఎండీ తీసుకున్న చర్యల పట్ల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.




మాధురి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బాలకోటయ్య

మాధురి మృతిపై విచారణ

చందర్లపాడు, మే 13 : ఉపాధి పనుల్లో అక్రమాలపై స్పందించి ఆత్మహత్యకు పాల్పడిన అబ్బూరి మాధురి మృతిపై ఉన్నతాధికారులు స్పందించారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఏపీడీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. మంగళవారం విపరింతలపాడు గ్రామంలో పర్యటించిన ఆయన ఉపాధి కూలీలు, మాధురి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆమె ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని పీడీకి వివరించి మాధురి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నట్టు మాధురి ఆత్మహత్య తేటతెల్లం చేసిందని బహుజన ఐకాసా అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య విమర్శించారు. మంగళవారం ఆయన మాధురి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, తన ఆత్మహత్యకు గల కారణాలను మాధురి స్పష్టంగా చెప్పిందన్నారు. కేసును పూర్తిగా విచారించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కుక్కల దాడి..చూడిగేదె మృతి



జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనీలోని డెయిరీ ఫాంలో చూడిగేదెపై కుక్కలు దాడిచేసి చంపేశాయి. పాటి బండ్ల నరేంద్ర డెయిరీ ఫాంలో గేదెలపై కుక్కలు తరచు దాడులు చేస్తున్నాయి. సోమవారం కుక్కలు చూడిగేదెపై దాడిచేయటంతో వెంటనే కర్రలతో తరిమికొట్టారు. గేదె మంగళవారం ఉదయం మృతి చెందింది. కుక్కల దాడిలో చనిపోయిన నాలుగోది అని నరేంద్ర వాపోయారు. వ్యయ ప్రయాసలకోర్చి గేదెలు పోషణ చేస్తుంటే కుక్కల దాడితో తీవ్రంగా నష్టపోతున్నట్టు చెప్పారు. చూడిగేదె రూ.60 వేలు పైగా ఉంటుందని కన్నీటి పర్యంతమయ్యారు. పురపాలకసంఘ అధికారులు ఇప్పటికైనా స్పందించి గేదెలు, ఆవులను కుక్కల బారి నుంచి రక్షించాలని కోరారు.

కన్నీటి వ్యథ!

» అధ్వానంగా సాగునీటి కాలువలు!
» తూడు, జమ్ముతో నిండిన సప్లయి చానెల్స్
» ఎన్ఎస్పీ కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు
» వైసీపీ పాలకుల పాపం.. అన్నదాతకు శాపం



కట్టుబడిపాలెం తారకరామ ఎత్తిపోతల కుడి కాలువలో జమ్మి, తూటు కాడ



తిరువూరు మండలం వావిలాల వద్ద ముళ్ల కంపలతో నిండిన ముష్టికుంట్ల మేజర్ కాలువ



విస్సన్నపేటలో పెద్ద చెరువు సప్లయి చానల్‌పై కట్టడాలు

ఖరీఫ్ వేళ రైతుకు కష్టకాలం!

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న క్రమంలో సాగునీటి చెరువులకు నీటి వనరులుగా ఉన్న సప్లయి చానెల్స్, కాలువలు, ఎన్ఎస్పీ కాలువల మరమ్మతులు చేయకుంటే సాగునీటి ఇబ్బందులు తలెత్తడం ఖాయమని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో కాలువలు, సప్లయి చానెల్స్, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు ఆయకట్టు చివరి భూములకు అందే పరిస్థితులు లేవు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురవడంతో కాలువల్లో తూటు, జమ్మి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పలుచోట్ల కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన పూడిక, జమ్మి, తూటు కాడ తొలగింపు పనులు ప్రారంభిస్తే తప్ప ఖరీఫ్ ప్రారంభానికి సవ్యంగా సాగునీరు ఆయకట్టు రైతులకు అందించలేని పరిస్థితి. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న సప్లయి చానెల్, ఎన్ఎస్పీ, ఎత్తిపోతల పథకాల కింద ఉన్న కాలువల దుస్థితిపై సమగ్ర కథనం. (ఇబ్రహీంపట్నం/తిరువూరు/మైలవరం రూరల్/విస్సన్నపేట - ఆంధ్రజ్యోతి)

మైలవరం నియోజవర్గంలో..

ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడరూరల్ మండలాలకు తారకరామ ఎత్తిపోతల పథకం ద్వారా పంటపొలాలకు సాగునీరు కుడి, ఎడమ కాలువల ద్వారా అందిస్తున్నారు. ప్రస్తుతం కుడికాలువపై కొండపల్లి పంపు హౌస్ నుంచి జి.కొండూరు వద్ద పంపు హౌస్ వరకు కాలువలో ఎక్కడ చూసినా జమ్మి, తూటు కాడ పెరిగిపోయింది. దీంతో సాగునీరు చివరి ఆయకట్టు భూములకు సవ్యంగా సాగని పరిస్థితి. కవులూరు, కట్టుబడిపాలెం వద్ద గుర్రాల వాగు, తొమ్మండ్రు వాగుల్లో తూటు కాడ, జమ్మి పెరిగి వరదల సమయంలో నీరు కిందకు పోకుండా పంటలను పాడుచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పలు చెరువులకు సాగునీటి వనరులుగా ఉన్న సప్లయి చానెల్స్ సైతం ఏళ్ల తరబడి పూడిక తీతకు నోచుకోకుండా ఉన్నాయి.

● నాగార్జునసాగర్ మూడో జోన్‌లో ఉన్న చెవుటూరు, కొండపలి, జక్కంపూడి మేజర్ ఎన్ఎస్పీ కాలువ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. చాలా చోట్ల అడుగుల ఎత్తులో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

● తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల ఎన్ఎస్పీ మేజర్ కాలువ దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ 2వ రెగ్యులేటర్ వెంకటేశ్వర నగరం నుంచి సుమారు 4కిమీ ముష్టికుంట్లకు, 10వ రెగ్యులేటరీ కాలువ ఖమ్మంజిల్లా ఎర్రబోయనపల్లి నుంచి మండలంలోని రాజుగూడెం మీదుగా వావిలాలకు వెళ్లే కాలువల్లో జమ్మిగడ్డి ముళ్ల కంప చెట్లతో నిండి కాలువకు నీరు వదిలితే ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. వావిలాల వద్ద కాలువ డ్రిప్ కూలి రెండేళ్లవుతున్నా నేటికీ మరమ్మతులు చేయలేదు. మండలంలోని పలు చెరువులకు సాగునీరు వెళ్లే సప్లయి చానల్స్ పూడిక చేపట్టలేదు.

● విస్సన్నపేట పెద్ద చెరువు సప్లయి చానెల్ ఆక్రమణలకు గురైంది. చానల్‌పై తూరలు వేసి మట్టిపోసి కట్టడాలు చేపడుతున్నారు. వరదల సమయంలో నీరు చానల్ ద్వారా చెరువులోకి సవ్యంగా వెళ్లకుండా రహదారి మీదకు వస్తున్నదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా సాగర్ కాలువ

మరమ్మతులకు నోచుకోని సాగర్ కాలువలు..

నందిగామరూరల్/జగ్గయ్యపేటరూరల్, మే 13 ఆంధ్రజ్యోతి : సాగుకు ఊపిరిపోసే సాగర్ కాలువలు మరమ్మతుల్లేక ఉసూరుమంటున్నాయి.. కాలువల్లో పూడిక చేరి కట్టలు పటుత్వం తగ్గి గండ్లు పడి ఉన్నాయి. కంప చెట్లతో నిండి అడవిని తలపిస్తున్నాయి. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవడం వల్ల ఈ దుస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులు చేపడుతుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నా.. ఇంత వరకూ ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినా.. సాగర్ కాలువల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కాలువలు మరమ్మతులకు నోచక దారుణంగా తయారయ్యాయని రైతులు విమర్శిస్తున్నారు.

నాగార్జునసాగర్ జోన్-2, జోన్-3 పరిధిలు 36కిలోమీటర్ల మేర బ్రాంచ్ కెనాల్స్ ఉండగా, వంద కిలోమీటర్ల మేర మేజర్ కాలువలు ఉన్నాయి. ఈ పరిధిలో సుమారు మూడువందల వరకూ మైనర్, సబ్‌మైనర్ కాలువలు ఉన్నాయి. వీటిలో బ్రాంచ్ కెనాల్స్‌కు లైనింగ్ పనులు జరిగి ఉండటం వల్ల పెద్దగా దెబ్బతినలేదు. మేజర్, మైనర్ కాలువల పరిస్థితి ఘోరంగా ఉంది. కాలువలపై చాలాచోట్ల భారీ గండ్లు పడ్డాయి. మైనర్, సబ్‌మైనర్ కాలువలు చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. మూడు దశాబ్దాలుగా సాగర్‌నీరు రాకపోవడంతో నిరుపయోగంగా ఉన్న మైనర్, సబ్‌మైనర్ కాలువలను రైతులు ఆక్రమించి సాగుచేస్తున్నారు. జగ్గయ్యపేట మండలానికి వరప్రసాదంగా ఉన్న కాచవరం సప్లయి చానల్ ఇటీవల వరదలకు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పంటలు రక్షించుకొనేందుకు రైతులు సొంత డబ్బులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సప్లయి చానల్ మరమ్మతులకు 40లక్షలతో అంచనాలు రూపొందించినా ఇంతవరకూ నిధులు మంజూరు కాలేదు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువలు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాల్సిన జలవనరులశాఖ ఇంత వరకూ ఆ దిశగా ఆలోచనలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అభివృద్ధికి నోచని కాచవరం సప్లయి చానల్

రసవత్తరంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం నాలుగు పళ్ల జతల ఎడ్ల బండలాగుడు పోటీలను లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ప్రారంభించారు. పోటీలలో ఏడు జతలు పాల్గొనగా 15 నిముషాల వ్యవధిలో 8.50 క్వింటాళ్ల బండ లాగినట్టు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సోమవారం రాత్రి జరిగిన రెండు పళ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యారం గ్రామానికి చెందిన కేఎంకే బుల్స్ కడియం మణికంఠ ఎడ్ల జత మూడువేల అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.25వేలు గెలుచుకుందన్నారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన కేఆర్ఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన రెడ్డి ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన జమ్మనబోయిన సుబ్రహ్మణ్యం ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచి రూ. 18వేలను, గెలుచుకుంది.





ఎడ్ల బండ లాగుడు పోటీలు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు(కింద)

ఉక్కపోత

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి వచ్చింది. కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ షాపులు కిటకిటలాడాయి. నగరంలో ఏసీ థియేటర్లు హౌస్‌ఫుల్‌కు దగ్గరగా వెళ్లాయి. మంగళవారం సాయంత్రం నుంచి మాత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీయడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. దినసరి కూలీలు వేకువజామున పనులు ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు ముగించారు. భవన నిర్మాణ కార్మికులూ ఈ విధంగానే చేశారు. సాయంత్రం వరకు ఆయా భవనాల్లో ఉండిపోయి వాతావరణం చల్లబడిన తర్వాత ఇళ్లకు పయనమయ్యారు. ఇప్పుడే ఎండలు ఈవిధంగా ఉంటే రోహిణి కార్తె ప్రవేశిస్తే ఇక ఏస్థాయిలో ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం నుంచి మాత్రం జిల్లాలో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు వరుసగా అధికంగా నమోదైన తర్వాత వర్ష సూచనలు రావడం ఒక సైకిల్‌లా నడుస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

తాకట్టు.. ఆపైన కనికట్టు!

(5వ పేజీ తరువాయి)

చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేయాలన్న పేరుతో బ్యాంకు రుణంతో చేపట్టాల్సిన పనులను అర్థంతరంగా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు నిలుపుదల చేయించారు. దీంతో పర్యాటక యూనిట్లు ఆధునీకరణకు నోచుకోకుండా పోయాయి. దీని తర్వాత షాకింగ్ వార్తను ఏపీటీడీసీ అధికారులు అందుకున్నారు. అదేమిటంటే.. ఏ సంస్థకు అయితే కట్టబెట్టాలనుకుంటున్నారో.. ఆ సంస్థ భవానీ ద్వీపాన్ని, బెర్మ్ పార్క్‌ను పరిశీలించిన తర్వాత భవిష్యత్తులో భారీ వరద వస్తే తాము నష్టపోతామని వెనుకడుగు వేసింది. దీంతో షాక్‌కు గురైన ఏపీటీడీసీ అధికారులు ఆ సంస్థను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పించేందుకు రాయితీల వర్షం కురిపిస్తూ చర్చలు జరుపుతున్నారు.

ముందుగానే కమీషన్లు దండుకుని..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకాభివృద్ధికి నయా పైసా విదల్చలేదు. మీ చావు మీరు చావండన్నట్టు వ్యవహరించింది. దీంతో అప్పట్లో ఉన్న కొందరు ఉన్నతాధికారులు విచ్చలవిడి అవినీతికి తెరలేపారు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వటంలేదన్న కారణంతో.. అవినీతి రుచి మరిగిన ఉన్నతాధికారులు బ్యాంకుల దగ్గర రుణం తీసుకుందామన్న ప్రతిపాదన తెచ్చారు. దీని కోసం విజయవాడలోని భవానీపురంలో కృష్ణానది వెంబడి ఉన్న హరిత బెర్మ్‌పార్క్ 5.50 ఎకరాల స్థలాన్ని రూ.110 కోట్లకు తాకట్టు పెట్టారు. ఈ డబ్బులతో ఏమి చేస్తారని బ్యాంకు ప్రశ్నించగా తమ పర్యాటక యూనిట్ల కాటేజీలను ఆధునీకరణ చేస్తామని, తద్వారా పర్యాటకుల ఆదరణ ద్వారా మరింత ఆదాయం వస్తుందని, ఆ ఆదాయంతో అప్పు తీర్చుతామని తెలిపింది. బ్యాంకు కూడా తెలివిగానే వ్యవహరించింది. గంపగుత్తగా డబ్బులు ఇవ్వకుండా ఆయా పర్యాటక యూనిట్ల వారీగా ఆధునీకరణ చేపడుతున్న కాంట్రాక్టర్లకు చేసిన పనిని బట్టి నేరుగా వారికే చెల్లింపులు చేస్తామని చెప్పింది. దీనికి అప్పటి ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అంగీకరించారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఎన్నికల ముందు హడావిడిగా కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టి ముందుగానే పనులన్నింటికీ అప్పటి ఉన్నతాధికారులు కమీషన్లు దండుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. బ్యాలెన్స్ పనులు ఆ తర్వాత వచ్చిన అధికారులు చేపట్టారు. కొంతకాలం నుంచి సడెన్‌గా పనులన్నింటినీ ఆపేశారు. దీంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. పనులు సగంలో ఆపివేశారని, తమ నుంచి కమీషన్లు మాత్రం ముందుగానే దండుకున్నారని, ఎంతో మెటీరియల్ ఖర్చు చేశామని, బిల్లులు చెల్లించకపోతే నష్టపోతామని అంటున్నారు.

తప్పులు సరిచేయకుండా.. ప్రైవేటీకరణ వల్ల ప్రయోజనమేమిటి ?

వైసీపీ హయాంలో చేసిన తప్పులను సరిచేయకుండా.. మళ్లీ అవే తప్పులకు ఉన్నతాధికారులు పాల్పడుతున్నారు. ఏపీటీడీసీ పాలకవర్గం ఈ దిశగా ఆలోచిస్తుంటే అందుకు భిన్నంగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ ఈ అంశాలపై దృష్టి సారిస్తే.. ఉన్నతాధికారులు మాత్రం ఆయన ఆలోచనలే తప్పు అన్నట్టుగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీటీడీసీ పర్యాటక యూనిట్లన్నీ లాభాలతోనే నడుస్తున్నాయి. ఇంకా పెట్టుబడి పెడితే మరిన్ని లాభాలు వస్తాయి. పైగా ఈ యూనిట్లకు ఎక్కువగా మధ్యతరగతి వర్గాలే వస్తుంటారు. బోటు రూ.100, రూము రూ.3,500లకు లభిస్తుంది. అదే ప్రైవేటు సంస్థకు ఇస్తే బోటు ధర రూ.500 , రూము ధర రూ.10 వేలు నిర్ణయిస్తే పర్యాటకుల ఆదరణ ఉంటుందా? మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు ఆదరించగలరా అన్న ఆలోచన కూడా ఉన్నతాధికారులు చేయటం లేదు.

కేశినేని నాని అక్రమాలపై సీబీఐకి లేఖ

(5వ పేజీ తరువాయి)

క్యాంపులు, జాబ్ మేళాలు, అన్న క్యాంటీన్‌లు ఇలా అనేక సేవా కార్యక్రమాలను చేశారని గుర్తు చేశారు. ఒక కంపెనీ పెట్టి రుణం తీసుకుని బ్యాంక్‌ను మోసం చేసి, ఆ కంపెనీ పేరు, భార్యభర్తలు ఇద్దరి పేరు మార్చి, తన దగ్గర పనిచేసే ఇద్దరిని డైరెక్టర్లుగా పెట్టటం జరిగిందన్నారు. కూతుళ్ల పేరుతో ఆంధ్రా క్యాంటీన్ ప్రైవేట్ లిమిటెడ్ అని పేరు పెట్టి ఆదాయాన్ని డైవర్ట్ చేసి మోసం చేశారన్నారు. ఏదో ఒక సంస్థను అడ్డం పెట్టుకుని కేశినేని నాని ఆర్థిక నేరాలకు ఒడిగట్టారన్నారు. రెండు సార్లు ఎంపీ టికెట్ తీసుకుని గెలిచిన నాని పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. తాను రాజకీయాల్లో లేనంటూనే ఒక రాజకీయ అజెండాతో లిక్కర్ స్కామ్‌ను పైకి తీసుకుని వచ్చి ఇతర అంశాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. కేశినేని శివనాథ్ వెనుక బడిన ప్రాంతాల్లో పర్యటిస్తూ వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. తిరువూరు, నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట ప్రాంతాల్లో యువతకు ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేశినేని నాని విమర్శలు చేయటం మాని, నైతిక విలువలకు కట్టుబడి ఉండాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏడుగురు శాసనసభ్యులు అందరం కలిసి 11 నెలల కాలంలో చిన్ని చేసిన అభివృద్ధి ఏమిటో చెబుతామని, కానీ పది సంవత్సరాల కాలంలో విజయవాడ ఎంపీగా ఉన్న నాని ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు.

నాని ఆర్థిక నేరాలపై సీబీఐ, ఈడీలతో ఉన్నతస్థాయి విచారణ జరపాలి : నాగుల్‌మీరా

కేశినేని శ్రీనివాస్ (నాని) ఒక ఆర్థిక ఉగ్రవాది అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా విమర్శించారు. విజయవాడ గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాని అసూయకు పేటెంట్‌గా ఉన్నారని చెప్పారు. కేశినేని హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన ఘనుడని విమర్శించారు. నాని ఆర్థిక నేరాలపై సీబీఐ, ఈడీలతో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అహంకారంతో తల్లి, చెల్లి, స్నేహితులందరినీ దూరం చేసుకుని ఒంటరి అయ్యాడన్నారు. అతని గురువు జగన్‌తో కలిసి ఇద్దరూ త్వరలో జైలుకు వెళ్లటం ఖాయమన్నారు. సోషల్ మీడియా వేదికగా ఎంపీ కేశినేని శివనాథ్ పై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో రూ.42 కోట్ల రుణాలకు సంబంధించి ఎంత తిరిగి చెల్లించాడో నాని చెప్పాలంటూ సవాల్ విసిరారు. పని చేయని సంస్థ (ఎన్‌పీఏ)గా చూపించి డైరెక్టర్లను మార్చి బ్యాంకును మోసం చేస్తున్నారని, ఆంధ్రా క్యాంటీన్ పేరుతో హోటల్ నడుస్తోందని, హోటల్‌కు బాగా డబ్బులు వస్తున్నప్పటికీ బ్యాంకు రుణం మాత్రం తీర్చటం లేదన్నారు. హోటల్ కోసం తీసుకున్న రుణానికి తన ఆస్తులను తాకట్టుపెట్టారని, తాకట్టుపెట్టిన ఆస్తులలో నారాయణ కాలేజీకి లీజుకు ఇచ్చారని, రూ.20లక్షలు ఆదాయం వస్తున్నా సరే బ్యాంకుకు రుణం చెల్లించటం లేదని చెప్పారు. ఎనికేపాడులో ఉన్న స్థలంలో టాటా కంపెనీకి లీజుకు ఇచ్చారని కోటి రూపాయలు అడ్వాన్స్ తీసుకుని ఆ సంస్థను కూడా మోసం చేశారన్నారు. ఇటువంటి వ్యక్తిపై బ్యాంకులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో అర్థం కాలేదన్నారు. తాము చేసే ఆరోపణలకు ఖచ్చితమైన ఆధారాలు ఉన్నాయని నాగుల్ మీరా అన్నారు. కేశినేని శివనాథ్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు, సీనియర్ దళిత నాయకుడు కామా దేవరాజ్ పాల్గొన్నారు.

రూ.83,500 కోట్లతో..

(5వ పేజీ తరువాయి)

2025 - 26 కు రూ. 83,500 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోవటం జరిగింది. ఆచరణలో రూ.లక్ష కోట్లకు చేరుకునే అవకాశం ఉంటుందన్న ఉద్దేశ్యంతో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఈ మేరకు నిర్ణయించింది.

పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.83,500 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక(ఏసీపీ) లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు బ్యాంకులు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.13,500 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.17 వేల కోట్లు రుణాల సమపార్జన లక్ష్యంగా ప్రతిపాదించినట్లు తెలిపారు. వినియోగదారుడిని ఉత్పత్తి దారుడిగా మార్చి, పర్యావరణ హిత, ఆర్థిక వృద్ధి సాధించే విధంగా పీఎం సూర్యఘర్ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి వివరించారు. లబ్ధిదారులకు నిర్దేశించుకున్న లక్ష్యాలకనుగుణంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి కోరుకున్న ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాన్ని చేరాలంటే బ్యాంకులు మద్దతు చాలా అవసరమని వివరించారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు

వికసిత్ భారత్- 2047, స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలు నెరవేరాలంటే బ్యాంకుల భాగస్వామ్యం ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో వినూత్న ఆలోచనలతో ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కింద యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకులు లబ్ధిదారులకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని కోరారు. నాబార్డ్ జిల్లా ప్రాధాన్యత రంగానికి సంబంధించి రూ.30 వేల కోట్లతో పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్(పీఎల్‌పీ)ను కూడా ఆవిష్కరించారు. డీసీసీ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్‌బీఐ ఎల్‌డీవో సీహెచ్ నవీన్ కుమార్, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, టిడ్కో ఈఈ చిన్నోడు, డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.కిరణ్‌కుమార్, ఆర్‌సేతి డైరెక్టర్ అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

త్రిశక్తిపీఠంలో ప్రత్యేక పూజలు 22న

కృష్ణలంక, మే 13 (ఆంధ్రజ్యోతి) :హనుమత్ జయంతి సందర్భంగా త్రిశక్తిపీఠంలో ఈనెల 22న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 11.30 వరకు ప్రత్యేక ఆకుపూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజలో పాల్గొనదలచిన వారు పూజా రుసుము కింద రూ.200 చెల్లించి ఆఫీసులో రశీదు పొందాలని తెలిపారు.



నిర్మలా కాన్వెంట్ రోడ్లో పార్కింగ్ చేసిన వాహనాలు

ఫుట్‌పాత్ ఆక్రమణలు

- నిర్మలా కాన్వెంట్ రోడ్డులో వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు
- ప్రేక్షకపాత్రలో పోలీసులు

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి: నిత్యం రద్దీగా ఉండే బెంజిసర్కిల్ నిర్మలా కాన్వెంట్ రోడ్డులోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈరోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు పండ్ల దుకాణాలకు, ద్విచక్ర, కార్ల పార్కింగ్‌కు నిలయంగా మారాయి. ఫుట్‌పాత్‌తోపాటు రోడ్లను కూడా ఆక్రమించి వాహనాలు నిలుపుతున్నారు. కమర్షియల్ దుకాణాలకు వచ్చేవారు తమ వాహనాలను ఫుట్‌పాత్‌లపైనో లేదా రోడ్డు మీదో నిలిపి దుకాణాల్లోకి వెళుతున్నారు. వారు వచ్చేవరకు ఈ వాహనాలకు అదే పార్కింగ్ స్థలం. దీనివల్ల రద్దీ పెరిగి తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీగా ఉన్న



సమయాల్లో బందరురోడ్డు, వారధి వైపు నుంచి కంకిపాడు, గుడివాడ, మచిలీపట్నం వైపు వెళ్లే బస్సులను బెంజిసర్కిల్ నుంచి నిర్మలా కాన్వెంట్ రోడ్డు మీదుగా పోలీసులు ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. దీంతో ఈరోడ్డులో ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. రోడ్డు మార్జిన్‌లపై ఉన్న ఆక్రమలు తొలగించి ట్రాఫిక్ కష్టాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమణలకు గురువుతున్నా పోలీసులు పట్టించుకోక ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పోలీసులు, వీఎంసీ అధికారులు స్పందించి నిర్మలా కాన్వెంట్ రోడ్డులో ఆక్రమలు తొలగించి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోగంటి సత్యనారాయణ

దోనేపూడి సరస్వతికి ప్రముఖుల నివాళి

కృష్ణలంక, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హోటల్ సెంటర్‌లోని చలసాని భవన్ వద్ద నిర్వహించిన దోనేపూడి సరస్వతి నాలుగో వర్థంతి కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరస్వతి పేరు మీద ట్రస్టు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, ఆ ట్రస్టుకి తన సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. సరస్వతి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని దోనేపూడి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మందలపు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పీఎం శర్మ, మానవ ఏడుకొండలు, ఇటిక్యాల శివ సుబ్రమణ్యం, లక్ష్మణరెడ్డి, బుట్టి రాయప్ప, సంగుల పేరయ్య, సైదారావు పాల్గొన్నారు.

లారీ చక్రాల కిందపడి ఫిజియోథెరపిస్ట్ మృతి

ఆటోనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): లారీ వెనుక చక్రాల కింద పడి ఫిజియోథెరపిస్ట్ దుర్మరణం పాలైన ఘటన మంగళవారం పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ గేట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దర్శి మండలం సామంతపూడి గ్రామానికి చెందిన రావులపల్లి ఏడుకొండలు(28) బెస్ట్ రిహాబిలిటి సెంటర్‌లో ఫిజియోథెరపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడుకొండలు బైక్‌పై ఆటోనగర్ గేట్ వైపు నుంచి రోగి వద్దకు వెళ్తున్నాడు. లారీ కూడా ఆటోనగర్ లోపల నుంచి గేట్ వైపు వెళుతుంది. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి లారీ వెనుక చక్రాల కిందపడ్డాడు. దీంతో ఏడుకొండలు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వల్లభనేని పవన్ కిషోర్ తెలిపారు.

ఇంటింటికీ మోదీ ఫిట్‌నెస్ మంత్ర

పెనమలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతి ఇంటికి మోదీ ఫిట్‌నెస్ మంత్ర ను అందించాలని నిర్ణయించినట్లు యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. కానూరులోని యోగాశక్తి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో వ్యాధులు తగ్గించడం ప్రధాని మోదీ ఫిట్‌నెస్ మంత్రతో సాధ్యమేనన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాల్లో భాగంగా జూన్ 1 నుంచి 21 వరకు జరిగే కార్యక్రమాల బ్రోచర్‌ను ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. యోగాలో పాల్గొనదలచినవారు అశోక్‌నగర్‌లోని ఆసుపత్రిలో సంప్రదించాలని ఆయన కోరారు.

నృత్యకళాకారిణి ప్రణీతారెడ్డికి ఎంపీ శివనాథ్ అభినందన

వన్‌టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో కళా వైభవం పేరిట 4,300 మంది నృత్య కళాకారిణులతో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్న నృత్య కళాకారిణి ప్రణీతారెడ్డి(14)ని ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ ఆధ్వర్యంలో ఎంపీ శివనాథ్‌ను మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రణీతారెడ్డి తాను అదుకున్న మెడల్, ప్రశంసాపత్రాన్ని ఎంపీకి చూపించింది. ప్రణీతా రెడ్డి తల్లిదండ్రులు దాసరి శివాజీ రెడ్డి, నాగమణిలను ఎంపీ అభినందించారు.



ప్రణీతారెడ్డిని అభినందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

స్విమ్మర్లకు కమిషనర్ అభినందన



స్విమ్మర్లను అభినందిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం గర్వించేలా స్విమ్మింగ్‌లో ఘనతను సాధించిన అండర్-18 స్విమ్మర్‌లను నగర కమిషనర్ ధ్యానచంద్ర అభినందించారు. ఖేలో ఇండియా 2025 యూత్ గేమ్స్ అండర్-18 కేటగిరిలో ఆల్ ఇండియా చాంపియన్‌షిప్‌లో 64 పాయింట్‌లతో ఆంధ్రప్రదేశ్ తృతీయ స్థానంలో నిలించింది. ఈ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన అండర్-18 స్విమ్మర్లు తీర్థు సామదేవ్, దేవ గణేష్, యజ్ఞ సాయిలు మంగళవారం నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రను కలిశారు. ఈ సందర్భంలో కమిషనర్ స్విమ్మర్లను అభినందించారు. వారికి నగరపాలకసంస్థ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ లత, స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఐ. రమేష్, కృష్ణాజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరి వి. వినోద్, సహాయక కోచ్ నితిష్, ఇతర కోచ్‌లు పాల్గొన్నారు.

సీపీఐ నేత నూతక్కి సీతారామయ్య మృతి

వైద్య కళాశాలకు భౌతికకాయం



సీతారామయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పుతున్న కోటేశ్వరరావు

బెంజిసర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీపీఐ నాయకుడు, కార్మిక నేత నూతక్కి సీతారామయ్య(79) సోమవారం రాత్రి పటమట ఆర్టీసీ కాలనీలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ఒక కుమార్తె. కాగా భార్య, కుమారుడు గతంలో మృతి చెందారు. ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ హోదాల్లో ఉంటూ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శిగా పనిచేశారు. ఉద్యోగ విరమణ తరువాత సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడిగా పటమట ప్రాంతంలో పని చేశారు. ఆయన ముందస్తు కోరిక మేరకు సీతారామయ్య భౌతిక కాయాన్ని మంగళవారం మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు అందజేశారు. నేత్రాలను శంకర్ నేత్ర నిధికి అందజేశారు.

ప్రముఖుల నివాళి

నూతక్కి సీతారామయ్య మృతదేహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వైసీపీ నేత దేవినేని అవినాష్, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు అక్కినేని వనజ, లంకా దుర్గారావు, నక్క వీరభద్రారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కాగా నూతక్కి సీతారామయ్య మృతదేహంపై కోటేశ్వరరావు సీపీఐ జెండాను కప్పారు.

ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

గుణదల, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, గుర్తింపు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కెభాస్కర్ డిమాండ్ చేశారు. క్రీస్తురాజపురంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ పాదయాత్ర సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి అడ్డుగా ఉన్న జీవో నెంబరు 83, 84, 85లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 50వేల టీచర్ పోస్టులు కాళీగా ఉంటే కేవలం 16,467 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం దారుణం అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యే సమయానికి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాం కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ సిఫారసు చేసిన అంశాలను పరిగణనలోకి తీసుకుని తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమిం చాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ. భూషణం, ఎల్.రాజశేఖర్, అంకన్న, ఐ.రాజేష్, మహర్షి, నాని, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు ఎన్టీఆర్

ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే గద్దె, ఎంపీ కేశినేని శంకుస్థాపన



ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శివనాథ్, పక్కన గద్దె తదితరులు

బెంజిసర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు నందమూరి తారక రామారావు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధి ఎన్టీఆర్ సర్కిల్‌లో రూ. 20లక్షల వ్యయంతో చేపట్టే ఆధునికీకరణ పనులకు మంగవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ నగరంలో ఒక సుందరమైన ప్రాంతంగా ఎన్టీఆర్ సర్కిల్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రసంగిస్తూ ఎన్టీఆర్ అంటేనే ఒక బ్రాండ్ అని, 20ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సర్కిల్‌ను ఆధునికీకరణ చేయాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు నర్రా కిషోర్, చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, సాంబశివరావు, దేవినేని అపర్ణ, ఉషారాణి, సాయిబాబా పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 12వ తరగతిలో

సిటీ టాపర్స్‌గా నలంద విద్యార్థులు



భవిష్యజైన్ రాయపాటి నిత్య గద్దె దివిజ

గవర్నర్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో ఎంపీసీసీ, ఎంఈసీ, బైపీసీ గ్రూపుల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు విజయవాడ సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఎంఈసీ గ్రూపు నుంచి భవష్య జైన్ 500 మార్కులకు 479, బైపీసీ గ్రూపు నుంచి రాయపాటి నిత్యలక్ష్మీ దుర్గ 476 మార్కులు, ఎంపీసీసీ గ్రూపు నుంచి గద్దె దివిజ 465 మార్కులు సాధించి సిటీ టాపర్లుగా నిలిచినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఎంఈసీ నుంచి భూమికా జైన్ 473 మార్కులు, సురిలీ జైన్ 472 మార్కులు, కష్వి జైన్ 470 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. 100 శాతం ఉత్తీర్ణత పాటు ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపక బృంధాన్ని అభినందించారు. సిటీ టాపర్స్‌గా నిలిచిన నలంద విద్యానికేతన్ విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ అట్లూరి విజయబాబు అభినందించారు.



బి. శశిధర్ వి. తనుశ్రీదేవి వైష్ణోగాయత్రి

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో...

సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించిన టెన్త్ ఫలితాల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 500 మార్కులకు బాసిన శశిధర్ 492 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. వి. తనుశ్రీదేవి 490, ఎస్. వైష్ణోగాయత్రి 488, ఎన్. జాస్మిత 487, ఎం భావనసాయి తులసీ 486, జె. మోహిత్ 485, ఎ. హరిణీ 484, ఆర్. లాస్య, డీవీఎస్ కీర్తి, కెఎల్ హాసినీలు 482, ఎస్. జీవితేష్ 481, హెచ్. హర్షిత 480 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఏ. విజయబాబు అభినందించారు.

సీబీఎస్ఈ 10, 12 తరగతుల్లో

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సత్తా

ప్రసాదంపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ 10,12 తరగతుల పరీక్షా ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడ ప్రభంజనం సృష్టించింది. పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత, 12వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో శ్రేష్టకు 500కు 492 మార్కులు, అంగులూరి శృతికకు 491 మార్కులు, జైత్ర శ్రీరితన్య 484 మార్కులు సాధించారని తెలిపారు. 12వ తరగతిలో తబిత శీలంకు 477 మార్కులు, నిశాంత్ రెడ్డి 463, ఎం.జయ హర్షిన్‌రెడ్డి 469 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఇంతటి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను పాఠశాల ప్రో వైస్ ఛైర్మన్ పరిమి నరేంద్రబాబు అభినందించారు. డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, పాఠశాల అకమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, ప్రిన్సిపాల్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్‌వ భాటియా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు శుభాంకాంక్షలు తెలిపారు.

కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించాం

ఆయుష్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ



వెర్టిగో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ వైద్యులు బసవరాజు

భారతీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): అత్యాధునికత సాంకేతికత జోడించి ఉన్నత విలువలతో వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆయుష్ ఆసుపత్రి ప్రారంభించామని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు గోపాలకృష్ణ తెలిపారు. శ్రీరామచంద్రనగర్ కాలనీలోని ఆయుష్ ఆసుపత్రిలో ఆసుపత్రి 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డి. బసవరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన వెర్టిగో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ కోడూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ఆయుష్ ఆసుపత్రి, స్టార్ ఆసుపత్రి(హైదరాబాద్) సంయుక్తంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు ప్రారంభించామని తెలిపారు. మేనేజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు వచ్చిన ప్రతిసారి ప్రజలకు, ప్రభుత్వానికి తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జయలక్ష్మీ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 31 వరకు ఆయుష్ ప్రీమియర్ హెల్త్ ప్యాకేజీపై డిస్కౌంట్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, డాక్టర్ శ్రీనివాస్‌సాయి,కమిటీ వైస్‌ఛైర్మన్ డాక్టర్ పీఎస్ఎస్ చౌదరి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ప్రముఖ వైద్యులు శ్రీమన్నారాయణ, డాక్టర్ మర్రి హరికృష్ణ, మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్, అడ్డీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పుల్లేటి కాల్వ డ్రెయినేజీ నిర్మాణ పనులపై అవగాహన

బెంజిసర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ సర్కిల్-3 పరిధిలోని పుల్లేటి కాల్వ డ్రెయినేజీ నిర్మాణ పనుల సందర్భంగా 60 అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడ నివసించే వారితో మంగళవారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు సమావేశం నిర్వహించారు. స్థానికులతో ఆయన డ్రెయినేజీ నిర్మాణ అంశాలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మతిన్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మరో 16 ఆలయాల్లో నిత్య అన్నప్రసాదం

» దేవదాయ శాఖ మంత్రి ఆనం వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం), మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 16 ప్రముఖ ఆలయాల్లో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, ఆగమ పండితుల నిర్ణయంతో అన్నదానం, పూజ కైంకర్యాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రుచి, శుచి గల అన్నప్రసాదం, ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత, భక్తుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి దేవదాయ శాఖపై జరిపిన సమీక్ష వివరాలను మంత్రి వెల్లడించారు. కందుకూరు నియోజకవర్గంలోని మాలకొండలో ప్రస్తుతం ప్రతి శనివారం అన్నదానం జరుగుతోందని, ఇక నుంచి ప్రత్యేక కార్యక్రమంగా అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. 6ఏ కేటగిరిలో ఉన్న 169 ఆలయాల్లో ఆదాయం కొంచెం ఎక్కువగా ఉన్న ఆలయాల్లో అన్నదానం, భక్తుల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర ప్రత్యేక వసతులు కల్పించాలని సీఎం సూచించారన్నారు. ఇక ఆలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా ప్రతిరోజూ తెల్లవారుజామున ఓంకార నాదం, మంత్రోచ్ఛరణ వినిపించేలా ఈవోలు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం ఆదేశించారు.

దేశ సైన్యానికి దైవాశీస్సులు కోరుతూ....
మురుగన్ ఆలయాల్లో జనసేన ఎమ్మెల్యేల పూజలు

చెన్నై/తిరుత్తణి, మే 13 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'తో పాక్‌కు గట్టి గుణపాఠం నేర్పిన మన దేశ సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవాశీస్సులు మెండుగా ఉండాలని జనసేకు చెందిన ఎమ్మెల్యేలు మంగళవారం తమిళనాడులో ప్రసిద్ధి చెందిన ఆరు మురుగన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుత్తణిలో, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పళనిక్షేత్రంలో, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తిరుప్పరకుండ్రంలో, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్వామిమలైలో, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తిరుచ్చెందూర్‌లో, రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ పాలముదిరిచోళై మురుగన్ ఆలయంలో తమ అనుచరులతో కలసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రీ సర్వే సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం

» వచ్చే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ: మంత్రి అనగాని

» రూ.800 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లకు టెండర్లు: మంత్రి గొట్టిపాటి

పెద్దాపురం/సామర్లకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తలెత్తుతున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలో మంగళవారం ఎంఎ్‌సఎంఈ పార్కుతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన భూముల రీ సర్వేను గత వైసీపీ ప్రభుత్వం తప్పులతడకగా మార్చేసిందని, వైసీపీ నాయకులు వారి స్వప్రయోజనాల కోసం రీ సర్వేను అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను వచ్చే నెలలోనే అమలు చేస్తామన్నారు. అనంతరం విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణాలను రూ.800 కోట్లతో చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేశామని వెల్లడించారు. రాష్ట్రంలో రానున్న మరో ఆరునెలల కాలంలో లోవోల్టేజీ సమస్య ఎక్కడా లేకుండా అన్ని చర్యలూ తీసుకోవడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

మదర్సాల్లోని వలంటీర్లకు గౌరవవేతనం ఇవ్వాలి

» మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శికి వినతి

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మదర్సాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు గౌరవవేతనం అందించాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు వలంటీర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 190 మదర్సాలు ఉన్నాయని, వాటిల్లో 600 మంది వలంటీర్లు, 14,600 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లను కొనసాగించిందని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడు వినలేదని వాపోయారు. గత ఎన్నికల ముందు మదర్సాల్లోని వలంటీర్లను కొనసాగిస్తామని కూటమి హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచైనా గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

పశుసంవర్ధక రంగంలో కృత్రిమ మేధ వినియోగం

» యానిమల్ హస్బెండరీ టెక్ ఏఐ-2.0 సదస్సులో మంత్రి అచ్చెన్న

అమరావతి/లబ్బీపేట, మే 13(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక రంగంలోనూ కృత్రిమ మేధ ఉపయోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడలో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టయిన్‌బిలిటీ ట్రాన్స్‌ఫార్మేషన్(జీఎఫ్‌ఎస్‌టీ), రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు జరిగే యానిమల్ హస్బెండరీ టెక్ ఏఐ-2.0 సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'వ్యవసాయ అనుబంధ రంగాలు రాష్ట్రాభివృద్ధిలో కీలకం. ఈ రంగాల్లో సంపద సృష్టిస్తే పేదరికాన్ని నిర్మూలించవచ్చు. పశుసంవర్ధక రంగంలో ఆదాయం పెరుగుదల ఫలితాలు నేరుగా పేదలకు అందుతాయి. రెడీ టూ యూజ్ ప్రొడక్ట్‌గా పశుసంవర్ధక రంగ ఉత్పత్తులను మార్చడంపై అధికారులు, రైతులు దృష్టిపెట్టాలి' అని అన్నారు.

వైట్ కేటగిరీ భవన అనుమతులకు 25% ఫీజు రిబేటు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వైట్ కేటగిరీ కిందకు వచ్చే పరిశ్రమల భవనాల నిర్మాణ అనుమతుల కోసం చెల్లించాల్సిన ఫీజులో 25 శాతం రిబేటు కల్పిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కాలుష్య నియంత్రణ పాటిస్తున్న కొన్ని పరిశ్రమలకు మున్సిపల్ శాఖ ఇప్పటికే రిబేటు కల్పిస్తోంది. పర్యావరణానికి మేలు చేసే గ్రీన్ కేటగిరీ కింద ఉన్న పరిశ్రమలకు 25 శాతం రిబేటు అందిస్తోంది. అయితే వైట్ కేటగిరీ కిందకు వచ్చే బయోగ్యాస్ వంటి తక్కువ కాలుష్య కారక పరిశ్రమలకు కూడా గ్రీన్ కేటగిరీ తరహాలో ఫీజులో 25 శాతం రిబేటు ఇవ్వాలని కొందరు బయోప్లాంట్ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది.

బహుళ అంతస్తు భవనాల అనుమతుల కోసం ప్రత్యేక సెల్

పట్టణాల్లో 12 అంతకంటే ఎక్కువ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులను వేగవంతం చేసేందుకు మున్సిపల్ శాఖ చర్యలు తీసుకుంది. దీనికోసం టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి.. దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లో అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ తెలిపింది. ప్రత్యేక సెల్ ఏర్పాటు కోసం సమగ్ర ప్రతిపాదనలు పంపాలని డీటీసీపీ అధికారులను మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఆదేశించారు.

ఎస్‌హెచ్‌జీ డేటా అనుసంధానం చేయాలి

» బ్యాంకులను కోరిన మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సమాచారం సిద్ధమైందని, ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా సేకరించిన ఈ డేటాను బ్యాంకులు అనుసంధానం చేయాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ చెప్పారు. తద్వారా రుణ మంజూరు సులభతరం అవుతుందన్నారు. మెప్మా కార్యక్రమాలపై బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు మంగళవారం మెప్మా మిషన్ డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ డేటాబేస్‌ను అనుసంధానం చేయడం ద్వారా గ్రూపులోని సభ్యుల వివరాలు, వారి ఆధార్ నంబర్‌పై ఉన్న ఇతర రుణాల వెరిఫికేషన్ తేలికవుతుందన్నారు. మెప్మా ఇప్పటికే ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా డేటాను పూర్తి చేసిందని చెప్పారు. మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ మాట్లాడుతూ.. పట్టణాల్లో జూన్ 1 నుంచి ఈ యాప్ ద్వారానే రుణాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో ఎండీ సునీల్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ, బ్యాంకు ప్రతినిధులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్

తిరుమల, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ సిఫారసు దర్శనాలను టీటీడీ పునరుద్ధరించింది. వేసవి సెలవుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 1 నుంచి జూలై 15దాకా సిఫారసు లేఖలు తీసుకోబోమని గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే రద్దీ తగ్గుముఖం పట్టడంతో పునరుద్ధరణ నిర్ణయం గడువునకు ముందే తీసుకున్నారు. 15 నుంచి సిఫారసు లేఖలను స్వీకరించి 16 నుంచి దర్శనాలను కొనసాగిస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలను మాత్రమే ప్రస్తుతం అనుమతిస్తారు.

ఆటోనగర్‌లో చెత్త దిగ్బంధం


వారం రోజులుగా లారీల్లో ఉండి పోయిన చెత్త



పది రోజులుగా నిలిచిపోయిన చెత్త తరలింపు

● ఏ రోడ్డులో చూసినా గుట్టలు.. గుట్టలే..! ● వీఎంసీ దృష్టిలో పెట్టినా దొరకని పరిష్కారం ● జిందాల్ యూనిట్ నుంచి రాని ఆమోదం

మొగల్రాజపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆసియాలో అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమని గర్వంగా చెప్పుకునే విజయవాడ ఆటోనగర్‌ను పది రోజులుగా చెత్త సమస్య పట్టి పీడిస్తోంది. మామూలు ఆటోనగర్ నుంచి రెండు దశాబ్దాలన్నర క్రితం ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) అనే స్వతంత్ర్య ప్రతిపత్తి గలిగిన సొసైటీ కిందకు వచ్చినా ఇక్కడున్న అనేక సమస్యలతో పాటు చెత్త సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రతి రెండు మూడేళ్లకోసారి ఈ సమస్య వస్తోంది. ప్రస్తుతం 275 ఎకరాల ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రతిరోజు దాదాపు 30 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను జక్కంపూడి ఏరియాకు తరలించడానికి ఒక డ్వాక్రా సంఘానికి కాంట్రాక్టు ఇచ్చారు. వీరు ఉదయం


గుట్టలుగా పేరుకున్న చెత్త

సాయంత్రం వేళల్లో ఆరు టిప్పర్ లారీలతో చెత్తను ఎత్తి జక్కంపూడి వైపున్న డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ యార్డులు ఫుల్ అయిపోవడం, స్థానికులు అభ్యంతరాల నేపథ్యంలో చెత్తను తరలించడం ఆపేశారు. దీంతో ఈ సమస్యను ఐలా కమిషనర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ కొద్ది రోజుల క్రితం వీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఎస్ఈ, ఈఈలకు పురమాయించారు.

జిందాల్ నుంచి క్లియరెన్స్ రావడం లేదు

గుంటూరు జిల్లాలోని చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసే జిందాల్ యూనిట్‌కు విజయవాడ గుంటూరు కార్పొరేషన్స్ నుంచి చెత్తను పంపుతున్నారు. దీనిలో భాగంగా విజయవాడ ఆటోనగర్ నుంచి కూడా చెత్తను పంపుదామని జిందాల్ ప్రతినిధులతో వీఎంసీ అధికారులు చర్చలు జరపగా అటు నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో పదిరోజులుగా చెత్త తరలింపు నలిచిపోయింది.

వీఎంసీ కమిషనర్ దృష్టిలో పెట్టాం

● కే బాబ్జీ, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, కమిషనర్ ఐలా

వీఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఐలా వాహనాల్లో చెత్తను జిందాల్ యూనిట్‌కు పంపడానికి ఎస్ఈ, ఈఈలతో చెప్పారు. వారు జిందాల్ ప్రతినిధులతో మాట్లాడితే రోజువారి డిమాండ్ కన్నా అధికంగా వస్తున్న చెత్త వల్ల కొత్తగా వచ్చే చెత్తను నిల్వ చేయడానికి స్థలం లేదని చెబుతున్నారు. ఇదే విషయాన్ని మళ్లీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం కావొచ్చని ఆశిస్తున్నామన్నారు.

నేడు ప్రతీకార దినోత్సవం

» నా పుట్టిన రోజునే నాపై రాజద్రోహం కేసు

» దానితోనే వైసీపీ అంతం ఆరంభం: డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు



ఉండి, మే 13(ఆంధ్రజ్యోతి): 'మే 14న నా జన్మదినం. అదే రోజున ఉండి నియోజకవర్గంలో ప్రతీకార దినోత్సవాన్ని జరుపుకుంటున్నా' అని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత ఏడాది మే 13వ తేదీని నేను మరువలేను. ఆ రోజు జరిగిన ఎన్నికల్లో ప్రజలు కక్షతో వైసీపీని చిత్తుగా ఓడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021, మే 14న నాపై రాజద్రోహం కేసు పెట్టారు. నన్ను తీసుకెళ్లి ఏం చేశారో అందరికీ తెలుసు. అదే రోజు నా జన్మదినం. అందుకే నా పుట్టినరోజును ప్రతీకార దినోత్సవంగా జరుపుకుంటున్నా. వైసీపీ ప్రభుత్వం కుట్రతో నాపై పెట్టిన రాజద్రోహం కేసుతో వాళ్ల అంతం ప్రారంభమై చిత్తుగా ఓడిపోయారు. వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతోనే నా పుట్టినరోజును ప్రతీకార దినోత్సవంగా జరుపుకుంటున్నా. పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ప్రతీకార దినోత్సవానికి రావాలి' అని రఘురామరాజు ఆహ్వానించారు.

రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా కూటమి కృషి: ఎంపీ చిన్ని

భారతీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భారతీనగర్‌లోని నోవాటెల్‌లో మంగళవారం సాయంత్రం క్రెడాయి క్రౌనింగ్ ది టార్చ్ బేరర్ జరిగింది. ఎంపీ కేశినేని చిన్ని, మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ అభివృద్ధి విజయవాడ, అమరావతిలోనే కాకుండా విశాఖపట్టణం, తిరుపతి, రాజమండ్రి, అనంతపురం లోనూ అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. విశాఖ లో సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రానున్నట్టు తెలిపారు. త్వరలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఒక ఇండస్ట్రీ హబ్ రానుందన్నారు. మంత్రి నారాయణ సమస్యలు పరిష్కరించడానికి చాలా కష్టపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారస్థులకు, పారిశ్రామికవేత్తలకు, బిల్డర్స్‌కు అండగా ఉంటుందన్నారు. క్రెడాయ్ నేషనల్ అధ్యక్షులు జి.రామిరెడ్డి, క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయన శ్రీనివాసరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దాసరి రాంబాబు పాల్గొన్నారు.

దేశ క్షేమం కోరుతూ పూజలు

● మంత్రి నాదెండ్ల మనోహర్

ఇంద్రకీలాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన దేశ సైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని, సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని కోరుతూ వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ క్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఇంకా పలువురు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో సహా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గగుడికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా శత్రు దేశానికి తగిన గుణపాఠం చెప్పిన దేశ నాయకత్వానికి, సైన్యానికి ఇంకా బలమైన ధైర్యం, స్థైర్యం, విజయం చేకూరాలని కోరుతూ దుర్గమ్మను ప్రార్థించారు. ఈ మేరకు ప్రత్యేక సంకల్పం చెప్పి అర్చనలు చేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన నాదెండ్ల మనోహర్, హరిప్రసాద్ బృందానికి ఈవో వి.కె. శీనా నాయక్, అర్చకులు, వేద పండితులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు దేశ రక్షణ కోసం పాటుపడుతున్న సైనికుల క్షేమం, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు బలం చేకూర్చాలని, దేశ ప్రజల క్షేమాన్ని కోరుతూ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.


మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరి ప్రసాద్ బృందానికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు అర్చకులు, వేద పండితులు

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చేపట్టిన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం సాకారం చేయాలని ఈవో వీకే శీనా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నవగ్రహ మండపం ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలు, నూతన యాగశాల, పూజా మండపాలు అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్లేశ్వరాలయం చుట్టుపక్కల పచ్చదనం పెంపొందించి, సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. దాత సహాయంతో నిర్మించిన యాగశాల మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పూజా మండపం 2వ అంతస్తు పైకెక్కి పరిశీలించారు. పూజా మండపం ప్లాన్ చూసి, పూర్తయిన పనుల వివరాలు తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లతో సంప్రదించి పురోగతి చూపించాలని, అభివృద్ధి పనులపై రోజువారీగా క్షేత్రస్థాయి సమీక్ష అవసరమని ఈవో శీనా నాయక్ పేర్కొన్నారు.


పూజా మండపం ప్లాన్, ఆలయ నిర్మాణాలు, అభివృద్ధి పనులను పరిశీలించిన ఈవో

పూజా మండపానికి మెట్లు ఏవీ..?

దుర్గగుడి పూజా మండపానికి మెట్లు ఏవంటూ దేవస్థానం ఈవో శీనా నాయక్ ఆలయ అసిస్టెంట్ స్థపతి షణ్ముగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుర్గగుడి ఈవో ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పూజా మండపాన్ని ఆయన పరిశీలించారు. మండపం నిర్మాణ పనులను అధికారులు, అసిస్టెంట్ స్థపతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన నిచ్చెన ద్వారా పూజా మండపం 2వ అంతస్తుకు వెళ్లారు. ఈ సందర్భంగా పూజా మండపానికి మెట్లుగానీ, ర్యాంపుగానీ నిర్మించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెట్లు లేకుండా పూజా మండపం పైకి ఎలా ఎక్కుతారని ప్రశ్నించారు. ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణ పనులు జరగాలని భవిష్యత్తు అవసరాలు గుర్తించి పనులు చేపట్టాలని ఈవో ఆదేశించారు. ఈవో వెంట ఈఈ కోటేశ్వరరావు, అసిస్టెంట్ స్థపతి, సిబ్బంది ఉన్నారు.

సౌత్ ఏషియన్ గేమ్స్‌లో రమణయ్య సత్తా

గంపలగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడల్లో మండలంలోని పెనుగొలను గ్రామానికి చెందిన రాళ్లచర్ల రమణయ్య మూడు బంగారు పతకాలు సాధించారు. నేపాల్‌లోని పోక్రా రంగస్థలం స్టేడియంలో ఈనెల 4నుంచి 7వరకు జరిగిన ఈ పోటీల్లో రమణయ్య పాల్గొన్నారు. ఆయన కొనేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటూ భారతి విద్యా భవన్ జూనియర్ కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. నేపాల్, భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పాల్గొనగా ఇండియా నుంచి 45 ఏళ్ల విభాగంలో రమణయ్య క్రీడల్లో పాల్గొని పథకాలు సాధించడం విశేషం. ఈ మేరకు ఆయన్ను ఈనెల 14న పెనుగొలను, తోటమూల గాయత్రి పబ్లిక్ స్కూల్లో ఘనంగా సన్మానించనున్నారు.


మూడు బంగారు పతకాలతో రమణయ్య

రాజమార్గాల పనులకు పీఎంసీల కోసం టెండర్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి ప్రధాన రాజమార్గాల పనులను వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మంగళవారం టెండర్లు పిలిచింది. అమరావతి ప్రధాన రాజమార్గాలైన ఈ-13, ఈ-15ను రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు కూడా ఖరారు కావస్తున్నాయి. ఈ క్రమంలో పనులను ముందుకు తీసుకు వెళ్లటానికి వీలుగా పీఎంసీలను నియమించాలని నిర్ణయించటం జరిగింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టాల్సి ఉంటుంది. .

టీడీపీ నేత నిరసన ప్రదర్శన

వెలుగు కార్యాలయంలో వీవో పోస్టు భర్తీపై న్యాయం చేయాలని డిమాండ్

పెనుగంచిప్రోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల వెలుగు కార్యాలయంలో కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ పెత్తనం కొనసాగడంపై గ్రామానికి చెందిన తెలుగు యువత నేత లగడపాటి ప్రవీణ్ ఆగ్రహంతో కార్యాలయంలోనే మంగళవారం నిరసనకు దిగాడు. గ్రామంలో వెలుగు వీవోలు 9 మంది ఉన్నారు. వీరిలో దారా భాగ్యమ్మ అనే వీవో 3 నెలల క్రితం పదవీ విరమణ చేశారు. ఎన్నిక ద్వారా ఆ స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు కొందరు కార్యాలయ సిబ్బంది కలిసి ఎన్నిక జరపకుండా పదవీ విరమణ చేసిన దారా భాగ్యమ్మ కూతురు, వైసీపీ సానుభూతి పరురాలు వెంకట రమణ పేరును ప్రతిపాదిస్తూ పీడీ కార్యాలయానికి పంపారు. దీనిపై స్థానిక టీడీపీ నేతలెవరూ స్పందించకపోయినా లగడపాటి ప్రవీణ్ స్పందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందా లేక కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా అంటూ నిరసనకు దిగాడు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ అయిన వీవో స్థానంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎన్నిక జరపాలని పట్టుబట్టాడు. గత ప్రభుత్వ హయాంలో వెలుగు కార్యాలయంపై వచ్చిన అవినీతి ఆరోపణల దృష్ట్యా దాదాపు ఏడాది కాలంగా ఏపీఎంగా ఇక్కడ పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకునేందుకు సాహసం చేయడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో సుశీల అనే సీసీ తాత్కాలికంగా ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు కొంతమేర నిర్వహిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వీవో ఎన్నిక జరిపి న్యాయం చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.


టీడీపీ నేత ప్రవీణ్

నిబంధనల మేరకే హోటల్ లీజు టెండర్ ఖరారు

● ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం

బస్టేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇటీవల పీఎన్‌బీఎస్ ఎదుట ఉన్న హోటల్, డార్మిటరీ పార్కింగ్‌కు నిబంధనల మేరకు వేలం నిర్వహించినట్టు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి వై.ఏసుదానం తెలిపారు. మంగళవారం ఆయన బస్టేషన్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్టేషన్ ముందున్న హోటల్, డార్మిటరీ పార్కింగ్‌కు (బాలాజీ హోటల్) మార్చి 15న లీజు టెండర్ ప్రకటించినట్టు చెప్పారు. అదే నెల 24న ఓపెన్ చేయగా, పాటలో 17 మంది పాల్గొన్నారు. వీరిలో శ్రీనివాసరెడ్డి అధిక ధర రూ.54లక్షలు కోట్ చేయటంతో ఆయనకు టెండర్ ఖరారు చేసి మార్చి 23న అప్పగించారు. నిబంధనల మేరకు సకాలంలో డిపాజిట్టు చెల్లించకపోవటంతో ఏప్రిల్ 15న ఆర్డర్‌ను రద్దు చేశామని, వేలం పాటలో శ్రీనివాసరెడ్డి తరువాత రూ.45లక్షలకు కోట్ చేసిన సురేష్‌ను పిలిపించి ఆయనతో మాట్లాడితే కేవలం తాను కోట్ చేసిన ధరకు రూ.500లు పెంచారని, అంతకంటే ఎక్కువ పెంచలేదని, రాతపూర్వకంగా తెలియపరిచినట్టు చెప్పారు. తరువాత కోట్ చేసిన శ్రీనివాస్‌తో మాట్లాడగా నెలకు రూ.46,01,970 ఆర్టీసీకి చెల్లించేందుకు అంగీకరించటంతో ఆయనకు టెండర్ ఖరారు చేసినట్టు చెప్పారు. లీజు కాలపరిమితి ఐదేళ్లని, 3, 4 ఏళ్లకు సంస్థ నిబంధనల ప్రకారం అద్దె పెంచనున్నట్టు తెలిపారు. ఈ టెండర్ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, నిబంధనల మేరకే జరిగినట్టు వివరించారు. కాగా, బస్టేషన్ ప్రాంగణంలో వేసవిలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 18 కూలర్లు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ప్రాంగణంలో భద్రతను మరింతగా పెంచామన్నారు. మొత్తం 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రెస్ అకాడమీ ద్వారా జర్నలిస్టులకు శిక్షణ

ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

గాంధీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా జర్నలిజంలోకి వస్తున్న వారికి అకాడమీ ద్వారా శిక్షణ నిర్వహిస్తామని సి.రాఘవాచారీ ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్, సామ్నా నేతలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. వర్కింగ్ జర్నలిస్టుగా ఉన్న వ్యక్తిని ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. ఐజేయూ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే.బాబు, యూనియన్ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే. జయరాజ్, డి.నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. రమణారెడ్డి, నగర అధ్యక్షుడు ఏం వీ సుబ్బారావు, యూనియన్ నేతలు జి.రఘురామ్, శివరామకృష్ణ, అహ్మద్ హుస్సేన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆలపాటిని సత్కరిస్తున్న యూనియన్ నేతలు

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందటానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24లోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలన్నారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94906 39639 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మిస్ వరల్డ్



"ప్రపంచం దృష్టిలో మహిళా సాధికారత అంటే... మహిళలు ఉద్యోగం చేయడం, వ్యాపారాలు చేయడం. కానీ తమకు నచ్చిన వారిని పెళ్లి చేసుకొని, గృహిణిగా స్థిరపడడమే అసలైన మహిళా సాధికారత అని నేను నమ్ముతాను."

"సమాజం ఎదుర్కొంటున్న ఏదో ఒక సమస్యను కనీసం మన జీవిత కాలంలో పరిష్కరించగలిగితేనే ఈ జీవితానికి సార్థకత" అన్న నాన్న మాటల స్ఫూర్తితో స్వదేశంలో 'కిడ్నాప్ పెళ్లిళ్ల'కు వ్యతిరేకంగా, బాలికలు, మహిళల హక్కుల కోసం ప్రాణాల్ని పణంగా పెట్టి పోరాడుతున్నారు **ఐజాన్ చనాచెవ్**. 'మిస్ వరల్డ్' పోటీల్లో కిర్గిస్తాన్ ప్రతినిధిగా పాల్గొంటున్న ఆమె... తన ఉద్యమ నేపథ్యం నుంచి అందాల పోటీల వరకూ అనేక అంశాలను 'నవ్య'తో పంచుకున్నారు.

నాన్న మాటే గుర్తొస్తుంది

"అది నా జీవితంలో మరచిపోలేని సందర్భం. నాకు ఏడేళ్ల వయసున్నప్పుడు మా అమ్మ, నాన్న విడాకులు తీసుకున్నారు. నన్ను, మా తమ్ముణ్ణి తనతో పాటు తీసుకువెళ్లాలని అమ్మ అనుకుంది. కానీ నాన్న ఒప్పుకోలేదు. "నా కుమార్తెను ప్రపంచం గుర్తించేలా పెంచుతా" అని అమ్మతో ఆయన శపథం చేశారు. ప్రతిరోజూ ఆ మాట నాకు గుర్తుకువస్తూనే ఉంటుంది. మాది సంప్రదాయ ముస్లిం కుటుంబం అయినప్పటికీ... నాన్న నా ఇష్టాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. నాకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించారు. ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తూ... నన్ను యూనివర్సిటీలో చదివించారు.

అక్కడ అది నిత్యకృత్యం

చదువుతోపాటు సామాజిక అంశాలపై స్పందించడం బాల్యం నుంచి నాన్న నాకు నేర్పారు. "సమాజం ఎదుర్కొంటున్న ఏదో ఒక సమస్యను కనీసం మన జీవిత కాలంలో పరిష్కరించగలిగితేనే ఈ జీవితానికి సార్థకత" అని ఆయన చెబుతూ ఉంటారు. నా స్వదేశమైన కిర్గిస్తాన్ ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య కిడ్నాప్ పెళ్లిళ్లు. నాన్న స్ఫూర్తితో అయిదారేళ్లుగా దానిపై నేను పోరాడుతున్నాను. బజారులో వెళ్తున్న యువతుల్లో, బాలలికల్లో తమకు నచ్చినవారిని కిడ్నాప్ చేసి, బలవంతంగా పెళ్లి చేసుకోవడం మా దేశంలో తరతరాలుగా కొనసాగుతున్న దుస్సంప్రదాయం. కిడ్నాప్ చేసి, వారి ఇళ్లకు తీసుకుపోయిన తరువాత... ఆ యువతుల కుటుంబీకులకు సమాచారం ఇస్తారు. వారి సమక్షంలో వెంటనే పెళ్లి జరిపిస్తారు. అందుకు ఆ యువతి నిరాకరిస్తే... అక్కడే చంపేస్తారు. ఇలా అనేకమంది యువతులు తమ కుటుంబ సభ్యుల కళ్లముందే హత్యకు గురవుతున్నారు. కిడ్నాప్ అయ్యాక.. పెళ్లికి ఒప్పుకోవడం వినహా వేరు మార్గం లేకపోవడంతో... చాలామంది తమ ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకుంటున్నారు. ఆ తరువాత అనేక హింసలకు గురవుతున్నారు. 'ఇది అనాది ఆచారం' అంటూ పురుషులు దీన్ని తమ హక్కుగా భావిస్తూ... దౌర్జన్యాలకు దిగడం నిత్యకృత్యంగా మారింది. మహిళల హత్యలు పెరుగుతూ ఉండడంతో... అయిదేళ్ల క్రితం ప్రభుత్వం దీన్ని నిషేధించింది. అయినప్పటికీ అటు పోలీసులు కానీ, ఇటు చట్టాలు కానీ ఏ మాత్రం అడ్డుకోలేకపోతున్నాయి. తనను కిడ్నాప్ చేసి పెళ్లి చేస్తున్నారని యువతులు స్వయంగా ఫిర్యాదు చేసినా... పోలీసులు స్పందించడం లేదు. చదువు మీద, భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతులకు ఈ కిడ్నాప్ పెళ్లిళ్ల జీవితమంతా వేదనను మిగుల్చుతున్నాయి.

బెదిరింపులకు తగ్గేదేలే...

ఇలాంటి కిడ్నాప్‌ల భయంతోనే... నేను యూనివర్సిటీలో చదివే సమయంలో నాన్న నన్ను ఒంటరిగా పంపేవారు కాదు. ఎప్పుడూ నాకు తోడుగా ఉండేవారు. ప్రపంచం దృష్టిలో మహిళా సాధికారత అంటే... మహిళలు ఉద్యోగం చేయడం, వ్యాపారాలు చేయడం. కానీ తమకు నచ్చినవారిని పెళ్లి చేసుకొని, గృహిణిగా స్థిరపడడమే అసలైన మహిళా సాధికారత అని నేను నమ్ముతాను. దీనిపై నేను అయిదేళ్లుగా ప్రజా ఉద్యమాలు చేస్తున్నాను. కిడ్నాప్ నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని పోరాడుతున్నాను. ఈ ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. "సంప్రదాయానికి వ్యతిరేకంగా వెళ్తున్నావు... ప్రాణం అంటే ప్రేమ లేదా?" అంటూ నిత్యం బెదిరింపులు వస్తూ ఉంటాయి. అయినా వెనక్కు తగ్గకుండా, ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం సాగిస్తున్నాను. ఈ పోరాటంలో ప్రజల నుంచి నాకు విశేషమైన మద్దతు లభిస్తోంది. అది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. మా ఉద్యమాల నేపథ్యంలో... ప్రభుత్వం ఇప్పుడిప్పుడే ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. మరోవైపు... నేను యువతులు వారి కలలను సాకారం చేసుకొనేందుకు దోహదపడే అవగాహన కార్యక్రమాలను కూడా చేపడుతున్నాను.



అదే నా లక్ష్యం

రష్యా, ఉక్రెయిన్‌లతో పాటు మొత్తం 15 దేశాల సమూహమైన 'యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్' (యుఎస్ఎస్ఆర్) నుంచి 1991లో విడిపోయిన కిర్గిస్తాన్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. కేవలం నాలుగేళ్ల క్రితమే మా దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దాదాపు 70 లక్షల జనాభాలో 90 శాతం ముస్లింలు, మిగిలిన 10 శాతం క్రైస్తవులు, బౌద్ధులు ఉంటారు. మా దేశంలో అందాల పోటీల నిర్వహణ 2011లో ప్రారంభమయింది.

ఇస్లామిక్ దేశమైనా... అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ఎలాంటి ఆంక్షలూ లేవు. నేను 'మిస్ కిర్గిస్తాన్'గా ఎంపిక కావడంతోపాటు... మా దేశం తరఫున 'మిస్ ఎర్త్' పోటీలకు ప్రాతినిధ్యం వహించాను. చదువులో భాగంగా... ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్, నేషనల్ డ్యాన్సెస్ కాంపిటీషన్, ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్... ఇలా 9 సార్లు వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. అందుకే 'మిస్ వరల్డ్' పోటీల్లో చాలా ఆత్మవిశ్వాసంతో పాల్గొంటున్నా. నా దేశంతో పాటు అత్యంత వెనుకబడిన దేశాల్లో మహిళలు కోరుకొనే సాధికారతకు పాటుపడడం నా లక్ష్యం. 'మిస్ వరల్డ్' కిరీటం గెలిస్తే నా లక్ష్యాన్ని చేరుకోవడం మరింత సులువవుతుంది.

బిర్యానీ రోజూ ఇష్టంగా తింటున్నా...

నా వ్యక్తిగత విషయాలకు వస్తే... నా మాతృభాష కిర్గిస్‌తోపాటు రష్యన్, టర్కిష్, ఇంగ్లీష్, స్పెయిన్ భాషలు వచ్చు. అలాగే సైగల భాష (సైన్ లాంగ్వేజ్) కూడా బాగా వచ్చు. మా దేశం తరఫున ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్, నేషనల్ డ్యాన్సెస్ పోటీల్లో పలుమార్లు ప్రాతినిధ్యం వహించాను. చదువుకుంటున్న సమయంలో... పదేళ్ల క్రితమే భారతదేశానికి వచ్చాను. గ్వాలియర్, ఆగ్రా, ఢిల్లీ నగరాల్లో కొన్ని రోజులు గడిపాను. మళ్లీ కచ్చితంగా భారతదేశానికి రావాలని అనుకున్నాను. కానీ 'మిస్ వరల్డ్' పోటీలకోసం వస్తానని ఊహించలేదు. ఈ పోటీలు తెలంగాణలో జరుగుతున్నాయని తెలిశాక... కిర్గిస్తాన్‌లోని భారతీయ రాయబార కార్యాలయానికి వెళ్లి, ఈ రాష్ట్ర చరిత్ర గురించి తెలుసుకున్నాను. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు గురించి అధికారులు నాకు చాలా వివరంగా తెలిపారు. స్వరాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమాలు జరగడం, అనేక మంది ప్రాణాలు కోల్పోవడం గురించి వింటుంటే చాలా బాధ కలిగింది. తెలంగాణ వంటకాలు, సంస్కృతి, పర్యాటక ప్రాంతాల గురించి కూడా తెలుసుకున్నాను. ఉద్యమాలతో ఏర్పడిన ఈ రాష్ట్రంలో అడుగుపెట్టినప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. నాకు హైదరాబాద్ బాగా నచ్చింది. కిర్గిస్తాన్ పర్యాటకానికి ప్రసిద్ధి. నేను ఉద్యోగం చేస్తున్నది కూడా పర్యాటక శాఖలోనే. 'మిస్ వరల్డ్' పోటీలకు తెలంగాణ పర్యాటక శాఖ ఆతిథ్యం ఇస్తూ ఉండడంతో... ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను చూడాలని ఎంతో ఆసక్తిగా ఉన్నా. వాటి గురించి మా దేశంలోనూ ప్రచారం చేస్తా. వారం రోజులుగా ఇక్కడ తెలంగాణ వంటకాలతో పాటు వివిధ భారతీయ వంటకాల రుచులను ఆస్వాదిస్తున్నా. ప్రపంచ ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ బిర్యానీ గురించి చాలా విన్నాను. ఇప్పుడు ప్రతిరోజూ ఎంతో ఇష్టంగా తింటున్నా."

• ముహమ్మద్ ఆర్‌హెచ్ షరీఫ్

అంతరంగం



సానియా మిర్జా... అయిదేళ్ల వయసులో రాకెట్ పట్టి... ముప్ఫై ఏళ్ల క్రీడా జీవితంలో ఆరు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచారు. అమ్మాయిలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపించారు. రెండేళ్ల క్రితం తన కెరీర్‌కు వీడ్కోలు పలికిన ఆమె... అప్పటి నుంచి కొడుకు ఇజామ్ ఆలనా పాలనా చూసుకుంటూ మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో క్రీడా జీవితంలో ఎదుర్కొన్న ఒడుదొడుకులు, మాతృత్వపు తొలి రోజుల్లో ఎదురైన విపత్కర పరిస్థితుల గురించి ఇలా చెప్పుకొచ్చారు.

అపరాధ భావం ఆ రోజంతా వెంటాడింది

"చిన్నప్పుడు నేను స్కూల్‌కు వెళ్లే దారిలో ఓ టెన్నిస్ కోర్టు ఉండేది. ప్రతిరోజూ దాని ముందు నుంచి వెళుతూ అక్కడ ఆగి ఎలా ఆడుతున్నారో చూస్తూ ఉండేదాన్ని. అలా టెన్నిస్ మీద ఆసక్తి కలిగింది. అయిదో ఏట నుంచి ఆట మొదలుపెట్టాను. నాకు పన్నెండేళ్లు వచ్చేవరకూ ఒక హాబీగానే ఆడాను. తరవాత వింబుల్డన్ ఆడాలనే కోరిక పెరిగింది. ఉదయం అయిదున్నరకు లేచి ఫిట్‌నెస్ క్లాసులకు వెళ్లేదాన్ని. దీంతో స్కూల్‌కి వెళ్లడం ఆలస్యమయ్యేది. అప్పుడు నాన్న వచ్చి స్కూల్ యాజమాన్యానికి నా పరిస్థితి చెప్పడంతో అరగంట ఆలస్యమైనా స్కూల్లోకి అనుమతించేవారు. అమ్మ ఇంటి నుంచి బట్టలు, తినడానికి ఏదైనా చిరుతిండి తీసుకుని వచ్చేది. స్కూల్లోనే బట్టలు మార్చుకుని టెన్నిస్ క్లాసులకు వెళ్లేదాన్ని. నాకు పదహారేళ్లు వచ్చాక ప్రొఫెషనల్‌గా ఆడడం నేర్చుకున్నా. రోజుకు ఎనిమిది గంటలు కోర్టులో లేదంటే జిమ్‌లో ఉండేదాన్ని. చదువుకోవడానికి సమయం సరిపోయేది కాదు. కానీ పరీక్షలప్పుడు మాత్రం శ్రద్ధగా చదివి, డిగ్రీ పూర్తి చేశాను. నా ఈ క్రీడా ప్రయాణంలో టీచర్లు, లెక్చరర్లు, కుటుంబం అందించిన సహకారం మరువలేనిది. ఆ ప్రోత్సాహంతోనే విజయాలు సాధించాను.

సమానత్వం ఎక్కడ?

అప్పట్లో అమ్మాయిల మీద ఎన్నో ఆంక్షలు ఉండేవి. పెద్దగా నవ్వకు, సరిగా కూర్చో, ఇలా చేయకు, అలా మాట్లాడకు, బయట అబ్బాయిలతో ఆడకు... అంటూ ఎన్నో చెబుతుండేవారు. అదే అబ్బాయిల విషయంలో ఇలాంటివి ఏమీ ఉండేవికావు. క్రీడలనేవి పురుషులకే సొంతం అనే తీరులో సమాజం ఉండేది. క్రీడాకారిణిగా ఎదిగేటప్పుడు ఎదురైన ఎన్నో విమర్శలు, వ్యతిరేకతల నుంచి నన్ను అమ్మానాన్న కాపాడారు. నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఆ ధైర్యంతోనే 19 ఏళ్ల వయసులో నా వస్త్రధారణపై వచ్చిన విమర్శలను నిజాయితీగా తిప్పికొట్టాను. మగవారినైతే వాళ్ల ఫిట్‌నెస్, ఆటతీరును బట్టి అంచనా వేసేవారు. అదే క్రీడాకారిణుల విషయంలో మాత్రం ఎంత అందంగా కనిపిస్తుంది, సన్నగా ఉందా, లావుగా ఉందా, వస్త్రధారణ ఎలా ఉంది అనే విషయాలన్నీ ప్రస్తావనకు వచ్చేవి. ఏదైనా పార్టీకి వెళ్లినా... రెస్టారెంట్‌కు వెళ్లినా... ఎవరితో కలిసి వెళ్లింది, ఏ సమయంలో వెళ్లింది, ఏం తింటుంది అనేవి చర్చకు వచ్చేవి. ఇలాంటి విపరీత ధోరణి విసుగు తెప్పించేది. పురుషులనైనా, మహిళలనైనా వారి ప్రతిభ ఆధారంగానే గుర్తిస్తే బాగుంటుందని అనుకునేదాన్ని. ఓ ఈవెంట్‌లో నేను, నికత్ జరీన్, సైనా, జ్వోష్నా చినప్పా కలుసుకున్నాం. అందరం క్రీడాకారిణులమే. వేర్వేరు మతాలు, ప్రాంతాలకు చెందిన మేము ఎదిగే క్రమంలో ఎదుర్కొన్న విమర్శలు, అవమానాలు ఒకేలా ఉన్నాయని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యంగా అనిపించింది. ఇప్పటికీ మహిళలకు సమాన హక్కులు లభించడం లేదు. 30 ఏళ్ల కిందటితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగైందనే చెప్పాలి. కానీ మహిళలు ఇంకా ఎదగాలి. పరిణతి సాధించాలి.



క్రీడల్లో రాణించాలనుకొనే అమ్మాయిలకు చెప్పేదేంటంటే... ఏ ఆటలోనైనా ఉన్నత స్థాయికి ఎదగాలంటే శ్రమ పడాలి. ఎన్నింటినో త్యాగం చేయాలి. క్రమశిక్షణ పాటించాలి. ఆరోగ్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలి. మానసిక ధైర్యం పెంచుకోవాలి. జయాలతో పాటు అపజయాలను కూడా స్వీకరించగలగాలి. అలాగని ఆటే జీవితం కాదు. ఏ ఆట అయినా జీవితంలో ఒక భాగం మాత్రమే.

ఓ అద్భుతమైన జ్ఞాపకం...

క్రీడా ప్రస్థానాన్ని కొనసాగించడం అంత సులువేమీ కాదు. ప్రతి ట్రోఫీ వెనక ఎన్నో సంవత్సరాల శ్రమ, త్యాగం ఉంటాయి. నేను కూడా చిన్నప్పటి నుంచి ఎన్నో త్యాగాలు చేయాల్సి వచ్చింది. జిమ్‌లో వర్కవుట్స్, కోర్టులో సాధన చేయడంలోనే గంటలు గడిచిపోయేవి. ఆడేటప్పుడు గాయాలయ్యేవి. రాత్రిపూట ఒళ్లంతా నొప్పిగా అనిపించినా అలాగే పడుకునేదాన్ని. ఉదయం లేవగానే మళ్లీ అదే దినచర్య. ఇవన్నీ నా లక్ష్యం ముందు చిన్నవిగా అనిపించేవి. నిన్నటి కంటే ఈ రోజు ఇంకా బాగా ఆడాలి అనుకునేదాన్ని. కష్టపడితేనే అదృష్టం కలిసివస్తుందని నమ్మేదాన్ని. నా చిన్నప్పుడు హైదరాబాద్‌లో ఓ ప్రపంచ స్థాయి టోర్నమెంట్ జరిగింది. అందులో ఆడడానికి నాకు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దొరికింది. ఆ టోర్నమెంట్ గెలిచాను. ఒక అవకాశం దొరికిన సందర్భం... దాన్ని వినియోగించుకున్న క్షణం... నిజంగా ఓ అద్భుతమైన జ్ఞాపకం. ఈ సంఘటన నా జీవితాన్నే మార్చేసింది.

వీడ్కోలు వేళ...

ఇజాన్ పుట్టిన తరవాత ఫిట్‌నెస్ సాధించడం కోసం చాలా కష్టపడ్డాను. రోజులు గడుస్తున్నకొద్దీ నాలో శక్తి తగ్గుతుందనిపించేది. మోకాళ్లకు, మోచేతికి శస్త్రచికిత్సలు జరిగాయి. మునుపటిలా కాకుండా గాయాలు మానడానికి చాలా రోజుల సమయం పట్టేది. మూడేళ్ల కొడుకుని నాతోపాటు విదేశాలకు తీసుకువెళ్లడం కూడా కష్టంగా ఉండేది. వీటన్నింటి మధ్య కెరీర్‌ను కొనసాగించడం ఇక సాధ్యం కాదనిపించింది. నా చివరి మ్యాచ్ దుబాయ్‌లో జరిగింది. ఆ రోజు పత్రికా సమావేశానికి నాతోపాటు ఇజాన్ కూడా వచ్చాడు. అక్కడ చిరునవ్వుతో హుందాగానే ఉన్నాను. మనసులో కూడా ఎటువంటి ఆందోళన లేదు. అక్కడ వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ క్రీడా జీవితం నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించి ఇంటికి వచ్చేశాను. ఇల్లంతా స్నేహితులతో నిండి ఉంది. నేను నేరుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మూడు గంటలపాటు ఏడుస్తూనే ఉన్నా. ఉదయం లేవగానే అంతా శూన్యంగా అనిపించింది. కానీ మరుక్షణంలోనే... జిమ్‌కు, కోర్టుకు వెళ్లక్కర్లేదు... రోజంతా ఇజాన్‌తోనే ఉండవచ్చు అని గుర్తుకు వచ్చి మనసంతా సంతోషంతో నిండిపోయింది. నా కెరీర్లో ఎన్నో లక్ష్యాలు సాధించాను. ఇప్పుడు అమ్మగా నా లక్ష్యం మీద దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందనిపించింది. నా కొడుకుతో పూర్తి సమయం గడపాలని నిశ్చయించుకున్నాను. అందుకే రిటైర్మెంట్ ప్రకటించాను. బిడ్డ ఎదుగుతున్నప్పుడు ఓ తల్లికి ఎదురయ్యే మధురానుభూతులను ఆస్వాదించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను.

బిడ్డ కోసం తల్లడిల్లిన క్షణాలు...

కెరీర్ ధ్యాసలో పడి బిడ్డను నిర్లక్ష్యం చేస్తున్నానా? అనే ప్రశ్న... వృత్తి, ఉద్యోగాల్లో కొనసాగే ప్రతి తల్లికీ ఎదురవుతుంది. ఒక్కోసారి ఇది మనోవేదనను కలిగిస్తుంది. ఇజాన్ పుట్టిన ఆరు వారాలకే నేను అత్యవసర పనిమీద ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. పాలు తాగే పసివాడిని వదిలి వెళ్లాలంటే కష్టంగా అనిపించింది. నేను బయలుదేరే చివరి నిమిషం వరకూ వాడికి పాలు పడుతూనే ఉన్నాను. అయినా... ప్రతి క్షణం బిడ్డ గురించే ఆలోచిస్తూ తల్లడిల్లిపోయాను. నా మనసంతా అపరాధ భావంతో నిండిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చి బిడ్డను చూడగానే నాకు ఏడుపు ఆగలేదు. ఆ సమయంలో అమ్మ నన్ను ఓదార్చింది. పాలిచ్చే తల్లులకు ఎన్నో మధురానుభూతులు ఉంటాయి. వాటితోపాటే శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల పెంపకం అనేది కేవలం తల్లి బాధ్యత మాత్రమే అన్న భావన సమాజంలో నాటుకుపోయింది. దీనివల్ల తల్లుల మీద అదనపు భారం పడుతోంది. పిల్లలు సంతోషంగా, ఆరోగ్యంగా, మానసిక పరిపక్వతతో పెరగాలంటే తల్లిదండ్రులు ఇద్దరూ సమానంగా బాధ్యతలు పంచుకోవాలి.

రిటైర్ అయ్యాక...

నాకు టెన్నిస్ చాలా ఇష్టం. క్రీడా జీవితానికి వీడ్కోలు పలికినప్పటికీ టెన్నిస్ నా జీవితంలో భాగంగానే ఉంది. అప్పుడప్పుడు కామెంటరీలు చెబుతుంటాను. ఓ టెన్నిస్ ఛానెల్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాను. దుబాయ్‌లో టెన్నిస్ అకాడమీని నిర్వహిస్తున్నాను. టీవీ ప్రోగ్రామ్‌లు చేస్తుంటాను. నాకు మోటివేషనల్ స్పీకింగ్ అంటే చాలా ఇష్టం. వీటికి సంబంధించిన ఎపిసోడ్స్ చేస్తుంటాను. ఈవెంట్లు, షూటింగ్ ప్రోగ్రామ్‌లు ఉన్నప్పుడు ప్రయాణ సమయాన్ని తగ్గించుకోవడానికి విమానం ఎక్కేస్తాను. పగలంతా పనుల నిమిత్తం ఎక్కడ తిరిగినా సాయంత్రం కాగానే ఇజాన్ కోసం ఇంటికి చేరుకుంటాను. వాడితో కలిసి టెన్నిస్, క్రికెట్, వాలీబాల్ ఆడుతుంటాను."

మంచి అలవాట్లు నేర్పించాలి..

పేరెంటింగ్



పోషకాహారంతోపాటు మంచి అలవాట్లు కూడా పిల్లల ఎదుగుదలకు, వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి. అందుకే తల్లితండ్రులు పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలి.

- పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి, తేలికపాటి వ్యాయామం చేయించాలి. దీనివల్ల శరీరమంతా రక్తప్రసరణ జరిగి మెదడుకి ఆక్సిజన్ బాగా అందుతుంది. పిల్లలు రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- వారానికి రెండు రోజులు యోగా చేయించాలి. దీనివల్ల శ్వాస మీద దృష్టి నిలుస్తుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగించాలి. దీనివల్ల నిర్జలీకరణ సమస్యలు రావు. మెదడు చురుకుగా పని చేస్తుంది. ఏకాగ్రత పెరిగి, జీర్ణాశయ సమస్యలు రావు.
- ఉదయం పూట పిల్లలను కొద్దిసేపు చదివించాలి. ఈ సమయంలో మెదడు ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి చదివిన అంశాలు బాగా గుర్తుంటాయి.
- అల్పాహారంలో పోషక విలువలు, పీచుపదార్థాలున్న ఆహారపదార్థాలను తినిపించాలి. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు.
- పిల్లలకు చిన్న చిన్న లక్ష్యాలు సూచించి వాటిని త్వరగా పూర్తి చేయమని చెప్పాలి. ఉదాహరణకు ఒక పాఠాన్ని పూర్తిగా చదవడం, బొమ్మలు వేయడం, పుస్తకాలు సర్దడం లాంటివి చెప్పవచ్చు. పూర్తి చేసిన తరవాత అభినందిస్తే వాళ్లకి సాధించామన్న భావన కలిగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఫ్యాషన్



పోచంపల్లి చీరలు ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందాయి. కాబట్టే ప్రపంచ సుందరి పోటీలో పాల్గొంటున్న భామలందరూ పోచంపల్లి సందర్శించబోతున్నారు. ఈ సందర్భంగా మగువల మనసులను దోచే పోచంపల్లి చీరల సోయగాల మీద ఓ లుక్కేద్దామా?

పోచంపల్లి సోయగం

ఇక్కత్ టై అండ్ డై కోవకు చెందిన వస్త్రాల ఉత్పత్తి భారత దేశానికే సొంతం. ఒడిషా, గుజరాత్‌లతో పాటు మన తెలంగాణలోని పోచంపల్లి, ప్రాచీన ఇక్కత్ ఉత్పాదక ప్రాంతంగా పేరు పొందింది. వేలకొద్దీ మగ్గాలను కలిగి ఉన్న పోచంపల్లిలో వినూత్నమైన చీరలు రూపొందుతూ ఉంటాయి. వీటి గురించిన ఆసక్తికరమైన విశేషాలివి...

- నూలు, పట్టు, సీకో వస్త్రాలతో పోచంపల్లి ఇక్కత్ చీరలు రూపొందుతాయి. స్థానిక పోచంపల్లి డిజైన్లు ఇతర ప్రాంతాల్లోని డిజైన్లకు పూర్తి భిన్నంగా ఉంటాయి. అసలైన పోచంపల్లి చీరలను వాటి మోటిఫ్స్ అంచులను బట్టి కనిపెట్టవచ్చు.
- ప్రధానంగా జామెట్రీ డిజైన్లతో రూపొందుతున్నప్పటికీ, పక్షులు, చెట్ల డిజైన్లు కూడా అప్పుడప్పుడూ కనిపిస్తూ ఉంటాయి. నేయడానికి ముందు మగ్గానికి తైలం పట్టించే తైల చికిత్సను సూచించే 'తేలియా రుమాల్' (తైల రుమాలు) అత్యంత సంక్లిష్టమైన డిజైన్. హైదరాబాద్ నిజాంల ఆజ్ఞ మేరకు, ద్వంద్వ ఇక్కత్ ప్రక్రియతో రూపుదిద్దుకున్న తేలియా రుమాల్ డిజైన్ కాలక్రమేణా అత్యంత ఆదరణకు నోచుకుంది
- పోచంపల్లి కళారూపం ఎంతో పురాతనమైనదే అయినప్పటికీ పోచంపల్లి ఇక్కత్, 2005లో మాత్రమే భారతప్రభుత్వ భౌగోళిక సూచికను దక్కించుకుంది.



స్పోర్ట్స్



మంధాన @ 2

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: శ్రీలంకలో ముక్కోణపు సిరీస్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా మహిళల స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లోనూ అదరగొట్టింది. మంగళవారం ప్రకటించిన తాజా మహిళల వన్డే ర్యాంకింగ్స్ బ్యాటింగ్ విభాగంలో మంధాన (727 పాయింట్లు) ఓ స్థానం ఎగబాకి రెండో ర్యాంక్‌లో నిలిచింది. టాప్‌లో ఉన్న దక్షిణాఫ్రికా సారథి లారా వోల్వార్ట్ (738)కు కేవలం 11 పాయింట్ల దూరంలో ఉంది. మిగతా బ్యాటర్లలో జెమీమా ఐదు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఓ స్థానం కోల్పోయి 16లో ఉంది. బౌలింగ్ జాబితాలో సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్) నెంబర్‌వన్‌గా కొనసాగుతుండగా.. భారత్ నుంచి దీప్తి శర్మ 4వ ర్యాంక్ నిలబెట్టుకుంది. ఆల్‌రౌండర్లలో దీప్తి శర్మ ఓ స్థానం మెరుగై 5వ ర్యాంకులో నిలవగా, ఆష్లే గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా) టాప్‌లో ఉంది.

'ఖేలో ఇండియా'లో తెలుగోళ్ల సత్తా



వర్షిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారులు పతకాల మోత మోగించారు. నాలుగో రోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 7, తెలంగాణకు 3 పతకాలు లభించాయి. మంగళవారం బిహార్‌లో జరిగిన ఈ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్ యూత్ బాలికల 64 కిలోల కేటగిరీలో వర్షిత (శ్రీకాకుళం) 174 కిలోల బరువెత్తి పసిడితో మెరిసింది. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో చరణ్ రామ్, హరికృష్ణ (విజయవాడ) ద్వయం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ యూత్ 59 కిలోల విభాగంలో తరంగిణి (రాజమండ్రి) 170 కిలోల బరువెత్తి రజతం, 71 కిలోల కేటగిరీలో 171 కిలోల బరువెత్తిన జుహిత (రాజమండ్రి) రజతం, 81 కి., విభాగంలో అల్లు రేవతి (విశాఖపట్నం) 173 కిలోల బరువెత్తి కాంస్యం, 81 కి., యూత్ విభాగంలో తరుణ్ (శ్రీకాకుళం) 287 కిలోల బరువెత్తి రజత పతకాలను సాధించారు. బాలుర 89 కిలోల విభాగంలో సాయివర్ధన్ (తెలంగాణ) 275 కిలోల బరువెత్తి స్వర్ణం సాధించగా, వెంకటేష్ (గుంటూరు) 272 కిలోల బరువెత్తి రజతంతో సరిపెట్టుకున్నాడు. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జూనియర్ ఆల్‌రౌండ్ విభాగంలో నిషిక (తెలంగాణ) 44.333 స్కోరుతో స్వర్ణం సాధించింది. బాలికల ఫెన్సింగ్ ఈపీ విభాగంలో తెలంగాణ అమ్మాయి అదీబా కాంస్యంతో మెరిసింది.



జొకో, మర్రే.. కటీఫ్

లండన్: ఫ్రెంచ్ ఓపెన్‌కు రెండు వారాల ముందు సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిక్ కోచ్‌గా ఆండీ మర్రే వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. జొకోవిక్ కోచ్‌గా తాను వైదొలుగుతున్నట్టు మంగళవారం సోషల్ మీడియా వేదికగా ప్రపంచ మాజీ నెంబర్ వన్ మర్రే ప్రకటించాడు. తామిద్దరం ఇక కలిసి ప్రయాణం చేయబోవడం లేదని మర్రే పేర్కొన్నాడు. అనంతరం ఈ ఆరు నెలల ప్రయాణంలో మర్రే తన కోసం శ్రమించిన విధానం, తను పంచిన వినోదం, అందించిన మద్దతును కొనియాడుతూ నొవాక్ సోషల్ మీడియాలో ఒక సందేశం పోస్ట్ చేశాడు. ఈ ప్రయాణంతో తమ స్నేహం మరింత బలపడిందని నొవాక్ తెలిపాడు.

'థాయ్‌లాండ్'లో శ్రీకాంత్‌కు తరుణ్ షాక్

బ్యాంకాక్: ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌కు మరో టోర్నీలోనూ నిరాశే ఎదురైంది. థాయ్‌లాండ్ ఓపెన్‌లో ఏకంగా క్వాలిఫయింగ్ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. సింగిల్స్ క్వాలిఫయింగ్ ఆరంభ రౌండ్లో తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి 21-6, 21-19తో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. ఆ తర్వాత తదుపరి రౌండ్లో తరుణ్ 17-21, 21-19, 21-17తో కువో కాన్ లిన్ (తైపీ)ని ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. భారత షట్లర్ ఐరా శర్మ 18-21, 21-12, 21-8తో తెట్ తార్ తుజార్ (మయన్మార్)పై గెలిచి మహిళల సింగిల్స్‌లో మెయిన్ డ్రాకు చేరుకుంది.

ఆ శిక్షణతో మరింత ఎత్తుకు..

బెంగళూరు: విరాట్ కోహ్లీ కెరీర్‌లో 2014 ఇంగ్లండ్ పర్యటన అత్యంత చేదు అనుభవాన్ని మిగిల్చింది. దిగ్గజ పేసర్ జేమ్స్ అండర్సన్ అతడి ప్రాభవాన్ని దారుణంగా దెబ్బతీశాడు. దీంతో ఆ టూర్‌లో ఆడిన ఐదు టెస్టుల్లో 134 పరుగులే చేయగా, 4 వన్డేల్లో 54 రన్స్‌కు పరిమితమయ్యాడు. దీంతో సీమ్ పిచ్‌లపై అతడి వైఫల్యంపై ఇంటా, బయటా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే ఇలాంటి గడ్డు స్థితి నుంచి విరాట్ త్వరగానే పుంజుకోవడమే కాకుండా కెరీర్‌లో అత్యున్నత స్థితికి చేరుకోగలిగాడు. దీనికి కారణం.. అతడి అండర్-19 కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్ దగ్గర రెండు వారాలు తీసుకున్న శిక్షణేనట. 'విరాట్ నాకు చిన్నప్పటి నుంచే తెలుసు. అండర్- 19కు ఆడినప్పటి నుంచే అతని ఆటపై నాకు పూర్తి అవగాహన ఉంది. 2014 టూర్ తర్వాత వెంటనే నాకు ఫోన్ చేశాడు. ముంబైలో రెండు వారాలపాటు ఏర్పాటు చేసిన శిబిరంలో విరాట్ బ్యాటింగ్ లోపాలపై దృష్టి పెట్టా. క్రీజులో అతడి తల కాస్త వాలిపోతున్నట్టు ఉండడమే కాక పాదాల కదలిక అనిశ్చితిగా ఉంది. దీంతో ఆ విషయంలో మార్పులు చేశా. వెంటనే విరాట్ ఈ విషయంలో కఠిన ప్రాక్టీస్ చేశాడు' అని రాజ్‌పుత్ వివరించాడు. ఈ శిక్షణ విరాట్ కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయింది. ఎందుకంటే ఆ తర్వాత 2014 నవంబరులోనే ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లగా అడిలైడ్‌లో డబుల్ సెంచరీ, మెల్‌బోర్న్.. సిడ్నీలలో శతకాలతో చెలరేగాడు. ఈ దాటితో 4 టెస్టుల్లో 692 రన్స్‌తో విరాట్ విమర్శకులకు దీటైన బదులిచ్చాడు. ఆ తర్వాత తన కెరీర్ దూసుకెళ్లడంతో ఇతర బ్యాటర్లకు అందనంత ఎత్తుకు ఎదిగాడు.



కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్‌తో కోహ్లీ

ప్రాక్టీస్ మ్యాచ్‌లంటే ఇష్టం ఉండదు: భరత్ అరుణ్

ప్రాక్టీస్ మ్యాచ్‌లకన్నా నెట్ సెషన్స్ అంటేనే విరాట్ కోహ్లీ ఇష్టపడేవాడని భారత జట్టు మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ తెలిపాడు. 16 గజాల దూరం నుంచే పేసర్లతో బంతులు వేయించుకునేవాడని చెప్పాడు. విరాట్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు అరుణ్ జట్టుతోపాటే ఉన్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో తీవ్రత ఉండదని కోహ్లీ చెప్పేవాడని అరుణ్ అన్నాడు.



ఆధ్యాత్మిక పర్యటనలో విరుష్క

మధుర: టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలు పలికిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. భార్య అనుష్క శర్మతో కలిసి మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ధామ్ ఆశ్రమానికి వెళ్లాడు. గురువు ప్రేమానంద్ గోవింద్ మహరాజ్ ఆశీస్సులు తీసుకుని అక్కడే కొంతసేపు గడిపారు. ఈ ఏడాది ఆరంభంలోనూ ఆసీస్ పర్యటన ముగిశాక తమ పిల్లలతో కలిసి విరాట్ జంట ఇదే ఆశ్రమానికి వచ్చారు.

విదేశీ ఆటగాళ్లకై ఎదురుచూపులు

ఐపీఎల్‌కు స్టొయినిస్, ఇన్‌గ్లిస్ దూరం

న్యూఢిల్లీ: ఈనెల 17 నుంచి ఐపీఎల్ తిరిగి ఆరంభం కానుండడంతో విదేశీ ఆటగాళ్ల రాకపై అందరి దృష్టీ నెలకొంది. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణతో పరిస్థితులు మారడంతో ఎలాగైనా విదేశీ క్రీడాకారులను భారత్‌కు రప్పించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే ఇందుకు పలువురు ఆటగాళ్లు అంతగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అంతేకాకుండా తమ ప్లేయర్ల భద్రత ముఖ్యమనే ఆలోచనలో ఆయా దేశాల క్రికెట్ బోర్డులు కూడా ఉన్నాయి. వారిని ఒప్పించే బాధ్యతను ఐపీఎల్ సీఓఓ హేమంగ్ అమిన్‌కు బోర్డు అప్పగించింది. తను ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులతో ఇదే విషయమై చర్చించాడు. 'విదేశీ క్రికెట్ బోర్డులతో నేరుగా మాట్లాడుతున్నాం. ఫ్రాంచైజీలు కూడా తమ ఆటగాళ్లతో టచ్‌లో ఉన్నారు. మెజారిటీ క్రికెటర్లు భారత్‌కు వస్తారనే ఆశిస్తున్నాం' అని బోర్డు అధికారి పేర్కొన్నాడు. మరోవైపు ఆసీస్ ఆటగాళ్లలో స్టొయినిస్, ఇన్‌గ్లిస్ పంజాబ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. వారిని ఒప్పించేందుకు కోచ్ పాంటింగ్ ప్రయత్నిస్తున్నాడు. ఢిల్లీ కీలక పేసర్ స్టార్క్ ఇక్కడికి వచ్చేందుకు అయిష్టత వ్యక్తం చేశాడు. కమిన్స్, హెడ్ మాత్రం జట్టులో చేరతారని ఆశిస్తున్నట్టు రైజర్స్ యాజమాన్యం పేర్కొంది.

కోహ్లీలో ఇంకా ఆడే సత్తావుంది!

సయ్యద్ కిర్మాణి

న్యూఢిల్లీ: టెస్టుల్లో ఆడేందుకు విరాట్ కోహ్లీలో ఇంకా చాలా క్రికెట్ మిగిలుందని భారత మాజీ వికెట్‌కీపర్ సయ్యద్ కిర్మాణి అభిప్రాయపడ్డాడు. 'ప్రతి ఒక్కరు ఆటలో రిటైర్ కావాల్సిందే. అయితే కోహ్లీ కొంచెం ముందుగా వీడ్కోలు పలికాడు. ఈ నిర్ణయం తీసుకునేందుకు అతడిపై ఎలాంటి ఒత్తిడీ లేదనుకుంటున్నా. భవిష్యత్‌లో అతడికి మంచి జరగాలని కోరుకుంటున్నా. విరాట్ నిలకడైన ఆటతీరే అతణ్ని మిగిలిన వారికంటే భిన్నంగా నిలబెట్టింది. భావి క్రికెటర్లకు అతడొక ప్రేరణ' అని కిర్మాణి చెప్పాడు.

పాక్ చీఫ్ కోచ్‌గా మైక్ హెస్సన్

లాహోర్: వన్డే, టీ20లకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా మైక్ హెస్సన్ నియమితుడయ్యాడు. ఈనెల 26న హెస్సన్ బాధ్యతలు తీసుకుంటాడని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈ కోచ్ ఉద్యోగానికి మొత్తం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా వడపోత అనంతరం హెస్సన్‌ను నియమించారు. పాక్ 2023 నుంచి నియమించిన విదేశీ కోచ్‌ల్లో హెస్సన్ ఐదో వాడు కావడం విశేషం. బ్రాడ్‌బర్న్, ఆర్థర్, కిర్‌స్టెన్, గిలెస్పీ తమ ఒప్పందకాలం ముగియకుండానే కోచ్‌లుగా వైదొలిగారు. న్యూజిలాండ్‌కు చెందిన హెస్సన్ గతంలో కెన్యా, కివీస్, ఐపీఎల్‌లోని ఆర్‌సీబీ జట్లకు ప్రధాన కోచ్‌గా పనిచేశాడు.

మైదానంలో వీడ్కోలుకు ఆ ముగ్గురు అర్హులు



న్యూఢిల్లీ: కొద్దిరోజుల వ్యవధిలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడం తనను విస్మయానికి గురిచేసిందని స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే అన్నాడు. అలాగే, వీళ్లు మైదానంలో వీడ్కోలు పలికి ఉంటే బాగుండేదన్నాడు. 'ఇద్దరు మేటి ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు టెస్టులకు గుడ్‌బై పలికారు. ముఖ్యంగా కోహ్లీ.. ఇంకా కొన్నేళ్లు టెస్టులు ఆడే సత్తా ఉన్నా కూడా, ఈ నిర్ణయం తీసుకుంటాడని ఊహించలేదు. ఇది ఒకరకంగా నిశ్శబ్ద నిష్క్రమణ. కానీ, మైదానంలో ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య వీడ్కోలు ప్రకటన చేస్తే ఎంత బాగుంటుంది? గతంలో అశ్విన్ కూడా అలాగే చేశాడు. ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే భారత్ వచ్చేసి రిటైర్మెంట్ ప్రకటించేశాడు. నా దృష్టిలో ఈ ముగ్గురు మైదానంలో అభిమానుల మధ్య రిటైర్మెంట్ తీసుకునేందుకు వందశాతం అర్హులు' అని కుంబ్లే వ్యాఖ్యానించాడు.

వచ్చే వరల్డ్‌కప్‌లో రో-కోను చూడలేం



న్యూఢిల్లీ: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి వన్డేల్లో మాత్రమే కొనసాగుతామని చెప్పిన స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ దాకా ఆడకపోవచ్చని టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. 'ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, కోహ్లీ కలిసి జట్టును చాంపియన్‌గా నిలబెట్టారు. కానీ, ఇదే దూకుడైన ఫామ్ మరో రెండేళ్లపాటు కొనసాగుతుందా? అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సెలెక్షన్ కమిటీ వీరిద్దరి ఎంపికకు ఓకే చెబుతుందా.. అంటే కచ్చితంగా అవునని చెప్పలేం. నిజాయితీగా చెబుతున్నా.. నా అంచనా ప్రకారం వీళ్లిద్దరిని 2027లో జరిగే ప్రపంచకప్‌లో మనం చూడలేం. ఒకవేళ.. అప్పటిదాకా కూడా అద్భుతంగా ఆడుతూ, సెంచరీల మీద సెంచరీలు కొడుతూ ఉంటే, ఆ భగవంతుడు కూడా జట్టు నుంచి వీళ్లను తొలగించలేడు' అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు. ఇక, తనవరకైతే టీమిండియా టెస్టు కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రా సరైన వాడని సన్నీ చెప్పాడు.

బిజినెస్

ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

ఏప్రిల్‌లో 3.16 శాతం



న్యూఢిల్లీ: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గింది. 2019 జూలైలో 3.15 శాతంగా నమోదైన సూచీకి ఆ తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. కూరగాయలు, పండ్లు, పప్పు దినుసులు, ప్రొటీన్ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు తోడ్పడింది. జూన్‌లో నిర్వహించనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ప్రామాణిక రెపోరేటును మరింత తగ్గించేందుకు ఈ పరిణామం దోహదపడనుంది. ఈ మార్చిలో ద్రవ్యోల్బణం 3.34 శాతంగా, గత ఏడాది ఏప్రిల్‌లో 4.83 శాతంగా నమోదైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్ఓ) మంగళవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో ఆహార ద్రవ్యోల్బణం 0.91 శాతం తగ్గి 1.78 శాతానికి దిగివచ్చింది. 2021 అక్టోబరు తర్వాత ఆహార ద్రవ్యోల్బణానికి ఇదే కనిష్ఠ స్థాయి. కాగా, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గడిచిన కొన్ని నెలల్లో ధరలు కొంత అదుపులోనే ఉండటంతో ఆర్‌బీఐ ఈ ఫిబ్రవరి, ఏప్రిల్‌లో నిర్వహించిన పరపతి సమీక్షల్లో రెపో రేటును 0.25 శాతం చొప్పున మొత్తం 0.50 శాతం తగ్గించింది. దాంతో రెపో రేటు 6 శాతానికి దిగివచ్చింది.

ఎస్‌బీఐ మరో ఘనత

వార్షిక లాభాల పరంగా ప్రపంచ టాప్-100 జాబితాలోకి ప్రవేశం

న్యూఢిల్లీ: దశాబ్దం క్రితం తన ఐదు అనుబంధ బ్యాంక్‌లను విలీనం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోని 50 అతి పెద్ద బ్యాంక్‌ల జాబితాలోకి ప్రవేశించిన భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ).. తాజాగా మరో ఘనత సాధించింది. వార్షిక నికర లాభాల పరంగా ప్రపంచంలోని టాప్-100 కంపెనీల లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) రూ.77,561 కోట్ల (920 కోట్ల డాలర్లు) నికర లాభం ఆర్జించిన ఎస్‌బీఐ.. బ్లూంబర్గ్ రూపొందించిన ఈ జాబితాలో 98వ స్థానంలో నిలిచింది.

తాజ్ జీవీకే లాభం రూ.28.6 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్థానిక తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ నాలుగో త్రైమాసికానికి రూ.28.6 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 10.6 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.116.69 కోట్ల నుంచి రూ.130.59 కోట్లకు చేరింది. ఆదాయం, లాభాల పరంగా కంపెనీకి ఇది అత్యుత్తమ త్రైమాసికమని తాజ్ జీవీకే హోటల్స్ చైర్మన్ జీవీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్



1282 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకారంతో సోమవారం రాకెట్‌లా దూసుకెళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ.. మంగళవారం అంతే వేగంతో కిందికి జారాయి. ఐటీ, ఆటో, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం ఇందుకు కారణం. సెన్సెక్స్ 1,281.68 పాయింట్లు క్షీణించి 81,148.22 వద్దకు పడిపోగా.. నిఫ్టీ 346.35 పాయింట్లు పతనమై 24,578.35 వద్ద ముగిసింది. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.46 లక్షల కోట్లు తగ్గి రూ.431.10 లక్షల కోట్లకు జారుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టపోయాయి. బడా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు కొంత మేర కొనుగోళ్ల మద్దతు లభించింది. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.99 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 శాతం పెరిగాయి.

● వరుసగా 22 సెషన్లపాటు లోయర్ సర్క్యూట్ స్థాయికి (రోజూ 5 శాతం చొప్పున క్షీణత) పతనమవుతూ వచ్చిన జెన్‌సోల్ ఇంజనీరింగ్ షేరు మంగళవారం 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.57.28 వద్దకు చేరింది. కంపెనీ నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో సెబీ నిషేధం ఎదుర్కొంటున్న జెన్‌సోల్ ప్రమోటర్లు అన్‌మోల్‌సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ కంపెనీ పదవులకు రాజీనామా చేయడంతో షేర్ల వరుస పతనానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది.

● విద్యుత్ వాహనాల తయారీ సంస్థ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం లభించింది. ఈ కంపెనీ ఐపీఓ ద్వారా రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 18.9 కోట్ల షేర్లను సైతం విక్రయించనుంది.

చైనా రక్షణ రంగ షేర్లు ఢమాల్

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదరడంతో పాక్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్న చైనా రక్షణ రంగ కంపెనీల షేర్లు 9 శాతం వరకు క్షీణించాయి. దాంతో హాంగ్‌సెంగ్ చైనా ఏ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ఇండెక్స్ 2.9 శాతం పతనమైంది. సూచీలోని ఏవీఐసీ చెంగ్డు ఎయిర్‌క్రాఫ్ట్ అత్యధికంగా 9.2 శాతం నష్టపోయింది.

పేటీఎంలో 4 శాతం వాటా విక్రయించిన యాంట్ గ్రూప్

చైనా ఫిన్‌టెక్ దిగ్గజం యాంట్ గ్రూప్.. పేటీఎంలో 4 శాతం వాటాను రూ.2,013 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా 4 శాతం వాటాకు సమానమైన 2.55 కోట్లకు పైగా షేర్లను ఉపసంహరించుకుంది. తదనంతరం పేటీఎంలో యాంట్ గ్రూప్ వాటా 9.85% నుంచి 5.85 శాతానికి తగ్గింది.

బీఓఐలో 8.38 శాతానికి ఎల్ఐసీ వాటా

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బీమా దిగ్గజం ఎల్ఐసీ వాటా 8.38 శాతానికి పెరిగింది. 2021 సెప్టెంబరు 2 నుంచి 2025 మే 9 మధ్యలో తమ బ్యాంక్‌కు చెందిన 2.026 కోట్ల షేర్లను ఎల్ఐసీ కొనుగోలు చేసిందని బీఓఐ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు మంగళవారం వెల్లడించింది. దాంతో ఈ నాలుగేళ్లలో బీఓఐలోని ఎల్ఐసీ వాటా 6.35 శాతం నుంచి 8.38 శాతానికి చేరుకుంది. బీఎస్ఈలో బీఓఐ షేరు 2.27 శాతం పెరిగి రూ.112.55 వద్ద ముగిసింది.

విశాఖలో జిప్సమ్ ప్లాస్టర్ తయారీ ప్లాంట్


కోరమాండల్, సకర్ణి గ్రూప్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫాస్ఫో జిప్సమ్ ఆధారిత హరిత భవన సామగ్రి తయారీ, విక్రయం కోసం సకర్ణి ప్లాస్టర్‌తో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసుకునేందుకు కోరమాండల్ కెమికల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జేవీలో భాగంగా విశాఖపట్టణంలోని కోరమాండల్ ఫెర్టిలైజర్ ప్లాంట్‌కు సమీపంలోనే జిప్సమ్ ప్లాస్టర్ తయారీకి ఒక అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. ఎరువుల తయారీ ద్వారా అందుబాటులోకి వచ్చే అనుబంధ ఉత్పత్తి జిప్సమ్ ఈ ప్లాంట్‌కు ముడిసరకుగా ఉపయోగపడుతుంది. కేంద్రప్రభుత్వ సర్క్యులర్ ఎకానమీ లక్ష్యాలకు దీటుగా సుస్థిర హరిత భవన ఉత్పత్తుల తయారీ కోసం దేశంలో ఏర్పాటవుతున్న తొలి భారీ వెంచర్ ఇదే. కోరమాండల్ గ్రూప్ వ్యవసాయ ఉపకరణాల వ్యాపార విభాగం నుంచి తన పరిధిని విస్తరించుకుని ఇతర వ్యాపార విభాగాల్లోకి ప్రవేశించేందుకు, తద్వారా దీర్ఘకాలిక విలువ సృష్టించేందుకు ఈ ఒప్పందం సహాయకారి అవుతుంది. అలాగే సాకర్ణి గ్రూప్ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరించి సరికొత్త మార్కెట్లలోకి విస్తరించేందుకు, జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుంది. వేగంగా విస్తరిస్తున్న జిప్సమ్ ప్లాస్టర్ పరిశ్రమలోని అవకాశాలను రెండు కంపెనీలు కైవసం చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది. కోరమాండల్ తయారీ సామర్థ్యాలు, సకర్ణి మార్కెట్ ఆధిపత్యం రెండింటినీ ఉపయోగించుకోవడం ద్వారా వేగంగా విస్తరిస్తున్న గృహనిర్మాణం, మౌలిక వసతుల రంగాలకు అత్యున్నత నాణ్యత గల, పర్యావరణ మిత్రమైన జిప్సమ్ సొల్యూషన్లు అందుబాటులోకి తేగలుగుతామని కోరమాండల్ ఇంటర్నేషనల్ సీఈఓ శంకర సుబ్రమణియన్ అన్నారు.

పవర్‌మెక్‌కు తెలంగాణ ప్రభుత్వ సంస్థ ప్రాజెక్టు


న్యూఢిల్లీ: పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ తెలంగాణ పవర్ జెనరేషన్ కార్పొరేషన్ నుంచి ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం కోసం రూ.971.98 కోట్ల ఆర్డర్ సాధించింది. స్థలం స్వాధీనం చేసుకున్న నాటి నుంచి 30 నెలల కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా తాము నల్గొండ జిల్లాలోని దామరచెర్లలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వద్ద టౌన్‌షిప్ నిర్మించాల్సి ఉంటుందని పవర్‌మెక్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




14వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	500
చిత్తూరు	593	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	124
కర్నూలు	115	నెల్లూరు	129
విశాఖపట్నం	116	అనంతపురం	129
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,620 ▼	87,650 ▼	1.09,000 ▼
విజయవాడ	97,500 ▲	92,000 ▼	99,650 ▲
విశాఖపట్నం	97,080 ▲	88,550 ▼	1.09,000 ▼
రాజమండ్రి	96,600 ▼	88,550 ▲	97,900 ▼
ప్రొద్దుటూరు	95,500 ▼	87,860 ▼	99,000 ▲
ముంబై	94,340 ▲	86,420 ▲	96,820 ▲

ఎయిర్‌టెల్ లాభం ఐదింతలు

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసికంలో రూ.47,876.2 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.11,022 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 27 శాతం, నికర లాభం 432 శాతం పెరిగాయి. గత ఏడాది జూలై మొదటి వారంలో ప్రకటించిన టారిఫ్‌ల పెంపు ఇందుకు బాగా దోహదం చేసిందని కంపెనీ తెలిపింది. దీంతో ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం 17 శాతం పెరిగి రూ.245కు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా ఎయిర్‌టెల్ రూ.1,72,985.2 కోట్ల ఆదాయంపై రూ.33,556 కోట్ల నికర లాభం ప్రకటించింది. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.16 చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

టాటా మోటార్స్ లాభం 51% క్షీణత

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ లాభాలకు నాలుగో త్రైమాసికంలో లాభాలకు భారీగా గండి పడింది. ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.8,556 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 51 శాతం తక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం రూ.1,19,033 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.1,19,503 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.6 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

పెరిగిన సువెన్ లైఫ్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సువెన్ లైఫ్ సైన్సెస్ నష్టాలు మార్చి త్రైమాసికంలో మరింత పెరిగాయి. గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోల్చితే కన్సాలిడేటెడ్ నష్టం రూ.26.54 కోట్ల నుంచి రూ.43.95 కోట్లకు పెరిగింది. ఖర్చులు రూ.34.21 కోట్ల నుంచి రూ.46.63 కోట్లకు చేరడంతో కంపెనీ ఆదాయం సైతం రూ.2.39 కోట్ల నుంచి రూ.1.47 కోట్లకు పడిపోయింది.

టాప్‌గేర్‌లో హీరో మోటో లాభాలు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగో త్రైమాసికానికి రూ.1,169 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 24 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.9,794 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు బాగుండంతో వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.65 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 3,250 శాతానికి సమానం.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో బాలికలదేపై చేయి

న్యూఢిల్లీ, మే 13: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో 93 శాతం, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం విడుదలైన ఈ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. 12వ తరగతి పరీక్షల్లో బాలికలు 91.64 శాతం మంది , బాలురు 85.70 శాతం మంది పాస్ అయ్యారు. దేశవ్యాప్తంగా విజయవాడ రీజియన్‌లో అత్యధికంగా 99.60 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, తిరువనంతపురం రెండో స్థానంలో నిలిస్తే, ప్రయాగ్‌రాజ్ రీజియన్ పరిధిలో అతి తక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 99.9 శాతం పాసైతే, ప్రైవేటు, ఇండిపెండెంట్ స్కూళ్లలో 87.94 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 16,92,794 మంది 12వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డివిజన్లు ఇవ్వడం లేదన్న సీబీఎస్‌ఈ పరీక్షల నియంత్రణాధికారి సాన్యం భరద్వాజ.. అత్యధిక మార్కులు సాధించిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ.. కేవలం ఒక్క పరీక్ష మాత్రమే వారి శక్తి, సామర్థ్యాలను నిర్వచించలేదని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సీబీఎస్‌ఈ స్టేట్ టాపర్ లాస్య రెడ్డి



పత్తికొండ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన లాస్య రెడ్డి 496/500 మార్కులతో స్టేట్ టాపర్‌గా, జాతీయ స్థాయిలో మూడోస్థానంలో నిలిచారు. పత్తికొండకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి, శిరీషారెడ్డి దంపతుల మొదటి కుమార్తె లాస్య రెడ్డి కర్నూలులోని శ్రీచైతన్య కట్టమంచి పాఠశాల విద్యార్థిని. శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్‌బాబు, ఆర్ఐ రంగారెడ్డి, ప్రిన్సిపాల్ కీర్తి, డీన్ పవన్ కుమార్ తదితరులు విద్యార్థినిని అభినందించారు. ఐఏఎస్ కావాలన్నది తన లక్ష్యం అని లాస్య రెడ్డి తెలిపింది.

సుప్రీంకోర్టుకు జల జగడం!

» తెలంగాణ, ఏపీ వ్యాజ్యాలపై నేడు, రేపు విచారణ

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జల వివాదాలకు సంబంధించిన కీలక కేసులు బుధ, గురువారాల్లో సుప్రీం కోర్టు ముందుకు రానున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో గోదావరి, కృష్ణా నది జలాల యాజమాన్య బోర్డులను నియమించారు. వీటిలో కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తుది తీర్పు అమల్లోకి రానందున కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)ను తాము గుర్తించడం లేదని సుప్రీం కోర్టులో తెలంగాణ పిటిషన్ వేసింది. కేఆర్ఎంబీని రద్దుచేయాలని అభ్యర్థించింది. దీనిపై బుధవారం సుప్రీంకోర్టు తెలంగాణ, ఏపీల వాదనలను విననుంది. దిగువ రాష్ట్రాలకు జలాలు ఉపయోగపడే సమయంలోనే ఎగువ రాష్ట్రాలు జల విద్యుదుత్పత్తిని చేయాలన్న నిబంధనను ఉల్లంఘిస్తూ.. ఏపీకి నీటి అవసరాలు లేని సమయంలో జల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ జలాలను దిగువకు వదిలేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని సుప్రీంకోర్టులో ఏపీ వ్యాజ్యం వేసింది. సాగర్, శ్రీశైలం జలాశయాల్లో విద్యుత్ ఉత్పత్తిపై ఆంక్షలు విధించాలని వ్యాజ్యంలో కోరింది. బుధవారం ఈ వ్యవహారంపై ఏపీ వాదనలు వినిపించనుంది.

గోవాలో అణువిద్యుత్ ప్లాంటుపై రగడ

పనాజీ, మే 13: గోవాలో అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య వివాదం రాజుకుంది. కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్ ఈ అంశంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్, మంత్రులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో ప్రత్యామ్నాయం లేకనే గోవాలో అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు పరిశీలన జరుపుతున్నామన్నారు. ఈ ప్రతిపాదనను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ పట్కర్ చెప్పారు. ఆప్ గోవా అధ్యక్షుడు అమిత్ పాలేకర్ కూడా ప్లాంటు ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకించారు.

అమెరికా-సౌదీ మధ్య భారీ ఆయుధ ఒప్పందం

రూ.12లక్షల కోట్ల విలువైన ఆయుధాలు పంపిణీ చేయనున్న అమెరికా

రియాద్, మే 13: అమెరికా, సౌదీ అరేబియా మధ్య భారీగా ఆయుధాల సరఫరా ఒప్పందం జరిగింది. మధ్య ప్రాచ్యంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మంగళవారం సౌదీ అరేబియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ట్రంప్, సౌదీ రాజు ప్రిన్స్ సల్మాన్ సమక్షంలో ఇరు దేశాల అధికారులు పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు. సౌదీ అరేబియాకు దాదాపు 142 బిలియన్ డాలర్ల(రూ.12లక్షల కోట్లకు పైనే) విలువైన ఆయుధాల సరఫరాకు ఒప్పందం కుదిరిందని వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికాలోని ఏఐ, ఇంధన మౌలిక వసతుల రంగంలో సౌదీ కంపెనీ 'డేటా ఓల్ట్'.. 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నదని పేర్కొంది. గాజాలో యుద్ధం, ఇరాన్ అణ్వస్త్రాల తయారీతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. ట్రంప్ తన పర్యటనలో ద్వైపాక్షిక బంధం బలోపేతం చేసుకోవడంతోపాటు సౌదీ అరేబియాకు భారీగా ఆయుధాలు సరఫరా చేసేందుకు అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. మంగళవారం రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ట్రంప్‌కు సౌదీ రాజు ప్రిన్స్ స్వయంగా స్వాగతం పలికారు. ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక చర్చల అనంతరం ఆల్ యమమాహ్ ప్యాలెస్ రాయల్ కోర్టులో ట్రంప్ బృందానికి విందునిచ్చారు. సౌదీ అరేబియాతోపాటు ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఐ) దేశాల్లోనూ ట్రంప్ పర్యటించనున్నారు.

ఫ్రీగా విమానం ఇస్తే.. వద్దనేందుకు మూర్ఖుడినా: ట్రంప్



అత్యంత ఖరీదైన, విలాసవంతమైన జంబోజెట్ విమానం ఉచితంగా ఇస్తే తిరస్కరించేందుకు నేనేమైనా పిచ్చోడినా? అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. త్వరలో మధ్య ప్రాచ్యంలో పర్యటించనున్న ట్రంప్ కోసం విలాసవంతమైన 747-8 జంబోజెట్ విమానాన్ని ఖతార్ రాజప్రాసాదం బహుమతిగా ఇచ్చింది. ట్రంప్ స్వీకరించారు కూడా. ఈ విమానానికి కొన్ని హంగులు అద్ది.. తాను 2029లో పదవీ విరమణ చేసేదాకా అధ్యక్ష విమానమైన ఎయిర్‌ఫోర్స్ వన్‌కు బదులుగా ఉపయోగించాలనే ప్రణాళికతో ట్రంప్ ఉన్నారు. దీనిపై డెమోక్రాట్లు విమర్శలు గుప్పించగా ట్రంప్ పై విధంగా స్పందించారు.

పంజాబ్‌లో కల్తీ మద్యం తాగి

17మంది మృతి

చండీగఢ్, మే 14: పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో కల్తీ మద్యం తాగి మంగళవారం 17మంది చనిపోయారు. ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చనిపోయినవారిలో ఎక్కువ మంది రోజువారీ కూలీలు ఉన్నారు. జిల్లాలోని భంగాళీ, పాతల్‌పురి, మరారీకలాన్, థేరేవాల్ గ్రామాల్లో సోమవారం రాత్రి పలువురు కల్తీ మద్యం తాగినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. మరణాలపై పంజాబ్ సీఎం భగవంత్ మాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇవి మరణాలు కావు. హత్యలు. బాధ్యులను వదిలిపెట్టబోం. కఠినంగా శిక్షిస్తాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

బుర్కినాఫాసోలో జిహాదీ

దాడి..100 మంది మృతి

బమాకో, మే 13: పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినాఫాసో ఉత్తర ప్రాంతంలో ఆల్‌ఖైదా అనుబంధ జిహాదీ సంస్థ ఆదివారం తెల్లవారుజామున జరిపిన వేర్వేరు దాడుల్లో వంది మందికి పైగా మృత్యువాత పడ్డారు. మృతుల్లో అత్యధికులు సైనికులు, సహాయ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారని అసోసియేట్ ప్రెస్ సోమవారం తెలిపింది. ఈ దాడికి తమదే బాధ్యత అని ఆల్‌ఖైదా అనుబంధ జమాత్ నాజర్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమీన్ (జేఎన్ఐఎం) ప్రకటించుకున్నది.

మేమూ అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తాం

» డబ్ల్యూటీవోకు భారత్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 13: నూతన వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అమెరికాకు చెందిన కొన్ని వస్తువులపై తామూ ప్రతీకార సుంకాలను విధిస్తామని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)కు భారత్ తెలియజేసింది. స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని అమెరికా 25 శాతానికి పెంచడంతో తాము కూడా దిగుమతి సుంకాల పెంపునకు సిద్ధమయ్యామని వెల్లడించింది. అమెరికా నుంచి భారత్‌కు అయ్యే 7.6 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై ఈ ప్రతిపాదన ప్రభావం చూపనుంది. ఈ మేరకు మే 9న భారత్ నుంచి డబ్ల్యూటీవోకు ప్రతిపాదన వెళ్లింది. ఆ రోజు నుంచి 30 రోజుల తర్వాత కొత్త సుంకాలు అమలులోకి వస్తాయని ఆ ప్రతిపాదనల్లో భారత్ పేర్కొంది. అలాగే, అమెరికా తీసుకుంటున్న చర్యలు గాట్-1994(జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్), ఏవోఎస్(అగ్రిమెంట్ ఆన్ సేఫ్‌గార్డ్స్) ఒప్పందాలకు వ్యతిరేకమని భారత్ తెలిపింది. ఏవోఎస్‌లోని ఆర్టికల్ 12.3 ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సిన సంప్రదింపులు జరపకుండా అమెరికా చర్యలు తీసుకోవడంతో ప్రతిచర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని డబ్ల్యూటీవోకు భారత్ వెల్లడించింది. నిజానికి, 2018లో తొలిసారి దేశ అధ్యక్షుడైన ట్రంప్.. అప్పట్లో స్టీల్, అల్యూమినియం దిగుమతులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించారు. మళ్లీ, రెండోసారి అధికారం చేపట్టిన ట్రంప్ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై సుంకాన్ని 25 శాతానికి పెంచారు. మార్చి నుంచి ఈ సుంకాలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. అంతేకాక, దేశాల వారీగా, ప్రత్యేక ఉత్పత్తులపై ఇచ్చే మినహాయింపులను ఎత్తివేశారు. ఈ అధిక టారిఫ్ అంశంపై భారత్ ఏప్రిల్‌లోనే చర్చలకు ప్రయత్నించగా అమెరికా తిరస్కరించింది.

రిటైర్మెంట్ తర్వాత ఏ పదవీ తీసుకోను

(మొదటి పేజీ తరువాయి)



జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కలిసి ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా విధులు నిర్వర్తించారు. అనంతరం, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తనకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు విలువలను, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, మౌలిక రాజ్యాంగ నిబంధనలను కొత్త ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ కచ్చితంగా నిలబెడతారని తాను నమ్ముతున్నానన్నారు. 'జస్టిస్ గవాయ్, నేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఒకే ఏడాది పదోన్నతి పొందాం. ప్రస్తుతం కొలీజియంలో ఉన్నాం. పలు సందర్భాల్లో మేం పరస్పరం చర్చించుకున్నాం. జస్టిస్ గవాయ్ నాకు అత్యంత బలమైన మద్దతుదారుగా నిలిచారు' అని వెల్లడించారు. న్యాయమూర్తిగా తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయని, వాటిని జీవితాంతం గుర్తుంచుకుంటానన్నారు. న్యాయవ్యవస్థ అంటే న్యాయమూర్తులు మాత్రమే కాదని, బార్ (న్యాయవాదులు) కూడా దాంట్లో భాగమని, ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచేలా చేయటంలో న్యాయవాదుల పాత్ర కూడా కీలకమని తెలిపారు. విభిన్న ప్రాంతాలకు చెందిన న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ఉండటంపై జస్టిస్ ఖన్నా హర్షం వ్యక్తం చేశారు. 'దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన జడ్జిలు ఉండటం వల్ల సుప్రీంకోర్టుకు ఎనలేని బలం చేకూరింది. వేర్వేరు నేపథ్యాలు, వేర్వేరు ఆలోచనా ధోరణులు గల న్యాయమూర్తుల మధ్య జరిగిన చర్చలు పలు రకాల పరిష్కారాలను, సరైన మార్గాన్ని చూపాయి' అని ఆయన వెల్లడించారు. జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, '1976 నాటి ఏడీఎం జబల్‌పూర్ కేసులో జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా ఒక్కరే మైనారిటీ తీర్పునిచ్చారు. నాటి ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ హక్కుల కోసం నిలబడ్డారు. ఆయన సోదరుడి కుమారుడైన జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. తన పెద్దనాన్న వారసత్వాన్ని నిలబెట్టటమే కాదు, న్యాయవ్యవస్థ మీద తనదైన సొంత ముద్ర వేశారు' అని శ్లాఘించారు. జస్టిస్ ఖన్నాలో ఉండే స్పష్టత, నైతికనిష్ఠ, ఆయన ఇచ్చిన తీర్పులు రాజ్యాంగ విలువలకు అద్దం పడుతాయన్నారు. సుప్రీంకోర్టు ప్రతిష్ఠను జస్టిస్ ఖన్నా మరింత పెంచారని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. 'న్యాయం పట్ల మీకున్న అంకితభావం, మీరు చూపిన పారదర్శకత, యువ న్యాయవాదులకు ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనివి. కొత్తతరాలకు మీరొక ప్రమాణాన్ని నిర్దేశించారు. నాడు జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా ఇచ్చిన మైనారిటీ తీర్పే నేడు అంతటా ప్రతిధ్వనిస్తోంది. మెజారిటీ తీర్పును అందరూ మర్చిపోయారు. జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా సృష్టించిన ఆ జ్వాలను మీరు ముందుకు తీసుకెళ్లారు' అంటూ జస్టిస్ సంజీవ్‌ఖన్నా సేవలను కపిల్ సిబల్ కొనియాడారు.

చిత్రజ్యోతి

★SINCE 1965★

రికార్డు స్థాయిలో..



కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. 38 ఏళ్ల తర్వాత కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు అనుగుణంగానే ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేస్తూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా నాన్ థియేట్రికల్ బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగినట్లు కోలీవుడ్ కథనాలు తెలియజేస్తున్నాయి. ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సంస్థ నూట యాభై కోట్ల రూపాయలతో, అలాగే ఓ తమిళ్ స్టార్ హీరోకు చెందిన టెలివిజన్ సంస్థ శాటిలైట్ రైట్స్ కోసం అరవై కోట్ల రూపాయలతో డీల్ కుదుర్చుకున్నట్లు కోలీవుడ్ మీడియా పేర్కొంది. కాగా, ఈ చిత్రం జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో త్రిష కథానాయికగా నటించారు. శింబు, అభిరామి, జోజు జార్జ్ కీలక పాత్రలు పోషించారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

'మహాకాళి'తో తెలుగులో తొలి అడుగు




'ఛావా' చిత్రంలో ఔరంగజేబుగా అద్భుతంగా నటించి అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా. ఆ సినిమా తర్వాత ఆర్టిస్ట్‌గా ఆయనకు డిమాండ్ బాగా పెరిగింది. నిర్మాతల తాకిడి ఎక్కువైంది. అక్షయ్ తదుపరి చిత్రం ఏమిటాని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణంలో 'మహాకాళి' తెలుగు చిత్రం అంగీకరించి అందరినీ ఆశ్చర్యపరిచారు అక్షయ్. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ పతాకంపై ప్రశాంత్ వర్మ ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో కాన్సెప్ట్‌తో నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంతకుముందు 'మార్టిన్ లూథర్‌కింగ్' చిత్రాన్ని రూపొందించిన పూజ కొల్లూరు ఈ సినిమాకు దర్శకురాలు. సోమవారం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ఈ సినిమాలో 'మహాకాళి' పాత్రను పోషించే స్టార్ హీరోయిన్ కోసం ప్రస్తుతం అన్వేషణ సాగుతోంది.



ఆదరణ అపూర్వం

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం 'రామ రామ' అంటూ శ్రీరాముని కీర్తిస్తూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. ఆ పాటకు చక్కటి ప్రేక్షకాదరణ దక్కుతోందని చిత్రబృందం తెలిపింది. 'రామ రామ' గీతాన్ని అమితంగా ఆదరిస్తున్న సంగీత ప్రియులకు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా మంగళవారం విశ్వంభర కొత్తపోస్టర్‌ను విడుదల చేసింది. అందులో చిరు తనదైన శైలిలో ఉల్లాసంగా స్టెప్పులేస్తూ కనిపించారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికి రంగనాథ్ కథానాయికలు. కునాల్‌కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సంగీతం: ఎం.ఎం. కీరవాణి, సినిమాటోగ్రఫీ: చోటా కె నాయుడు

రామ్‌చరణ్‌పై డాక్యుమెంటరీ



'చిరుత'తో తొలి అడుగులు వేసిన రామ్‌చరణ్.. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ స్టార్‌గా ఎదిగారు. మెగా స్టార్ చిరంజీవి తనయుడిగా ఇండస్ట్రీలోకి ప్రవేశించినా.. స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. ఇటీవలె లండన్‌లోని మేడమ్ టుస్సాడ్‌లో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ రామ్‌చరణ్‌పై ఓ డాక్యుమెంటరీని రూపొందించే పనిలో ఉన్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో రామ్‌చరణ్ ప్రస్థానాన్ని ఇందులో చూపించబోతున్నారు. ఈ డాక్యుమెంటరీలో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు రామ్‌చరణ్‌పై తమ అభిప్రాయాలు పంచుకోనున్నారు. చిరంజీవితోపాటు సుకుమార్, రాజమౌళి, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ తదితరులు ఈ డాక్యుమెంటరీలో కనిపించే అవకాశం ఉందని, ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు మొదలయ్యాయని బీటౌన్‌లో టాక్ వినిపిస్తోంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రం తెరవెనుక విశేషాలను కూడా డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం.

నా కల నెరవేరింది

అదితి శంకర్




'తెలుగు సినిమాల్లో నటించాలనే నా కల 'భైరవం'తో నెరవేరింది. ఇందులో బోల్డ్ అండ్ హానెస్ట్ క్యారెక్టర్ చేశాను. సినిమా తప్పకుండా అందరినీ అలరిస్తుంది' అని అన్నారు కథానాయిక అదితి శంకర్. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఆమె నటించిన చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈనెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. 'నేను తమిళంలో చేసిన తొలి సినిమాను డైరెక్టర్ విజయ్ చూశారు. 'భైరవం'లో క్యారెక్టర్‌కు సరిపోతానని భావించి కాల్ చేసి ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. ఇందులో నేను పోషిస్తున్న పాత్ర నా ఒరిజినల్ క్యారెక్టర్‌కి దగ్గరగా ఉంటుంది. ఇంత మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. మంచు మనోజ్, సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ముగ్గురికీ తమిళ్ మాట్లాడడం వచ్చు. అందువల్ల వారితో నా జర్నీ చాలా సౌకర్యవంతంగా సాగింది. శ్రీచరణ్ అద్భుతమైన సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. త్వరలో మరో పాట కూడా రాబోతుంది. ఆర్టిస్టుల నుంచి ఎలాంటి నటనను రాబట్టుకోవాలో డైరెక్టర్ విజయ్ కనకమేడలకి బాగా తెలుసు. ఆయన విజన్ ఉన్న దర్శకుడు. హిస్టారికల్, పీరియాడిక్ సినిమాలు చేయాలనేది నా కోరిక' అని అన్నారు.

తమ్ముడి మూడ్



నితిన్ కథానాయకుడిగా వేణు శ్రీరామ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమాలోని కీలక పాత్రలను, వారి పేర్లను పరిచయం చేస్తూ 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అనే వీడియోను విడుదల చేశారు మేకర్స్. అగర్వాల్‌గా సౌరభ్ సచ్‌దేవ్, రత్నగా సప్తమి గౌడ, ఝాన్సీ కిరణ్మయిగా లయ, చిత్రగా వర్ష బొల్లమ్మ నటిస్తున్నారు. భారతీయ జెర్సీ వేసుకున్న నితిన్.. బాణాన్ని లక్ష్యానికి గురిపెడుతూ ఉన్న విజువల్స్ చూస్తుంటే ఇందులో ఆయన విలువిద్య క్రీడాకారుడి పాత్రను పోషిస్తున్నట్టు తెలుస్తోంది. వీడియోలో వీరిని పరిచయం చేసిన విధానం ఆసక్తికరంగా ఉండి, సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, డీఓపీ: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

ప్రేక్షకులను ఆకట్టుకునేలా..



సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'త్రీబీహెచ్‌కే'. అరుణ్ విశ్వశాంతి నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. జూలై 4న విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని తమ కుటుంబంతో ఆనందకర క్షణాలను ఆస్వాదిస్తూ కనిపించారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించామని మేకర్స్ తెలిపారు.

బాలల కోసం త్రీడీ చిత్రం



ఈగ ప్రధాన పాత్రధారిగా రూపొందిన బాలల త్రీడీ చిత్రం లవ్లీ. మాథ్యూ థామస్ ప్రధాన పాత్ర పోషించారు. దిలీప్ కరుణాకరన్ దర్శకుడు. శరణ్య నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ మంగళవారం తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. విష్ణు విజయ్ సంగీతం అందించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆషిక్ అబూ

మ్యూజికల్ ఎంటర్‌టైనర్



కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. టాలీవుడ్ కథానాయిక శ్రీలీల ఈ చిత్రంతో బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నెలరోజులకు పైగా సాగిన సుదీర్ఘ షెడ్యూల్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సెట్‌లో దిగిన ఫొటోను కార్తీక్ ఆర్యన్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. చక్కని ప్రేమకథతో మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా అనురాగ్ బసు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

చివరిదశ పనుల్లో బార్బరిక్



సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవత్స తెరకెక్కిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. వశిష్ఠ.ఎన్.సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి ఆడిదాల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తై, ప్రస్తుతం చివరిదశ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిస్తుందని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: కుశేందర్ రమేశ్‌రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూజన్ బ్యాండ్.

త్వరలోనే బ్యాడ్‌బాయ్



హీరో నాగశౌర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. రామ్ దేశినా దర్శకత్వంలో శ్రీనివాస చింతలపూడి నిర్మిస్తున్నారు. విధి హీరోయిన్. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంది. సముద్రఖని, వీకె నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైందని మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వర రావు, డీఓపీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్.



అబద్ధాల ఫ్యాక్టరీ.. పాక్

'ఆపరేషన్ సిందూర్'పై తప్పుడు సమాచారం.. పాక్ ఆర్మీ అధికారుల నోట అబద్ధాలే అబద్ధాలు

(సెంట్రల్ డెస్క్)

నోరు తెరిస్తే అబద్ధాలు..! తిమ్మిని బమ్మి చేసే ప్రయత్నాలు..! నిజం గడప దాటేలోపు.. అబద్ధాన్ని విశ్వవ్యాప్తం చేయడం..! ఈ జాతీయాలన్నీ దాయాదీ దేశం పాకిస్థాన్‌కు అచ్చంగా నప్పుతున్నాయి. గతంలోనే కాదు.. 'ఆపరేషన్ సిందూర్'పైనా పాకిస్థాన్ అసత్యాలను ప్రచారం చేసింది. అవన్నీ అబద్ధాలేనని భారత ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ)తోపాటు.. ఫ్యాక్ట్‌చెక్కర్లు తేల్చిచెప్పారు. తాము భారత్‌కు చెందిన 20 వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని, దాంతో భారత్ కాల్పుల విరమణకు ప్రతిపాదించిందని స్వయానా పాక్ ఆర్మీకి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డీజీ పేర్కొన్నారు. తమ దాడుల్లో అదంపూర్ ఎయిర్‌బేస్ రన్‌వే ధ్వంసమైందని, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని చెప్పారు. ప్రధాని మోదీ మంగళవారం స్వయంగా అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లి.. రన్‌వేపై సైనికులతో మాట్లాడారు. ఆ వెనకాలే ఎస్-400 వ్యవస్థ కనిపించింది. ఈ నేపథ్యంలో.. పాక్ అబద్ధాలపై ప్రత్యేక కథనం..

వైమానిక దాడులపైనా

'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిఘటనగా తామూ వైమానిక దాడులు జరిపినట్లు ఐఎస్‌పీఆర్ ప్రకటించింది. అందుకు సంబంధించినదిగా చెబుతూ పాకిస్థానీ మీడియాకు వీడియోలను షేర్ చేసింది. పాకిస్థాన్ మీడియా వాటిని ప్రసారం చేసింది. అయితే.. జర్మనీకి చెందిన వార్తా సంస్థ డీడబ్ల్యూ అవి తప్పుడు వీడియోలు అంటూ కథనాన్ని ప్రచురించింది. పాక్ సైన్యం షేర్ చేసిన ఫుటేజీ 2023లో హమాస్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులకు సంబంధించినదని తేల్చిచెప్పింది. ఏఎఫ్‌పీ వార్తా సంస్థ కూడా ఆ ఫుటేజీని తొలుత షేర్ చేసి, ఆ తర్వాత ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇక, పాక్, పీవోకేలో భారత్ జరిపిన దాడుల్లో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియల్లో సైనికాధికారులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో ఉగ్రవాది హఫీజ్ రవూఫ్ ముందు వరసలో నిల్చున్నాడు. అయితే.. అతను ఉగ్రవాది కాదని, సామాన్య పౌరుడని ఐఎస్‌పీఆర్ డీజీ విలేకరులకు తెలిపారు. దీన్ని పీఐబీ ఎండగట్టింది. అతను కరడుగట్టిన ఉగ్రవాది అని పేర్కొనే ఆధారాలను ఎక్స్‌లో పోస్టు చేసింది.



ఉదమ్‌పూర్ ఎయిర్‌బేస్ ధ్వంసమైనట్లు చూపుతున్న ఫేక్ ఫొటో.. అంతా సేఫ్ అంటున్న మాక్సర్ ఉపగ్రహ చిత్రం



మన డ్రోన్లను కూల్చేశారట!

పాకిస్థాన్ ఎయిర్ బేస్‌లపై భారత్ ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటాక హరూప్ డ్రోన్లతో దాడి చేసిన విషయం తెలిసిందే..! 10వ తేదీ ఉదయం తమ వైమానిక రక్షణ వ్యవస్థలు 26 భారత డ్రోన్లను కూల్చేశాయని, భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూడా ధ్వంసం చేశామని పాక్ ఆర్మీ ప్రకటించింది. ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా దీనిపై ప్రకటనలు చేశారు. నిజానికి హరూప్ 'సూసైడ్ డ్రోన్' రకానికి చెందినవి. ఇవి తమ లక్ష్యాలను ఛేదించేందుకు పేలిపోతాయి. సోమవారం నాటి భారత డీజీఎంవోల ప్రెస్‌మీట్‌లో.. పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసినట్లు శాటిలైట్ చిత్రాలతో సహా ఆధారాలను చూపించారు. దీన్ని బట్టి.. సూసైడ్ డ్రోన్లు తమ పనిని పూర్తిచేశాక.. మిగిలిన శకలాలను సీజ్ చేసిన పాక్ ఆర్మీ.. వాటిని తాము కూల్చివేసినట్లు తప్పుగా క్లెయిమ్ చేసుకుంది.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం అక్కర్లేదు!

» ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ తన వైఖరి స్పష్టం చేసిన భారత్



రణధీర్ జైశ్వాల్

న్యూఢిల్లీ, మే 13: భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాదనను భారత్ ఖండించింది. అంతేకాదు, కశ్మీర్ అంశంలో మధ్యవర్తిత్వం వహిస్తామన్న ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చింది. ట్రంప్ వ్యాఖ్యలపై మంగళవారం విలేకరులు అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ బదులిస్తూ భారత్ వైఖరిని స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలు తప్ప ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని భారత్ అంగీకరించదని తేల్చి చెబుతూ ట్రంప్ ప్రతిపాదనను పరోక్షంగా తోసిపుచ్చారు. పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయాల్సిందేనని, ఈ డిమాండ్‌లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. కాల్పుల విరమణ, ద్వైపాక్షిక చర్చల కోసం పాకిస్థాన్ నుంచే భారత విదేశాంగ శాఖకు విజ్ఞప్తి వచ్చిందని తెలిపారు. కాల్పుల విరమణపై ఇరు దేశాల మధ్య డీజీఎంవోల స్థాయిలోనే చర్చలు జరిగాయని జైశ్వాల్ పేర్కొంటూ తన చొరవతోనే భారత్, పాక్ మధ్య యుద్ధం ఆగిందన్న ట్రంప్ ప్రకటనను కూడా పరోక్షంగా ఖండించారు. పాకిస్థాన్ దాడి చేస్తే.. భారత్ బదులిస్తుందని, పాకిస్థాన్ చేయకపోతే భారత్ కూడా చేయదని తెలిపారు. ఇదే విషయాన్ని పాక్ డీజీఎంవోకు తెలియజేశామని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి ఈ నెల 10 వరకు జరిగిన సైనిక చర్యలపై భారత్-అమెరికా మధ్య చర్చలు జరిగాయి. యుద్ధ వాతావరణంలోనే చర్చలు జరిగాయి తప్ప వాణిజ్య అంశాలు ప్రస్తావనకు రాలేదని తెలిపారు. పాక్‌లోని కిరానా అణు స్థావరాన్ని భారత్ క్షిపణులు తాకడంతో నష్టం జరిగిందన్న వార్తలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు జైశ్వాల్ స్పందిస్తూ.. దీనిపై పాకిస్థానే బదులివ్వాలన్నారు. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు నిలిపివేసే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి తీరుపై 70 దేశాల రక్షణ శాఖ ప్రతినిధులకు రక్షణ శాఖ నిఘా విభాగం డీజీ డీఎస్ రాణా వివరించారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని మాణిక్‌షా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి 7పెద్ద దేశాలతో పాటు ఇస్లామిక్ దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

2023 నాటి యుద్ధ నౌకల విన్యాసం

భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల ఐఎస్‌పీఆర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాక్ నేవీ అధికారి ఓ ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత నౌకాదళాన్ని కట్టడి చేయడానికి జలాంతర్గాములతో పాటు.. అరేబియా సముద్రంలో నౌకలను మోహరించామంటూ ఓ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ చిత్రంలో మూడు యుద్ధ నౌకలు, వాటిపై ఎగురుతున్న నిఘా విమానాలు ఉన్నాయి. నిజానికి ఆ ఫొటో 2023 నాటిదని ఫ్యాక్ట్‌చెక్కర్లు తేల్చారు. చైనా-పాకిస్థాన్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధనౌకల విన్యాసాల ఫొటో(ద యురేషియన్ టైమ్స్‌లో ప్రచురితమైంది)ను పాక్ నౌకాదళ అధికారి ప్రజెంటేషన్‌లో చూపించారని పేర్కొన్నారు.



భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నౌకాదళం దాడికి సిద్ధంగా ఉందని ఐఎస్‌పీఆర్ ప్రెస్‌మీట్‌లో చెబుతున్న పాక్ నేవీ అధికారి



2023లో చైనా-పాక్ సంయుక్తంగా నిర్వహించిన విన్యాసాల్లోని ఫుటేజీ ఇది.. ఇదే చిత్రాన్ని పాక్ నేవీ అధికారి ఐఎస్‌పీఆర్ ప్రెస్‌మీట్‌లో చూపించారు

పాక్ ఎయిర్‌బేస్‌ల పైనా అబద్ధాలే

పాకిస్థాన్‌లోని నూర్‌ఖాన్, రహీంయార్‌ఖాన్, సర్గోదా వంటి ఎయిర్‌బేస్‌లు ధ్వంసమైనట్లు భారతీయ మీడియా ఈనెల 10న కథనాలను ప్రసారం చేసింది. దాన్ని ఫేక్‌న్యూస్‌గా చెప్పిన ఐఎస్‌పీఆర్.. తమ వైమానిక స్థావరాలు సురక్షితంగా ఉన్నట్లు చెప్పింది. కానీ, మాక్సర్ ఉపగ్రహ చిత్రాల ఆధారంగా భారత మీడియా నిజమే చెబుతోందని ఫ్యాక్ట్‌చెక్కర్లు నిర్ధారించారు. సర్గోదా ఎయిర్‌బేస్ రన్‌వే 14/32, 06/12 వద్ద ధ్వంసమైన శాటిలైట్ చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. భోలారీ ఎయిర్‌బేస్‌లో విమానాల హ్యాంగర్ ధ్వంసమైన చిత్రాలను ప్రదర్శించారు. భారత డీజీఎంవోలు కూడా సోమవారం నాటి ప్రెస్‌మీట్‌లో వాటికి ఆధారాలను చూపించారు.

గూఢచర్యం ఆరోపణలతో పాక్ హైకమిషన్ అధికారిపై బహిష్కరణ

» 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని భారత్ ఆదేశం

న్యూఢిల్లీ, మే 13 : ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేస్తోన్న ఆ దేశ అధికారి ఒకరిని భారత్ మంగళవారం బహిష్కరించింది. ఆయన తన హోదాకు తగని విధంగా వ్యవహరిస్తుండడంతో 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. పంజాబ్ పోలీసులు విచారిస్తోన్న ఓ గూఢచర్యం కేసుకు సంబంధించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పంజాబ్ పోలీసులు ఆదివారం గూఢచర్యం ఆరోపణలపై ఒక మహిళ, మరో పురుషుడిని అరెస్టు చేశారు. వీరికి పాక్ హై కమిషన్ కార్యాలయంలోని ఆ అధికారితో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. భారత సైన్యం కదలికలపై వీరు పాక్‌కు సమాచారం చేరవేస్తున్నట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు.

బ్యాన్ తుర్కియే

» ఆ దేశం నుంచి వచ్చే యాపిల్స్ వద్దన్న పుణె వ్యాపారులు

మే 13: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ తుర్కియే పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం పట్ల దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యాయి. దేశవ్యాప్తంగా బ్యాన్ తుర్కియే ఉద్యమం ఊపందుకుంది. తాజాగా పుణెలో పలువురు వ్యాపారులు ఆ దేశం నుంచి వచ్చే యాపిల్స్‌ను పూర్తిగా బహిష్కరించారు. ప్రస్తుతం అక్కడి మార్కెట్లలో తుర్కియే నుంచి దిగుమతి అయిన యాపిల్స్ కనిపించడంలేదు. బదులుగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఇరాన్ దేశాల నుంచి వాటిని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఏటా పుణె మార్కెట్‌లో తుర్కియే నుంచి వచ్చిన యాపిల్స్ మార్కెట్ విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా.

సాంబా సెక్టార్‌లోకి ప్రవేశించింది పాక్ డ్రోన్లే

న్యూఢిల్లీ, మే 13 : జమ్మూ కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లోకి సోమవారం సాయంత్రం ప్రవేశించిన పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేశామని భారత ఆర్మీ మంగళవారం ప్రకటించింది. డ్రోన్ల ద్వారా ఎదురైన ముప్పుతో కొంత సమయం బ్లాక్ ఔట్ పాటించడం వల్ల ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొందని పేర్కొంది. సాంబా సెక్టార్‌లో సోమవారం సాయంత్రం కనిపించిన కొన్ని డ్రోన్లు మినహా మరే ప్రాంతంలోనూ పాక్ డ్రోన్ల కదలికలు రికార్డు కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

పహల్గాంపై రివ్యూకమిటీ వేయండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 13: పహల్గాం ఉగ్రదాడి ఘటనకు దారితీసిన కారణాలపై లోతైన అధ్యయనం కోసం రివ్యూ కమిటీని నియమించాలని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కార్గిల్ యుద్ధం ముగిసిన వెంటనే ఇలాంటి కసరత్తును అప్పటి వాజపేయీ ప్రభుత్వం చేసిందని ఏఐసీసీ సమాచార విభాగం ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. "కార్గిల్ యుద్ధం ముగిసిన మూడోరోజున, 1999 జూలై 29న, అప్పటి కేంద్ర ప్రభుత్వం కార్గిల్ రివ్యూ కమిటీని ఏర్పాటుచేసింది" అని వివరించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తండ్రి, వ్యూహాత్మక వ్యవహారాల గురు కె.సుబ్రహ్మణ్యం ఆ రివ్యూ కమిటీకి నాయకత్వం వహించారని జైరామ్ రమేశ్ తెలిపారు.



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో బీజేపీ దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ'లకు సోమవారం పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు మంగళవారం అహ్మదాబాద్‌లో భారీ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

మా సైనికులు 11 మంది చనిపోయారు

» 78 మంది గాయపడ్డారు: పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్, మే 13: భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో తమ స్క్వాడ్రన్ లీడర్ సహా 11 మంది సైనికులు చనిపోయారని, మరో 78 మంది గాయాలపాలయ్యారని పాక్ మిలటరీ ప్రకటించింది. అంతేకాక, మరో 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా 121 మంది గాయపడ్డారని పేర్కొంది. మృతుల్లో పాక్ వాయుసేనకు చెందిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్, చీఫ్ టెక్నీషియన్ ఔరంగజేబ్, సీనియర్ టెక్నీషియన్ నజీబ్ తదితరులు ఉన్నారని వెల్లడించింది. కాగా, రావల్పిండిలోని మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ మునీర్ సోమవారం స్వయంగా పరామర్శించారు. మరోపక్క, కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కట్టుబడి ఉన్నామని పాకిస్థాన్ మంగళవారం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రసంగిస్తూ మోదీ సోమవారం చేసిన వ్యాఖ్యలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించింది. కాల్పుల విరమణ కోరుతూ భారత్ వద్దకు పాకిస్థాన్ పరుగెత్తుకుంటూ వచ్చిందనేది మరో పచ్చి అబద్ధం అని ఆరోపించింది. మోదీ వ్యాఖ్యలు, భారత్ తీరు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచేలా ఉన్నాయని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

పహల్గాం ఉగ్రదాడి కుట్రదారు షాహిద్ కుట్టే హతం

» కశ్మీర్‌లోని షోపియాన్‌లో ఎన్‌కౌంటర్

» మరో ఇద్దరు ఉగ్రవాదులూ హతం

శ్రీనగర్, మే 13: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి కుట్ర పన్నిన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) కమాండర్ షాహిద్ కుట్టే హతమయ్యాడు. భద్రతా దళాలు జమ్ము, కశ్మీర్‌లోని షోపియాన్‌లో మంగళవారం ఆపరేషన్ కెల్లర్ పేరిట జరిపిన సోదాల్లో మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు హతమవ్వగా వారిలో ఒకరు షాహిద్ కుట్టే, మరొకరు అద్నాన్ షఫి అని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని షుక్రూ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై సమాచారం అందడంతో భద్రతా దళాలు అక్కడ సోదాలు చేపట్టాయి. ఆ సమయంలో ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో భద్రతా సిబ్బంది తిరిగి కాల్పులు జరపగా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. షోపియాన్ జిల్లా చోటిపోరా హీరాపోరా ప్రాంతానికి చెందిన షాహిద్ కుత్తే 2023 మార్చిలో లష్కరే తాయిబాలో చేరి కమాండర్‌గా ఎదిగాడు. ఇతడిని కేటగిరీ 'ఏ' ఉగ్రవాదిగా గుర్తించారు. ఇతడు పలు ఉగ్ర దాడులు, జాతి వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. షాహిద్ హీరాపోరాలో 2024 మే 18న బీజేపీకి చెందిన ఒక సర్పంచిని హత్య చేశాడు. కాగా షోపియాన్ జిల్లాలోని వందునా మెల్హోరా ప్రాంతానికి చెందిన షఫి 2024 అక్టోబరులో ఉగ్ర బాట పట్టాడు. అదే నెలలో షోపియాన్ జిల్లా వాచిలో స్థానికేతర కార్మికుల హత్యలో పాల్గొన్నాడు.

ఆపరేషన్ సిందూర్.. పాక్‌కు లక్ష్మణ రేఖ

(మొదటిపేజీ తరువాయి)

ధ్వంసం చేశామని, ఎస్400 రక్షణ వ్యవస్థను కూడా నాశనం చేశామని పాక్ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో పాక్ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలోని అదంపూర్ వైమానిక స్థావరానికి ప్రధాని మోదీ వెళ్లి, భద్రతా బలగాలతో మాట్లాడడం విశేషం. 'భారత్ మాతా కీ జై' అంటూ మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన బలగాలు చూపిన శక్తిసామర్థ్యాలను ఎంత ప్రశంసించినా తక్కువే. అణు బెదిరింపులను కూడా అపహాస్యం చేశాయి. భారతదేశ శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతా కీ జై నినాదం చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ గడ్డపై నుంచి వీర సైనికులందరికీ సెల్యూట్ చేస్తున్నా. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం, విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాడి నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం. మీరు చరిత్ర సృష్టించారు. నేను మీ ఆశీస్సుల కోసం వచ్చా"అని మోదీ ఉద్వేగంగా చెప్పారు.

భారత్‌పై కుట్రలు చేస్తే.. విధ్వంసమే

"మన త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టికరిపించాయి. భారత్‌పై పన్నాగాలు పన్నితే తమ విధ్వంసాన్ని కొనితెచ్చుకోవడమేనని ఉగ్రగురువులు గ్రహించారు. మన సైనిక శక్తి పాక్‌కు నిద్రపట్టనివ్వడం లేదు. ఆపరేషన్ సిందూర్ విషయంలో మానవ వనరుల శక్తి, యంత్రాలు, త్రివిధ దళాల మధ్య సమన్వయం అద్భుతం. మనం ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే.. పాక్ వాటిని కాపాడేందుకు పౌర విమానాలను పణంగా పెట్టింది. అమాయకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టివేసింది. అలాంటి పరిస్థితుల్లో దాడులు ఎంత కష్టమో నాకు తెలుసు. కానీ, మీరు అత్యంత కచ్చితంగా, పౌర విమానాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా.. కేవలం ఉగ్ర శిబిరాలపైనే అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశారు. మీరు చేసిన అద్భుతాన్ని చూసి నేను గర్వపడుతున్నా. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది. కానీ, దాడి జరిగితే శత్రువును తుదముట్టిస్తుంది. మరోసారి దాడికి ప్రయత్నిస్తే వినాశనమే" అని మోదీ హెచ్చరించారు.

పాక్ తప్పుడు ప్రచారానికి చెక్

"ఈ ఉదయం నేను అదంపూర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశా" అని ప్రధాని 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. వారితో దిగిన చిత్రాలను, వీడియోలను షేర్ చేశారు. అక్కడ గంటన్నరకు పైగా గడిపారు. ఆ సమయంలో మోదీ త్రిశూల్ లోగోతో కూడిన పశ్చిమ ఎయిర్ కమాండ్ టోపీని ధరించారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. దీంతో, అదంపూర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామన్న పాక్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టినట్లైంది. ఎస్-400 రక్షణ వ్యవస్థ ముందు నిల్చొని ప్రసంగించడం ద్వారా పాక్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మోదీ ప్రపంచానికి తెలిసేలా చేశారు.




అదంపూర్ ఎయిర్ బేస్‌లో సైనికులతో ప్రధాని మోదీ

భారత్‌కు ప్రతిష్ఠాత్మక స్థావరం!

అందపూర్ వైమానిక స్థావరం.. పంజాబ్‌లోని జలంధర్, హోషియార్‌పూర్ మధ్య ఉంది. ఇది పాకిస్థాన్ సరిహద్దుకు 100 కిలోమీటర్లలోపే ఉంటుంది. భారత వాయుసేన (ఐఏఎఫ్)కు ఇది రెండో అతిపెద్ద ఎయిర్‌బేస్. ఇక్కడ 'బ్లాక్ ఆర్చర్స్'గా పేర్కొనే ఐఏఎఫ్ 47వ స్క్వాడ్రన్ ఉంటుంది. దీంతో పాటు 'తొలి సూపర్‌సోనిక్స్'గా పేర్కొనే 28వ స్క్వాడ్రన్ కూడా ఉంటుంది. ఈ స్క్వాడ్రన్‌లో సుఖోయ్-30ఎంకేఐ విమానాలు ఉంటాయి. 75 ఏళ్ల కిందట ఏర్పాటైన ఈ ఎయిర్‌బేస్ భారత్‌కు అత్యంత కీలకం, వ్యూహాత్మకం కూడా. ఈ స్థావరంపై పాక్ ఎప్పుడూ కన్నేసి ఉంచుతుంది. 1965, 1971, కార్గిల్ యుద్ధం.. ఇలా పలుమార్లు పాకిస్థాన్ బలగాలు అదంపూర్ ఎయిర్‌బేస్‌పై దాడులకు ప్రయత్నించి, విఫలమయ్యాయి. ఈ నెల 9, 10 తేదీల్లో పాక్ ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఆరు క్షిపణులను ప్రయోగించగా.. ఎయిర్‌బేస్‌కు 7 కి.మీ. దూరంలోనే మన గగనతల రక్షణ వ్యవస్థ వాటిని కూల్చివేసింది.

రెక్కలు విరిగిన పాకిస్థాన్

» 20% వైమానిక ఆస్తులు ధ్వంసం



సర్గోదా ఎయిర్‌బేస్‌లో దాడిని నిర్ధారిస్తున్న ఉపగ్రహ చిత్రం

న్యూఢిల్లీ, మే 13: భారత వైమానిక దళం జరిపిన దాడుల్లో పాకిస్థాన్‌లోని 11 వైమానిక స్థావరాలు సహా పలు సైనిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. పలు ఫైటర్ జెట్లు, మౌలికసదుపాయాలు కూడా నేలమట్టమయ్యాయి. వైమానిక స్థావరాల్లో ఎటు చూసినా లోతైన గుంతలు, ధ్వంసమైన హ్యాంగర్లు దర్శనమిచ్చాయి. దీంతో పాకిస్థాన్ రెక్కలు విరిగినట్లు అయింది. భారత్ జరిపిన దాడితో తమకేమీ పెద్దగా నష్టం కలగలేదని దాయాది దేశం బుకాయించే ప్రయత్నం చేసినా.. హైరిజొల్యూషన్ శాటిలైట్ ఫొటోలు మాత్రం ఊహకు సైతం అందని రీతిలో పాక్‌కు జరిగిన భారీ నష్టాన్ని కళ్లకు కట్టాయి. ఆపరేషన్ సిందూర్‌లో రావల్పిండిలోని నూర్ ఖాన్, సింధ్‌లోని సుక్కూర్, పంజాబ్‌లోని రహీం యార్ ఖాన్ మిలిటరీ స్థావరాలు నాశనమయ్యాయి. అదేవిధంగా సర్గోదాలోని ముషాఫ్, ఉత్తర సింధు ప్రాంతంలోని షహ్‌బాజ్ జకోబాబాద్, ఉత్తర థట్టాలోని భొలారీ వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. అమెరికాకు చెందిన ఏరోస్పేస్ సంస్థ 'మాక్సర్ టెక్నాలజీస్' విడుదల చేసిన హైరిజొల్యూషన్ చిత్రాలు ఈ ధ్వంసాన్ని కళ్లకు కట్టాయి. ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వైమానిక స్థావరాల్లోని 20% ఆస్తులు, మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. ఆయా వైమానిక స్థావరాల్లోని ఎఫ్-16, జేఎఫ్-17 యుద్ధ విమానాలు, ఆయుధాగారాలే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు ఉన్నతస్థాయి అధికారి ఒకరు తెలిపారు.

మరిన్ని ఎస్-400లు కావాలి

» రష్యాను కోరిన భారత్

న్యూఢిల్లీ, మే 13: ఆపరేషన్ సిందూర్‌లో రష్యాకు చెందిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కావాలని భారత్ రష్యాను కోరినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. దీనికి రష్యా కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ క్షిపణులు, డ్రోన్లను సమర్థంగా పేల్చేసిన ఎస్-400ను ఇండియాలో 'సుదర్శన్ చక్ర'గా అభివర్ణిస్తున్నారు. ఎస్-400 ఆయుధ వ్యవస్థ 600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. శత్రుదేశాలకు చెందిన క్షిపణులు, డ్రోన్లను 400కిలోమీటర్ల దూరంలో ఉండగానే గుర్తించి పేల్చివేయగలదు. భారత దేశం 2018లో 5.43బిలియన్ డాలర్లతో ఐదు ఎస్-400లను కొనుగోలు చేసింది. కాగా, ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సొంత ఆయుధాలు చక్కని పనితీరును కనబర్చాయని అమెరికా ఆర్మీ మాజీ అధికారి ప్రశంసించారు. అదే సమయంలో చైనా ఆయుధాలు విఫలమయ్యాయన్నారు.

హైకోర్టు సీజేతో సీఎం చంద్రబాబు భేటీ

» నూతన హైకోర్టు భవనం డిజైన్లు చూపించిన సీఎం

» కర్నూలులో బెంచ్ ఏర్పాటు, రెరా చైర్మన్ నియామకంపైనా చర్చ

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని సీజే నివాసంలో మంగళవారం ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా అమరావతిలో నూతనంగా నిర్మించనున్న హైకోర్టు డిజైన్లను సీజేకి చూపించారు. హైకోర్టు భవన నిర్మాణానికి సంబంధించిన సలహాలు సూచనలు చేయాలని కోరారు. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు అంశం వీరి మధ్య చర్చకు వచ్చింది. ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ నియామకానికి సీజే ప్యానెల్ ఆమోదం తెలపాల్సి ఉన్న నేపథ్యంలో ఆ పదవిలో శివారెడ్డిని నియమించనున్నట్లు సీజేకి చంద్రబాబు తెలిపారు.

సంయమనం పాటించండి

» ఏపీ భవన్ అధికారులకు సీఎం చంద్రబాబు సూచన

» ప్రార్థనా మందిరాల తొలగింపు ప్రక్రియ నిలిపివేత

న్యూఢిల్లీ, మే 13(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీభవన్‌లో ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఆయా మతాలకు చెందినవారి అభిప్రాయలకు విరుద్ధంగా ఎటువంటి చర్యలు చేపట్టవద్దని సీఎం ఆదేశించారని భవన్ అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలతో నిర్మాణాల తొలగింపు ప్రక్రియను నిలిపివేశామని స్పష్టం చేశారు. ఏపీభవన్‌లో ఆక్రమణలు, ప్రార్థనా మందిరాల తొలగింపు ప్రతిపాదలపై అధికారులతో చంద్రబాబు మాట్లాడారు. స్థానికులు ఏర్పాటు చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై వివరణ కోరారు. పంపకాల్లో భాగంగా ఏపీకి వచ్చిన స్థలంలో 0.37 ఎకరాల్లో పలు ఆక్రమణలు ఉన్నాయని, సంప్రదింపుల ద్వారా, చట్టబద్ధంగా వాటి తొలగింపునకు గతనెల నుంచి తీసుకున్న చర్యలను సీఎంకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించే ప్రక్రియ చేపట్టాల్సి ఉందని తెలిపారు. ప్రజలు, మతసంస్థల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని చంద్రబాబు సూచించారని భవన్ అధికారులు పేర్కొన్నారు.

సీఎంకు కొత్త హెలికాప్టర్ కొనుగోలుపై కమిటీ

అమరావతి, మే13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల ప్రయాణాల కోసం వినియోగంలో ఉన్న హెలికాప్టర్ పనితీరు సమీక్షించి మార్పు అవసరమైతే సరైన మోడల్స్‌ను సూచించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి(పొలిటికల్) చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఆర్థిక శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, హైదరాబాద్‌లోని డీజీసీఏ కార్యాలయ ప్రతినిధి సభ్యులు. ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ ఎండీ కన్వీనర్‌గా ఉంటారు. ఏపీ పోలీసు శాఖ, ఏవియేషన్ కార్పొరేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు కొత్త హెలికాప్టర్ కొనుగోలు ఎంపిక కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్ర ఆదాయం పెంచండి

ఆర్జన అవకాశాలపై అధ్యయనం చేయండి

» సొంత ఆదాయం పెంచుకునేందుకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, సేవల రంగాలు దోహదం

» ఆదాయార్జన శాఖల సమీక్షలో చంద్రబాబు


ఆదాయార్జన శాఖల అధికారులపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. గడిచిన 30 ఏళ్లలో వచ్చిన ఆదాయ ధోరణులు పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీగా పెరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. శాఖల వారీ పురోగతిపై చర్చించారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని, మంచి పనితీరు ద్వారా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని, ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే 2, 3 నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్

పొరుగు రాష్ట్రాల మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా నుంచి అమ్మకం వరకు రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్ణాటక, తమిళనాడులో రవాణా ఆదాయం పెరుగుతుంటే ఏపీలో ఎందుకు తక్కువగా వస్తోందని ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి సరైన విధానాలు అవలంబించాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు. బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఏపీ ముందున్నప్పటికీ పన్ను ఆదాయం ఆ స్థాయిలో ఎందుకు లేదో పరిశీలించాలని చెప్పారు. పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ. 1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కంటే 29శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1నుంచి మే 11వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అనూహ్యంగా ఆదాయం పెరిగింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ. 17,170 కోట్లు రాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే (26% తక్కువ) వచ్చిందని సీఎంకు అధికారులు వివరించారు.

కొత్త ఎక్సైజ్ పాలసీతో ఆదాయం పెరుగుదల

రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయం పెరిగింది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ. 28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ. 33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు.

ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం

రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాలయ విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి, వాటి విలువ ఎంతనే దానిపై కమిటీ వేసి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు. తెలంగాణకు హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని, ప్రస్తుతం అలాంటి అవకాశం ఏపీకి లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని సీఎం అన్నారు.

అటవీ భూముల్ని రక్షించలేని అధికారులపై చర్యలు

» పెద్దిరెడ్డి కుటుంబ ఆక్రమణలపై క్రిమినల్ కేసులు

» ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం నుంచి అటవీ భూములను రక్షించలేని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. విజిలెన్స్ డీజీ నివేదిక, సిఫారసులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గమఠం భూములను పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిందన్న ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ విచారణ జరిపి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో సంబంధిత శాఖల భూములు ఆక్రమణకు గురవుతుంటే రక్షించలేని వారిని బాధ్యుల్ని చేయాలని, ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిఫారసు చేశారు. ఈ నివేదికను పవన్ పరిశీలించారు. విజిలెన్స్ డీజీ సిఫారసులకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించాలని స్పష్టం చేశారు. అలాగే.. అటవీ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులతో పాటు అటవీ, పర్యావరణ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

కాంగ్రెస్ నేత హత్య కేసులో.. ఎమ్మెల్యే గుమ్మనూరు సోదరుడి అరెస్టు



ఆలూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడి హత్య కేసులో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 27న జరిగిన ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో గుమ్మనూరు నారాయణ పాత్ర ఉందని ఏఎస్పీ హుసేన్ పీరా తెలిపారు. లక్ష్మీనారాయణకు, గుమ్మనూరు నారాయణకు మధ్య రైల్వే టెండర్లు, కమీషన్ల విషయంలో వివాదాలు ఉన్నాయన్నారు. అలాగే గౌసియా, పెద్దన్న, రాజేశ్‌తో ఉన్న భూ వివాదాల కారణంగా అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరించడంతో లక్ష్మీనారాయణను హత్య చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. హత్యకు అవసరమైన టిప్పర్ కొనడానికి గుమ్మనూరు నారాయణ ముందు రూ.2లక్షలు, తర్వాత మరో రూ.1.50 లక్షలు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని నిందితుడు అంగీకరించడంతో అరెస్టు చేసినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. కేసు విచారణను పారదర్శకంగా చేస్తున్నామని, అన్ని ఆధారాలు లభించాకే ఏ-15గా చేర్చి అరెస్టు చేశామని స్పష్టం చేశారు. గుమ్మనూరి నారాయణను జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు.

ఐదేళ్లలో ఉద్యాన సాగు రెట్టింపు

» డిమాండ్ ఉన్న పంటలకు ప్రోత్సాహం

» రైతుకు ఏటా ఎకరానికి రూ.లక్ష ఆదాయం రావాలి

» ఉద్యానశాఖ సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతులు ఏటా ఎకరానికి కనీసం రూ.లక్ష ఆదాయం ఆర్జించడమే లక్ష్యంగా కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలు మినహా రాష్ట్రంలోని విగతా అన్నిచోట్ల ఉద్యాన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఉద్యానశాఖపై ఆయన సమీక్ష జరిపారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్‌పామ్, కోకో, డ్రాగన్‌ఫ్రూట్, జీడిమామిడి, కాఫీ, కొబ్బరి, టమాటా, ఉల్లి వంటి 11 పంటలతో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి, రైతులకు తోడ్పాటు అందించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన పంటల సాగును వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలన్నారు. ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి రైతులకు సాగు మెలకువలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేసేలా చూడాలని, పంట నాణ్యతపై రైతులకు శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. వీటికి అనుబంధంగా రైతులే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే మరింత ఆదాయం లభిస్తుందన్నారు. రైతులు పండించే పంటలకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. 'మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్‌కు ఆటోమెషిన్ అమర్చాలి. దీని వల్ల నీరు, ఎరువులు ఆదా అవుతాయని రైతులకు అవగాహన కల్పించాలి' అని సీఎం ఆదేశించారు. ఉద్యాన పంటలపై ప్రతినెలా జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తూ.. 10వేల హెక్టార్లలో పండ్ల తోటలకు రూ.32 కోట్లతో ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లు సబ్సిడీపై అందించడం వల్ల రైతులకు రూ.120 కోట్ల అదనపు ఆదాయం లభించిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు సీఎంకు వివరించారు.

91 పెద్ద కంపెనీలు వస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

కల్పించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ఈ కంపెనీలన్నింటికీ త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఐటీ శాఖను ఆదేశించారు. ప్రతిపెద్ద కంపెనీకి ఒక నోడల్ అధికారిని నియమించాలని, యూనిట్లు వేగవంతంగా స్థాపించేలా యంత్రాంగం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగులు కీలక భూమిక వహిస్తారని చెప్పారు. ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాలను తక్షణమే ఇవ్వాలన్నారు. అలాగే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. విశాఖ నగరాన్ని ఐటీ హబ్‌గా వేగంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.


ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి లోకేశ్

వాట్సాప్ ద్వారా మరిన్ని సేవలు

ప్రభుత్వానికి సంబంధించి పౌర సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం 317 రకాల సేవలు మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని నెలాఖరుకు 400కు విస్తరించాలని ఆర్టీజీఎస్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూతో సహా పలు ప్రభుత్వ సేవలన్నింటినీ వాట్సాప్ ద్వారా అందించాలన్నారు. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్‌తో నిర్ధారించుకునేలా టెక్నాలజీని అనుసంధానం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల ఉత్తర్వులన్నీ ఒకే వేదికపైకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులను రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీలు, పంచాయతీల్లో పన్నుల బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ సందేశాలు పంపాలన్నారు. వచ్చేనెల 9, 10 తేదీల్లో విశాఖలో జరగనున్న ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని లోకేశ్ ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత సరళతరం చేయాలన్నారు. చిరువ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమలకు సింగిల్ సర్టిఫికేషన్ జారీ చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు యాక్షన్ ప్లాన్

నైపుణ్యాభివృద్ధి విభాగాల ద్వారా పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జిల్లాలవారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్, వృత్తి విద్యలను బలోపేతం చేయాలన్నారు. తద్వారా ఐదేళ్లలో లక్షల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నైపుణ్యం పోర్టల్‌ను సింగిల్ ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. నైపుణ్య శిక్షణ పొందిన యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగాల కల్పనను ట్రాక్ చేయాలన్నారు. విదేశాల్లో ఉద్యోగావకాశాల గురించి ఓంక్యాప్ ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

» పరిశ్రమలశాఖ జీఎంలతో భేటీలో మంత్రి భరత్

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో అధికారులు కూడా పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఆయన పరిశ్రమలశాఖ అన్ని జిల్లాల జీఎంలతో మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టులు, పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న కంపెనీలకు అనుమతుల వివరాలపై ఆరాతీశారు. సీఎం అధ్యక్షతన నిర్వహించిన ఐదు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదించిన పెట్టుబడులకు సంబంధించి వివిధ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. పరిశ్రమలకు అనుమతుల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదన్నారు.

రాజధానిలో టాటా ఇన్నోవేషన్ హబ్

» ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల ఏర్పాటే లక్ష్యం

» మహిళలు, యువతకు ప్రాధాన్యం

» 1,000 కోట్ల పెట్టుబడి, లక్ష ఉద్యోగాల కల్పన

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

నూతన ఆవిష్కరణకు వేదికగా, ఆధునిక టెక్నాలజీలకు కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. దానిలో భాగంగా తన మానసపుత్రిక రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)ను త్వరలోనే అమరావతిలో ప్రారంభించనున్నారు. పారిశ్రామిక దిగ్గజ సంస్థలు టాటా గ్రూప్, ఎల్ అండ్ టి, రేమండ్, అదానీ పోర్ట్స్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ (ఓఎన్‌జీసీ) కార్పొరేషన్, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) వంటి సంస్థలను ఒకే వేదిక మీదకు చేర్చి ఆర్‌టీఐహెచ్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20,000 స్టార్టప్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో తయారీ, సాంకేతిక వ్యవసాయం, టెక్స్‌టైల్స్, డిజిటల్, క్లీన్‌ఎనర్జీ, ఆరోగ్య రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఒక్కో స్టార్టప్‌లోనూ రూ. 10 లక్షల నుంచి కోటి రూపాయల దాకా మొత్తంగా రూ. 1,000 కోట్ల పెట్టుబడులు సమీకరిస్తారు. ఈ స్టార్టప్‌ల్లో మహిళలకు, యువత, నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. స్టార్టప్‌లతో వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి ద్వారా పోటీతత్వంతో మార్కెటింగ్ చేసుకునే విధానాలలో అవగాహన కల్పిస్తారు.

ఆర్‌టీఐహెచ్ ముఖ్య సేవలు ఇవీ..

- ఇన్నోవేషన్ సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తాయి.
- ఆర్‌టీఐహెచ్ ద్వారా యువతలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో శిక్షణ ఇస్తారు.
- పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది.
- భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) వంటి వాటిల్లో స్టార్టప్‌లకు సహకారం అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది.
- టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ప్రత్యామ్నాయ ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదక ఇంధన రంగాలు, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్ రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.
- పట్టణ రవాణా, సముద్ర రవాణా, సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణను ఇస్తుంది.

మహానాడు నిర్వహణపై నేడు నిర్ణయం


కేంద్ర కార్యాలయంలో భేటీ కానున్న టీడీపీ పొలిట్ బ్యూరో

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం జరగనుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి జరుగుతున్న ఈ భేటీకి పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షత వహిస్తారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించతలపెట్టిన మహానాడుపై ప్రధానంగా చర్చ జరగనుంది. గతేడాది ఎన్నికల షెడ్యూల్ కారణంగా దీనిని నిర్వహించలేకపోయారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చినందున ఈ ఏడాది భారీగా జరపాలని భావించారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదుల దాడి.. దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' కారణంగా నిన్నమొన్నటివరకు దేశవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల దృష్ట్యా మహానాడు వేడుకలు మూడ్రోజులు నిర్వహించాలా లేక రెండ్రోజులకు కుదించాలా అన్న అంశంపై పొలిట్‌బ్యూరోలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే సంస్థాగత నిర్మాణంలో సంస్కరణలు చేపట్టాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పదే పదే కోరుతున్నారు. దీనిపై పొలిట్‌బ్యూరోలో చర్చించనున్నారు. జగన్ హయాంలో 2019-24 మధ్య టీడీపీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసుల ఎత్తివేత అంశం సైతం చర్చకు వస్తుందని అంటున్నారు. కాగా, ఎమ్మెల్యేల స్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహణ సరిగా లేదని టీడీపీ భావిస్తోంది. నియోజకవర్గాల్లో ప్రజాదర్బార్లు ఏర్పాటు చేసి ఫిర్యాదుల స్వీకరణతోపాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించనుంది. దీని కోసం విధివిధానాలను పొలిట్‌బ్యూరో ఖరారు చేయనుంది. బుధవారంనాటి భేటీలో పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి, పాకిస్థాన్ దాడిలో అమరులైన జవాన్లకు.. ఇటీవల మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకూ సంతాపం తెలుపనుంది.

రేపటి నుంచి తిరంగా ర్యాలీ

» నాలుగు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ

» బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో ఈ నెల 15 నుంచి 18 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ తరఫున తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'మన మహిళల సిందూరాన్ని చెరిపిన ఉగ్రవాదులను మన సైన్యం కోలుకోలేని దెబ్బ కొట్టింది. ఇలాంటి సమయంలో ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలే ఆయన్ను విశ్వగురుగా మార్చాయి. అధికారంలో ఉండగా మద్యం, ఇసుక, మైనింగ్.. అన్నింట్లోనూ అవినీతికి పాల్పడిన వారు వరుసగా జైలుకు వెళుతున్నారు. కూటమి పాలనలో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పయనిస్తోంది. కేంద్రం నుంచి మోదీ సహకారంతో అభివృద్ధి పరుగులు పెడుతోంది' అని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు.


మురళీ నాయక్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న జగన్

మురళీ నాయక్‌కు రుణపడి ఉంటాం

కళ్లితండాలో వీరజవాన్ కుటుంబానికి జగన్ పరామర్శ

హిందూపురం, మే 13(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ మురళీ నాయక్‌కు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీ నాయక్ కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లి తండాకు బెంగళూరు నుంచి జగన్ రోడ్డు మార్గాన వచ్చారు. మురళీ నాయక్ ఇంటికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయిని ఓదార్చారు. వారి ఇంట్లో సుమారు 25నిమిషాల పాటు గడిపి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. వీరజవాన్ మురళీ నాయక్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన త్యాగాన్ని మరిచిపోలేమని చెప్పారు. అమరులైన జవాన్ కుటుంబానికి రూ.50లక్షలు ఇచ్చే సంప్రదాయాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ తరఫున వారి కుటుంబానికి రూ.25లక్షల ఆర్థిక సాయాన్ని జగన్ ప్రకటించారు.

వైసీపీ శ్రేణుల 'సీఎం జగన్' నినాదాలు

కళ్లి తండాకు జగన్ చేరుకున్నప్పటి నుంచి వెనుదిరిగేవరకు మురళీ నాయక్ ఇంటి బయటున్న వైసీపీ శ్రేణులు 'సీఎం.. సీఎం.. జై జగన్' అంటూ నినాదాలు చేశారు. వీరజవాన్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన సమయంలో ఈలలు, కేకలు వేస్తూ నినాదాలు చేస్తున్నా వారించే ప్రయత్నం చేయలేదు. రాష్ట్ర సరిహద్దు నుంచి కళ్లి తండాకు చేరుకునేవరకూ జగన్ ఐదారుచోట్ల వాహనాలను ఆపి, జనానికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఇది వీరజవాన్ కుటుంబాన్ని పరామర్శించినట్లు లేదని, రాజకీయ పర్యటనలా ఉందని పలువురు విమర్శించారు.

500 మందితో బందోబస్తు

కళ్లి తండాకు జగన్ మరికొన్ని నిమిషాల్లో చేరుకుంటారనగా, వైసీపీ శ్రేణులకు డీఎస్పీ, సీఐలు పలు సూచనలు చేశారు. వీఐపీలు వచ్చినప్పుడు నినాదాలు చేయకూడదని, 'జై భారత్, జై జవాన్, జైహింద్' అని మాత్రమే అనాలని సూచించారు. అయినా వైసీపీ శ్రేణులు 'జై జగన్' నినాదాలు చేయడం విమర్శలకు తావిచ్చింది. కాగా, కళ్లి తండాకు జగన్ వచ్చిన సందర్భంగా 500మందికిపైగా పోలీసులు తండాను తమ అధీనంలోకి తీసుకున్నారు. 200మీటర్ల దూరంలోనే ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. స్థానికులు ఎవరూ ఇళ్ల నుంచి బయటకి రాకూడదని సూచించారు. రెండు రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సహా పలువురు మంత్రులు వచ్చినప్పుడు కూడా ఇంత బందోబస్తు ఏర్పాటు చేయలేదు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చినంత స్థాయిలో ఇప్పుడు కూడా బందోబస్తు ఏర్పాటు చేయడంపై విమర్శలొస్తున్నాయి.

మీడియా కంట పడకుండా మిథున్‌రెడ్డి పరామర్శ

మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డి, మీడియా కంట పడకుండా జాగ్రత్తపడ్డారు. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో... తీర్పు తనకు వ్యతిరేకంగా వస్తే ఎక్కడ అరెస్టు చేస్తారోనని మిథున్‌రెడ్డి ఆందోళన చెందినట్లు ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు.

వల్లభనేని వంశీకి బెయిల్

- సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఐదుగురికి బెయిలిచ్చిన ఏసీబీ కోర్టు
- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ ఇంకా రిమాండ్‌లోనే..



విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు ఊరట లభించింది. ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మొత్తం ఆరుగురు నిందితుల్లో ఐదుగురికి బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీతో పాటు ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగా, నిమ్మ లక్ష్మీపతి, గంటా వీర్రాజు, వేలూరి వంశీ బాబు, వెలినేని శివరామకృష్ణ ప్రసాద్‌ను మంగళవారం కోర్టుకు తీసుకొచ్చారు. వారి రిమాండ్‌ను బుధవారం వరకు పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు గంట సమయం ఇస్తూ మౌఖికాదేశాలు జారీ చేశారు. సాయంత్రం వంశీ, మోహన రంగారావు, లక్ష్మీపతి, వీర్రాజు, వంశీబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. ఒక్కొక్కరు రూ.50 వేలతో రెండు ష్యూరిటీలను మూడు రోజుల్లోగా సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి శనివారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఇదే కేసులో శివరామకృష్ణ ప్రసాద్(ఏ7) బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. కాగా, గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇంకా బెయిల్ రాకపోవడంతో వంశీ జైలులోనే ఉండనున్నారు.

శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు: వంశీ

జైలులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నానని న్యాయాధికారికి వంశీ వివరించారు. ఆక్సిజన్ ఎనలైజర్ పెట్టుకోవడం వల్ల ముక్కు వద్ద ఉన్న ఎముకలు నొప్పి వస్తున్నాయని చెప్పారు. రాత్రి నిద్రపోయే సమయంలో పల్స్ రేటు ఒక్కసారిగా తగ్గిపోతోందని తెలిపారు. వైద్యులు రాసిన మందులు కాకుండా జైలు అధికారులు వేరే మందులు ఇస్తున్నారని వంశీ తరపు న్యాయవాది సత్యశ్రీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వంశీకి ప్రభుత్వాస్పత్రిలో గానీ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రిలో గానీ వైద్యం చేయించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు

కోర్టు ఆదేశాలతో జైలు అధికారులు వంశీని సాయంత్రం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మొదటి అంతస్తులో ఉన్న రెసిడెంటల్ మెడికల్ ఆఫీసర్ చాంబర్‌లో వైద్యులు వంశీ రక్త నమూనాలను సేకరించారు. బీపీ, షుగర్, ఈసీజీ, సీటీ స్కాన్ పరీక్షలు చేశారు. ఆయనకు దగ్గు వస్తున్నట్లు గుర్తించారు.

రంగాకు రిమాండ్ పొడిగింపు

వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగాకు ఈ నెల 27 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన భూకబ్జా కేసులో ఆయనను పోలీసులు మంగళవారం విజయవాడలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు.

బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన పీఎస్ఆర్



అమరావతి/విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): ముంబై నటి జెత్వానీ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు మంగళవారం హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో సహనిందితులుగా ఉన్న కుక్కల విద్యాసాగర్, ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, విశాల్ గున్ని మరికొంద రు బెయిల్ పొందారని పేర్కొన్నారు. తనను వేధించడం కోసమే దర్యాప్తునకు సహకరించడం లేదని ఆరోపిస్తున్నారన్నారు. దర్యాప్తునకు సహకరించడాని కి సిద్ధంగా ఉన్నానన్నారు. ఎలాంటి షరతులు విధించినా కట్టుబడి ఉంటానని, బెయిల్ ఇవ్వాలని కోరారు. పీఎస్ఆర్ ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. విజయవాడ రెండవ అదనపు జిల్లా కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

ఏపీపీఎస్సీ కేసులో రేపటికి వాయిదా

ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను విజయవాడ కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఆయన విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ వేయాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పోలీసులను ఆదేశించింది.

మిథున్‌రెడ్డికి చుక్కెదురు

- బెయిల్‌కోసం హైకోర్టునే ఆశ్రయించండి
- మద్యం కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఎంపీకి కల్పించిన మధ్యంతర రక్షణ రద్దు



న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టునే ఆశ్రయించాలని ఆయనకు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలో కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విచారణను ఇంతటితో ముగిస్తున్నట్టు సుప్రీంకోర్టు వెల్లడించింది. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మిథున్ రెడ్డి గత నెల మూడోతేదీన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇరువాదనల తర్వాత ధర్మాసనం తన తీర్పును వెల్లడించింది. హైకోర్టులో మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన సమయానికి మద్యం కేసులో ఆయనను నిందితునిగా చేర్చలేదని, అరెస్టు చేసే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రస్తుతం ఈ కేసులో మిథున్‌రెడ్డిని నిందితునిగా చేర్చామని ముకుల్ రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. నిందితునిగా లేనివ్యక్తి బెయిల్ కోసం ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని గతంలో హైకోర్టు ప్రశ్నించిందని, ఇప్పుడు ఆయనను నిందితుడిగా చేర్చినందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని అభిషేక్ మను సింఘ్వీ విజ్ఞప్తి చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం మరోసారి హైకోర్టునే ఆశ్రయించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో నిందితుడు బాధ్యత కలిగిన పార్లమెంట్ సభ్యుడని, విచారణకు అన్ని విధాలా సహకరిస్తున్నారని, ఇప్పటికే దర్యాప్తు అధికారి ఎదుట విచారణకు హాజరయ్యారని, హైకోర్టు తీర్పు ఇచ్చే వరకు మిథున్ రెడ్డిని అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని అభిషేక్ మను సింఘ్వీ కోరారు. కేసు పెట్టిన వెంటనే యాంత్రికంగా అరెస్టు చేయాలనే ఆలోచన సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అరెస్టుకు సహజమైన కారణాలు ఉండాలని సూచించింది. అయితే, కేసు విచారణకు సహకరిస్తే అరెస్టు చేయాల్సిన అవసరం ఉండదని, హైకోర్టు నిర్ణయం వెలువరించేవరకు మిథున్ రెడ్డిని అరెస్టు చేయబోమని ముకుల్ రోహత్గీ తెలిపారు. దీంతో నాలుగు వారాల్లో మిథున్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ కేసులో దర్యాప్తుసంస్థ సమర్పించిన నివేదికలను హైకోర్టు ఆధారంగా తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

బాలాజీ గోవిందప్ప అరెస్టు





మాజీ సీఎం జగన్‌తో బాలాజీ (ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నోటీసును తోసిపుచ్చి, బాలాజీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఆచూకీని కర్ణాటకలో గుర్తించిన సిట్ బృందం మంగళవారం అక్కడకు వెళ్లింది. మైసూరులోని ఓ రిసార్టులో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లింది. అయితే, అప్పటికే ఆ బసను బాలాజీ ఖాళీ చేసినట్టు తెలుసుకుంది. సాంకేతికతను వాడి చామరాజనగర్ జిల్లా యల్లందూరు తాలుకాలోని ఒక అటవీ ప్రాంతంలోని (బీఆర్ హిల్స్) వెల్‌నెస్ సెంటర్‌లో ఆయనను కనుగొంది. అక్కడ సేద తీరుతున్న బాలాజీని అదుపులోకి తీసుకుంది. బీఆర్ హిల్స్‌లో ఒక్కసారిగా సిట్ అధికారులను చూడటంతో ఆయన అవాక్కయ్యారు. మారు మాట్లాడకుండా వచ్చి పోలీసు వాహనంలో ఎక్కి కూర్చున్నారు. ఆ వెంటనే స్థానిక కోర్టుకు బాలాజీని తరలించారు. కోర్టు అనుమతితో విజయవాడకు తీసుకొస్తున్నారు. బుధవారం సాయంత్రం లేక గురువారం విజయవాడ సీఐడీ కోర్టులో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. మద్యం స్కామ్ కేసులో బాలాజీ గోవిందప్పను ఏ33గా నిందితుల జాబితాలో సిట్ చేర్చింది. రాజ్ కసిరెడ్డి(ఏ 1) నుంచి బాలాజీ గోవిందప్ప వరకూ ఈ కేసులో ఇప్పటి వరకూ ఐదుగురు అరెస్టయ్యారు. .

షెల్ కంపెనీలు సృష్టించి.. ముడుపులు మళ్లించి..

గత ప్రభుత్వంలో జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.3,200కోట్ల మద్యం ముడుపులు చేరినట్టు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీఐడీ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు (ఐజీ ర్యాంక్) నేతృత్వంలో సిట్‌ను రంగంలోకి దించింది. తాడేపల్లిప్యాలెస్‌కు మద్యం సొమ్ములు చేర్చడంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల పాత్రను సిట్ అధికారులు పసిగట్టారు. వీరిలో బాలాజీ వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ). ఉమ్మడి చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని వి.కోట మండలం పీ.కొత్తూరు ఆయన గ్రామం. చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు ఆయన సోదరుడు. సీఏ చదివిన బాలాజీ కొంతకాలం బెంగళూరులో ఉన్నారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా వెళ్లి ఉద్యోగం చేశారు. హైదరాబాద్‌కు తిరిగివచ్చి 2009లో అప్పటి ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ విజయసాయిరెడ్డి వద్ద చేరారు. ఆయన ద్వారానే జగన్ కుటుంబానికి చేరువయ్యారు. వైసీపీ ఆవిర్భావంతో విజయసాయి రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో బాలాజీ పూర్తి స్థాయిలో భారతీ సిమెంట్స్‌తో పాటు జగన్,భారతి ఆర్థిక లావాదేవీలను దగ్గరుండి చక్కబెడుతూ, వారికి అత్యంత సన్నిహితునిగా మారారు .అనతికాలంలోనే భారతీ సిమెంట్స్ డైరెక్టర్‌గా ఎదిగారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక లిక్కర్ పాలసీ మొదలు ముడుపుల వసూళ్ల వరకూ ప్రతి అడుగులోనూ బాలాజీ పాత్ర ఉంది. రాజ్ కసిరెడ్డి తెచ్చి ఇచ్చిన కోట్లాది రూపాయల మద్యం ముడుపులను ఊరు పేరు లేని షెల్ కంపెనీల్లోకి మళ్లించడంలో మాస్టర్ మైండ్ గోవిందప్పదేనని సిట్ ఆధారాలు సేకరించింది. మొత్తం బాగోతాన్ని పసిగట్టిన అధికారులు ఆయనను విచారించి అంతిమ లబ్ధిదారు ఎవరో తేల్చబోతున్నారు. రూ.కోట్లాది రూపాయలు ఎవరికి చేర్చారు.. ఎవరి ఆదేశాల మేరకు ఎక్కడ దాచారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో సృష్టించిన షెల్ కంపెనీలు ఎవరివి.. వాటిలో ఎవరి పేరుతో పెట్టుబడులు పెట్టారు... నకిలీ జీఎస్టీ ఇన్వాయిస్‌లు, హవాలా మార్గంలో వెళ్లిన డబ్బుల వివరాలు కక్కించనున్నారు. కాగా, 2009లోనూ అప్పటి సీబీఐ, ఈడీ కేసుల్లో బాలాజీకి నోటీసులు వెళ్లాయి. సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసుల నుండి ఆయన బయటపడ్డారు.

అన్నకోసం పట్టుబట్టి జడ్పీపీఠం

జిల్లా పరిషత్ ఎన్నికల్లో బాలాజీ తన అన్నయ్య శ్రీనివాసులును పట్టుబట్టి మరీ చిత్తూరు జడ్పీ చైర్మన్‌గా ఎంపిక చేసుకోగలిగారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అనుచరులకు ఆ పదవి కట్టబెట్టాలని ఎంత ప్రయత్నించినా, ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. స్వయానా అప్పటి సీఎం జగన్ సతీమణి భారతి సూచనతో శ్రీనివాసులు జడ్పీ చైర్మన్‌గా నియమితులవడం అప్పట్లో వైసీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

నిన్న విజయసాయి.. నేడు గోవిందప్ప..

జగన్ దురాశకు ఇద్దరు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు ఆయుధాలుగా మారడం గమనార్హం. నెల్లూరు జిల్లాకు చెందిన విజయసాయి రెడ్డి పెద్ద పెద్ద సంస్థలకు ఆడిటర్‌గా పనిచేస్తూ జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ అత్యాశకు సహకరించారు. తండ్రి మేళ్లకు తనయుడికి లబ్ధి కలిగించే క్రమంలో సూట్‌కేసు కంపెనీలు ఏర్పాటు చేయించి రూ.43వేల కోట్ల కుంభకోణంలో సీబీఐకి విజయసాయి చిక్కి విలవిల్లాడారు. మొత్తం పదకొండు కేసులను నమోదు చేసిన సీబీఐ.. దాదాపు అన్నింట్లోనూ సాయిరెడ్డిని ఏ2గా చేర్చింది. హైదరాబాద్‌లో అరెస్టు చేసి అప్పట్లో చంచల్‌గూడ జైలుకు పంపించింది. ఇక రెండో సీఏ బాలాజీ గోవిందప్ప. జగన్ సీఎంగా ఉండగా జరిగిన మద్యం స్కామ్‌లో అక్రమ సొమ్ములను షెల్ కంపెనీల్లోకి మళ్లించి దాచేందుకు బాలాజీని వాడారు. ఇప్పుడు ఆయన సిట్‌కు చిక్కి జైలు ఊచలు లెక్కించనున్నారు.

కొసమెరుపు: విజయసాయిరెడ్డి దగ్గరే మొదట బాలాజీ సీఏగా పనిచేశారు. విజయసాయి ద్వారానే జగన్, భారతీలకు దగ్గరయ్యారు. ఆ కుటుంబం కారణంగానే అప్పట్లో విజయసాయి జైలుకు వెళితే, ఇప్పుడు బాలాజీ వంతు వచ్చింది.

ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు మధ్యంతర రక్షణ

- ఈ నెల 16 వరకు కల్పించిన సుప్రీంకోర్టు
- అదేరోజుకు ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా



న్యూఢిల్లీ, మే 13(ఆంధ్ర జ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలు విచారణకు అన్ని విధాలా సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మద్యం కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ.. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. బాలాజీ గోవిందప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులో విచారణకు హాజరుకావాలని ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, కానీ వారు విచారణకు రావడం లేదని తెలిపారు. అయితే, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల పిటిషన్లకు కౌంటర్ దాఖలు చేయాలని దర్యాప్తు సంస్థను సుప్రీంకోర్టు ఆదేశించింది. వారిద్దరికి ఈనెల 16వరకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ, అదే రోజుకు తదుపరి విచారణను వాయిదావేసింది. కాగా, బాలాజీ గోవిందప్ప అరెస్టు అక్రమమంటూ ఆయన తరపున సీనియర్ న్యాయవాది వాదించగా, అది అక్రమమా? సక్రమమా? అనేది తేల్చాల్సింది న్యాయస్థానమని ధర్మాసనం తెలిపింది. అరెస్టు చేశారని, 24గంటల్లో రిమాండ్ చేస్తారని, ఆ తర్వాత ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయవచ్చని సూచించింది.

లిక్కర్ కేసులో 'సిట్' దూకుడు

- జగన్ ఓఎస్డీ కుమారుడి వ్యాపారాల్లో తనిఖీలు



హైదరాబాద్‌లో సోదాలు చేస్తున్న సిట్ బృందం

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) రోజురోజుకూ దూకుడు పెంచుతోంది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణంలో మూలాలవరకూ చొచ్చుకెళ్లిన సిట్ అధికారులు, అంతిమ లబ్ధిదారు ఎవరనేది తేల్చే పనిలో ఉంది. అందులో భాగంగా జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికి ఉచ్చు గట్టిగా బిగించడం మొదలైంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఆయన కుమారుడు రోహిత్‌రెడ్డికి చెందిన ఆరు కంపెనీల్లో సోదాలు నిర్వహించింది. ఇందులో..1.రాజేంద్రనగర్ ఉప్పర పల్లిలోని సైన్ రైజ్ వ్యాలీలోని నాటికల్ గ్రీన్ ఎనర్జీ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, 2. ఎస్ఆర్ నగర్‌లోని గౌతమి ధామమ్ స్కూల్ ఎదురుగా ఉన్న ఐబోట్ ఎనర్జీ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. 3.శేరిలింగంపల్లి మండలం గఫూర్‌నగర్‌లోని స్కూబీల్యాబ్స్ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, 4.మెహదీపట్నంలోని క్రిస్టల్ గార్డెన్స్‌లోని క్రిస్టల్ మాన్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 5. గుడిమల్కాపూర్ కింగ్‌ప్యాలెస్ పక్కనే ఉన్న ఏక్యూ స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్, 6.యాకూత్‌పురలోని కార్యాలయం ఉన్నాయి. తెలంగాణకు చెందిన ఓ మంత్రి కుమారుడికి రోహిత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపార భాగస్వామిగా ఉన్నట్లు సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రికార్డుల్లో తేలింది.

నెలలకొద్దీ నాన్చుడు!

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ల ఆదాయమూ పోతోంది.

జగన్ హయాంలో ఇలా...

తన రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడానికి, కాళ్లబేరానికి వచ్చిన వారితో సెటిల్‌మెంట్ చేసేందుకు వీలుగా నిషిద్ధ భూములపై వైసీపీ సర్కారు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంది. అనేక ప్రాంతాల్లో వివాదాస్పద, సంశయాత్మక భూములను నిషేధ జాబితా నుంచి బయటకు తీసి ఫ్రీ హోల్డ్ చేశారు. అయితే.. ఇలా నిషేధ జాబితా నుంచి బయటికి వచ్చిన భూములన్నీ అక్రమం కాదు. కొన్ని.. సక్రమమూ ఉన్నాయి. అందులోనే... రెండెకరాల లోపు చిన్న, సన్నకారు రైతులకు చెందినవీ ఉన్నాయి. ఇలాంటి వారంతా తమ భూములను విక్రయించుకునేందుకు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు, రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. కానీ.. కూటమి సర్కారు మొత్తంగా 'ఫ్రీహోల్డ్' భూములపై రిజిస్ట్రేషన్లు, లావాదేవీలను నిలిపివేసింది. ఎన్నికల ముందు జగన్ సర్కారు హడావుడిగా ఫ్రీ హోల్డ్ చేసిన భూములను తిరిగి నిషిద్ధ జాబితాలో చేర్చాలా? అలా వదిలేయాలా? లేక, కేటగిరీలుగా విభజించి చేయాలా? ఇలాంటి అంశాలను పరిశీలించాల్సి ఉంది. కానీ... నెలలు గడుస్తున్నా తుది నిర్ణయం తీసుకోవడంలేదు.


నాడు 13 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్

జగన్ ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టం-1977ను సవరించిన సంగతి తెలిసిందే. అసైన్ చేసి 20 ఏళ్లు దాటిన భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించి ఆ భూములపై రైతులకు శాశ్వత హక్కులు(ఫ్రీ హోల్డ్) కల్పిస్తామని 2023 డిసెంబరులో జీఓ 596 జారీ చేసింది. ఆ తర్వాత ఏకంగా 13 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. వీటిలో 5.75 లక్షల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు కూటమి ప్రభుత్వం చేయించిన విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌లో ఎవరెవరు లబ్ధిపొందారో నిగ్గుతేల్చాల్సి ఉంది. ఇది ప్రభుత్వ బాధ్యత కూడా. ఫ్రీ హోల్డ్‌తో లబ్ధిపొందిన పెద్దలు, నేతలు ఎవరో గుర్తించే బాధ్యతను అధికారులకు అప్పగించాలి. గత ఏడాది ఆగస్టులో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లపై నిషేధం విధించారు. తొలుత 2 నెలల పాటు నిషేధం అన్నారు. ఆ తర్వాత ప్రతి రెండు నెలలకోసారి పొడిగిస్తున్నారు. దీనిపై విమర్శలు రావడంతో సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. తొలిసారిగా ఉపసంఘం భేటీ అయినా నిర్ణయమూ తీసుకోలేదు. ఉపసంఘం రెండో భేటీ వాయిదా పడింది. ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లపై నిషేధాన్ని మరో రెండు నెలల పాటు... అంటే జూలై 11 వరకు పొడిగించారు.

పరిష్కారం చూపలేరా...

జగన్ ప్రభుత్వంలో 5.75 లక్షల ఎకరాల భూములను అక్రమంగా ఫ్రీ హోల్డ్ చేశారని ప్రభుత్వం గుర్తించింది. ఈ డేటా ప్రభుత్వం వద్ద ఉంది. ఈ అక్రమాలకు బాధ్యులెవరో కూడా సమాచారం ఉంది. ఆ భూములను తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడం లేదా.. రిజిస్ట్రేషన్లు ఆపివేయడం చేస్తే సరిపోతుంది. ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో ప్రభుత్వం ఓ స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోవచ్చు. మంత్రివర్గ ఉపసంఘానికి రెవెన్యూశాఖ దీనిపై 4 నెలల క్రితమే నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం చర్యలు తీసుకున్నా సమస్యకు ఓ పరిష్కారం లభించి ఉండేదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. ఫ్రీ హోల్డ్‌ను కొనసాగిస్తూ జీఓ 596ను అమలు చేయాలనుకుంటే.. 50 సెంట్లు, ఎకరం, రెండు ఎకరాలున్న చిన్న రైతుల భూములను రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలి. అందులో బినామీ రిజిస్ట్రేషన్‌లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ శాఖ నివేదించింది. ఒక వేళ ఫ్రీ హోల్డ్ అమలు చేయవద్దనుకుంటే అదే విషయాన్ని ప్రకటించాలి. కానీ, ఈ రెండింట్లో ఏ నిర్ణయం తీసుకోకుండా పది నెలలుగా నాన్చడం వల్ల భూముల రిజిస్ట్రేషన్ అవసరం ఉన్న పేద రైతుల్లో తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అదే సమయంలో.. వైసీపీ కూడా 'మేం మేలు చేస్తే, ఈ ప్రభుత్వం వచ్చి అడ్డుకుంది' అని ప్రచారం చేస్తోంది.

భైరవునిపాడులో 16వ శతాబ్దం నాటి వీరభద్రుడి విగ్రహం



విజయవాడ కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మండలం భైరవునిపాడులో క్రీ.శ 16వ శతాబ్దానికి చెందిన చిన్న వీరభద్రుడి శిల్పం బయటపడిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మున్నంగి జగన్నాథం ఇచ్చిన సమాచారంతో ఆయన మంగళవారం భైరవునిపాడు శివాలయంలో భద్రపరిచిన ఆ విగ్రహాన్ని పరిశీలించారు.







హైదరాబాద్ చార్మినార్ చెంత మిస్ వరల్డ్ పోటీదారుల గ్రూప్ ఫోటో

చార్మినార్ చెంత.. అందాల పుంత

- ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్
- చారిత్రక కట్టడానికి అందాల భామల ఫిదా
- మినార్లను ప్రత్యక్షంగా తిలకించి తన్మయత్వం

హైదరాబాద్/సిటీ/చార్మినార్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అందమంతా ఒక్కచోటకు చేరింది.. ప్రఖ్యాతి గాంచిన చార్మినార్ వద్ద సందడి చేసింది. మిస్ వరల్డ్ పోటీల కోసం పలు దేశాల నుంచి తరలివచ్చిన అందగత్తెలు మంగళవారం సాయంత్రం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఇక్కడి చారిత్రక కట్టడాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను పరిశీలిస్తూ ఉత్సాహంతో ఉరకలేశారు. ఆయా దేశాల సంప్రదాయ దుస్తులను ధరించి చార్మినార్‌కు వచ్చిన ముద్దుగుమ్మలకు అరబిక్ సంప్రదాయ వాయిద్యాలు, మర్ఫా సంగీతంతో కళాకారులు స్వాగతం పలికారు. లయబద్ధంగా చేసిన మర్ఫా సంగీతానికి పలువురు సుందరీమణులు ఆనందోత్సాహంతో అభివాదం చేస్తూ స్టెప్పులేస్తూ ప్రత్యేక వేదికపైకి చేరుకున్నారు. వేదిక వద్ద తెలుగు సంప్రదాయం ప్రకారం పర్యాటక అధికరారుల బృందం వారికి స్వాగతం పలికింది. ఓవైపు మర్ఫా సంగీతం, మరోవైపు స్థానికుల కేరింతల మధ్య ముద్దుగుమ్మలు చేసిన సందడితో చార్మినార్ పరిసరాలు సరికొత్త అందాన్ని సంతరించుకున్నాయి. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాలకు చెందిన 109 మంది అందగత్తెలు చార్మినార్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక మెట్ల వేదికపై వరుస క్రమంలో చేరుకుని చిరునవ్వులు చిందిస్తూ ఫొటో షూట్‌కు హాజరయ్యారు. చార్మినార్‌ను పరిశీలించిన అనంతరం ప్రపంచ సుందరి పోటీదారులు లాడ్‌బజార్‌లోకి ప్రవేశించారు. అక్కడి వ్యాపారులు తమ దుకాణాల్లో ముత్యాలు, రత్నాలు పొదిగిన రంగురంగుల డిజైన్‌ల లక్కగాజులను అందంగా అలంకరించారు. ఈ దుకాణాలను సందర్శించిన సుందరీమణులు అక్కడ ప్రదర్శించిన లక్కగాజులు, మేలివి ం ముత్యాల హారాలు, అలంకరణ వస్తు సామగ్రిని పరిశీలించారు. డిజైన్ గాజులను కొనుగోలు చేసేందుకు సుందరీమణులు ఎంపిక చేసుకోగా.. వ్యాపారులు వారి వద్ద డబ్బు తీసుకోకుండా కానుకగా అందించారు. అక్కడే లక్కగాజుల తయారీ ప్రక్రియను ముద్దుగుమ్మలు పరిశీలించారు. హస్తకళాకారులతో చేయి కలిపి అభినందించారు. లాడ్‌బజార్‌లో షాపింగ్ అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌కు చేరుకున్నారు. కాగా, చార్మినార్ వద్ద మిస్‌వరల్డ్ పోటీదారులతో ఏర్పాటు చేసిన హెరిటేజ్‌వాక్‌తో హైదరాబాద్ నగర సాంస్కృతిక వారసత్వం, వైభవ ప్రాభవ సౌందర్యాన్ని ప్రపంచానికి మరోసారి తెలియజేసినట్లయింది.

చార్మినార్, లాడ్‌బజార్‌లో మిస్‌వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా మూడంచెల భద్రత చేపట్టారు. లక్కగాజులకు పెట్టింది పేరుగా నిలిచే పాతబస్తీలోని లాడ్ బజార్‌ను మిస్‌వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఇరుకు గల్లీలో రెండు వైపులా ఉన్న గాజుల షాపులు, ముత్యాలహారాల దుకాణాలు, సంప్రదాయ పెళ్లి దుస్తులు, మెహిందీ కోన్లను కొనుగోలు చేసి సందడి చేశారు. కాగా, తమ దుకాణానికి వచ్చిన విదేశీ వనితలకు పలువురు నిర్వాహకులు బహుమతిగా చిన్నపాటి ముత్యాల దండలను ఇచ్చారు. అంతకుముందు పలువురు ఉస్మానియా బిస్కెట్లు తిని, ఇరానీ చాయ్ తాగారు.

చార్మినార్ వద్ద ప్రపంచ సుందరి పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో మంగళవారం వామపక్ష ప్రజాసంఘాలకు చెందిన పలువురు మహిళా నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. హిమాయత్‌నగర్‌లోని పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, నగర కార్యదర్శి వరలక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఏఐఎంఎస్ఎస్, పీఓడబ్ల్యూ, ఏఐడీఎస్ఓ, సీఎంఎస్, ఏఐడీవైఓ, ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ సంఘాల ప్రతినిధులు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

నేడు ఓరుగల్లుకు సుందరీమణులు

ప్రపంచ సుందరి పోటీదారులు బుధవారం ఓరుగల్లును సందర్శించనున్నారు. కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్న వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అందాలభామల రాక కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.